జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

కృష్ణ | మంగళవారం 18 ఆగస్టు 2026 | సంపుటి : 01 | సంచిక :216 | పేజీలు : 12 | వెల : 3/- | PRGI No. APTEL/26/A0119,

శ్రీ పరాభవ నామ సంవత్సరం ఆషాఢ మాసం గ్రీష్మ ఋతువు దక్షిణాయణం సూర్యోదయం: 5.42 । సూర్యాస్తమయం: 6.22 చంద్రోదయం: 4.57 । చంద్రాస్తమయం: 5.20 తిథి: బహుళ చతుర్దశి రా. 1.37 వరకు, తదుపరి అమావాస్య నక్షత్రం: పుష్యమి సా. 10.23 వరకు, తదుపరి ఆశ్లేష యోగం: సిద్ధి రా. 8.18 వరకు, తదుపరి వ్యతీపాత కరణం: భద్ర మ. 2.45 వరకు, తదుపరి శకుని రా. 1.37 వరకు, తదుపరి చతుష్పాద

Published from KRISHNA, GUNTOORU, VIJAYAWADA, VISHAKAPATANAM, TIRUPATHI http://www.prajajyothinews.com Mail: prajajyothidaily@gmail.com

**WANTED**

గత 15 సంవత్సరాలుగా ప్రజల మన్ననలు పొందుతూ ప్రజల సమస్యలే ధ్యేయంగా పోరాడుతున్న "ప్రజాజ్యోతి" జాతీయ దినపత్రికకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా జిల్లా స్టాఫ్ రిపోర్టర్, నియోజకవర్గ ఇంఛార్జీలు మరియు మండల రిపోర్టర్లు కావలెను.
అనుభవం కలిగిన రిపోర్టర్లు మరియు చక్కటి వార్తలు రాయగలిగే కొత్తవారికి కూడా అవకాశం కల్పించబడును.

ప్రజాజ్యోతి

సంప్రదించవలసిన నెంబర్లు
9440231967


## భారత్‌లో 100 కోట్ల మందికి ఓటరు గుర్తింపు కార్డులు

- ట్రంప్ పోస్ట్ నేపథ్యంలో ఈసీ కీలక ప్రకటన!
- దేశంలో దాదాపు 100 కోట్ల మంది ఓటర్లకు ఫొటో గుర్తింపు కార్డులు జారీ
- ఈసీ కీలక ప్రకటన- ఓటర్ ఐడీల ప్రాధాన్యతను వివరిస్తూ ట్రంప్ భారత్‌ను ఉదాహరణగా చూపడంతో వివరాల్ని వెల్లడించిన ఈసీ




## 26/11 నిందితులపై 'ట్రయల్ ఇన్ ఆబ్సెంటియా'


- ఉగ్రవాదాన్ని తుదముట్టించేందుకు ఎంతటి చర్యలకైనా సిద్ధమన్న కేంద్రం
- 26/11 ముంబయి దాడుల కేసులో పాకిస్థాన్‌కు చెందిన ఆరుగురు నిందితులపై ట్రయల్ ఇన్ ఆబ్సెంటియా
- నిందితులు లేకున్నా విచారణ ప్రారంభం
- ఉగ్రవాదాన్ని తుదముట్టించడమే భారత లక్ష్యమని ఎంఈఏ స్పష్టం





## విద్యార్థుల మాట ప్రభుత్వం వినడం సంతోషకరంగా ఉంది

- ఇదే సరైన మార్గం: రాహుల్ గాంధీ
- విద్యార్థులు, ఝార్ఖండ్ ప్రభుత్వం మధ్య ఏకాభిప్రాయం కుదరడంపై రాహుల్ గాంధీ హర్షం
- విద్యార్థుల భవిష్యత్తుకు న్యాయం జరిగేలా దేశవ్యాప్తంగా వ్యవస్థను మార్చాల్సిన అవసరం ఉందని వెల్లడి



### స్పష్టమైన విజన్, పారదర్శక పాలనే

## విజయానికి మూలం

- పెట్టుబడుల్లో ఏపీ దూకుడు.. దేశంలోనే 2వ స్థానం
- చంద్రబాబు విజన్ వల్లేనన్న మంత్రి లోకేశ్
- నూతన పెట్టుబడులను ఆకర్షించడంలో ఏపీకి దేశంలో 2వ స్థానం
- కేవలం 24 నెలల్లోనే 9వ స్థానం నుంచి రెండో ర్యాంకుకు చేరిన రాష్ట్రం
- సీఎం చంద్రబాబు నాయకత్వమే కారణమన్న మంత్రి లోకేశ్
- ప్రపంచ పెట్టుబడిదారుల దృష్టి ఇప్పుడు ఏపీపై ఉందని వ్యాఖ్య

**అమరావతి**

నూతన పెట్టుబడులను ఆకర్షించడంలో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే రెండో స్థానానికి చేరుకుందని రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ తెలిపారు. కేవలం 24 నెలల వ్యవధిలోనే రాష్ట్రం 9వ స్థానం నుంచి 2వ స్థానానికి ఎగబాకిందని ఆయన వెల్లడించారు. ఈ ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబు దార్శనిక నాయకత్వం వల్లే సాధ్యమైందని లోకేశ్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. "ముఖ్యమంత్రి - మిగతా3లో

## అక్టోబర్‌లోగా స్థానిక సంస్థల

# ఎన్నికలు

- బీసీ రిజర్వేషన్ల అమలుకు కేబినెట్ ఆమోదం
- సీఎం చంద్రబాబు అధ్యక్షతన మంత్రివర్గ సమావేశం
- స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ల అమలే ప్రధాన అజెండాగా భేటీ
- పరిశ్రమలు, ఐటీ, ఇంధనం, పర్యాటక రంగాలపై చర్చ



**అమరావతి**

స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్ల అమలుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. గ్రామీణ స్థానిక సంస్థల్లో 34 శాతం, పట్టణ స్థానిక సంస్థల్లో 33.1 శాతం బీసీ రిజర్వేషన్లు అమలు చేయాలని నిర్ణయించింది. కేంద్ర ఆర్థిక సంఘం నుంచి రావాల్సిన సుమారు రూ.16,500 కోట్ల నిధులు మురిగిపోకుండా అక్టోబర్‌లోగా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని కేబినెట్ నిర్ణయించింది. ఏపీ పంచాయతీరాజ్ చట్టం-1994 నిబంధనల ప్రకారం బీసీ రిజర్వేషన్లతోనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని కేబినెట్ నిర్ణయం తీసుకుంది. న్యాయపరమైన అంశాల్లో ఉన్న 23 మునిసిపాలిటీల విలీనాన్ని తర్వాత పరిశీలిద్దామని, ముందుగా అన్ని స్థానిక సంస్థల్లో ఎన్నికలు నిర్వహిద్దామని - మిగతా3లో




## విద్యార్థులపై నమోదైన ఎఫ్ఐఆర్‌ల ఉపసంహరణలో జాప్యం వద్దు

- విద్యార్థులపై నమోదైన కేసులను ఎత్తివేయాల్సిందేనన్న కాక్రోచ్ జనతా పార్టీ
- కోర్టు అడిగిన ఎఫ్ఐఆర్‌ల జాబితాను ప్రభుత్వం ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్న
- విద్యార్థులకు సంబంధించిన అసలు సమస్య ఆందోళనల్లో పాల్గొన్నందుకు నమోదైన కేసులను రద్దు చేయడమే

## బీసీ రిజర్వేషన్లపై కేసులు వేస్తే

# చరిత్రహీనులే

- బీసీ రిజర్వేషన్ల అంశంపై అసెంబ్లీలో ప్రసంగించిన సీఎం చంద్రబాబు
- స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు పునరుద్ధరణ
- మేయర్లు, మున్సిపల్ ఛైర్మన్ల ఎన్నిక ఇకపై ప్రత్యక్ష పద్ధతిలో నిర్వహణ
- గత ప్రభుత్వం రిజర్వేషన్లను 24 శాతానికి తగ్గించిందని చంద్రబాబు విమర్శ
- రాష్ట్రంలో జిల్లా ప్రజా పరిషత్‌ల సంఖ్యను 13 నుంచి 28కి పెంచాలని నిర్ణయం



**అమరావతి**

బీసీ రిజర్వేషన్ల పునరుద్ధరణపై ఎవరైనా కోర్టుకు వెళ్లి కేసులు వేస్తే, వారు చరిత్రహీనులుగా మిగిలిపోతారని ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్రంగా హెచ్చరించారు. స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లను పునరుద్ధరిస్తూ కూటమి ప్రభుత్వం తీసుకున్న చారిత్రక నిర్ణయాన్ని అడ్డుకోవాలని చూసే శక్తులను ప్రజానీకం, చరిత్ర క్షమించవని ఆయన స్పష్టం చేశారు. మంగళవారం శాసనసభలో బీసీ రిజర్వేషన్ల అంశంపై ప్రసంగించిన ఆయన, గత ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ, తమ ప్రభుత్వ లక్ష్యాలను సవివరంగా ప్రకటించారు. బీసీల సామాజిక, రాజకీయ అభ్యున్నతి కోసం రాష్ట్ర మంత్రివర్గం మూడు కీలక నిర్ణయాలు తీసుకుందని చంద్రబాబు తెలిపారు. గ్రామీణ స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం, పట్టణ స్థానిక సంస్థల్లో 33.33 శాతం రిజర్వేషన్లు కల్పించాలని కేబినెట్ ఆమోదం తెలిపిందన్నారు. దీంతో పాటు, పట్టణాల్లో మేయర్లు, మున్సిపల్ ఛైర్మన్ల ఎన్నికను ప్రత్యక్ష పద్ధతిలో నిర్వహించాలని నిర్ణయించామని, ఇది 'ఆయారాం గయారాం' రాజకీయాలకు తెరదించి, సుస్థిరమైన పాలనకు దోహదపడుతుందని వివరించారు. పరిపాలనా సౌలభ్యం కోసం రాష్ట్రంలోని 28 జిల్లాలకు అనుగుణంగా 28 జిల్లా ప్రజాపరిషత్‌లను ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. బీసీ రిజర్వేషన్ల విషయంలో తెలుగుదేశం పార్టీకి ముందు, ఆ తర్వాత అని స్పష్టంగా చూడవచ్చని చంద్రబాబు అన్నారు. ఎన్టీఆర్ టీడీపీని స్థాపించిన తర్వాతే బీసీలకు రాజ్యాధికారం దక్కిందన్నారు. 1984లో స్థానిక సంస్థల్లో బీసీలకు రిజర్వేషన్లు కల్పించిన ఘనత ఎన్టీఆర్‌దేనని గుర్తుచేశారు. ఆ స్ఫూర్తితోనే తాను 1995లో - మిగతా3లో

## 2027 అసెంబ్లీ ఎన్నికల వేళ యూపీ, పంజాబ్, గుజరాత్‌కు బీజేపీ ఇన్‌చార్జ్‌లు

- పంజాబ్ బాధ్యతలు సతీశ్ పూనియాకు
- గుజరాత్ ఇన్‌ఛార్జ్‌గా తరుణ్ చుగ్
- వచ్చే అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో బీజేపీ కీలక నియామకాలు



## ప్రతిపక్షాలు అసాంఘిక శక్తులను

# ప్రోత్సహిస్తున్నాయి

- మోదీపై వ్యాఖ్యలకు గట్టిగా బదులివ్వాలి
- విశాఖలో బీజేపీ శ్రేణులకు నితిన్ నబిన్ పిలుపు
- కాంగ్రెస్ ప్రజాస్వామ్య సంస్థలను పదేపదే అవమానిస్తోందని విమర్శ
- రాహుల్ గాంధీ ఒక పార్ట్-టైమ్ రాజకీయ నాయకుడని ఎద్దేవా
- యువత ఆకాంక్షలపై దృష్టి సారించాలని పార్టీ నేతలకు సూచన



**అమరావతి**

దేశంలోని ప్రతిపక్షాలు అసాంఘిక శక్తులను ప్రోత్సహిస్తున్నాయని బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై ప్రతిపక్ష నేతలు ఉపయోగిస్తున్న అనుచిత భాషపై పార్టీ శ్రేణులు సంయమనం పాటిస్తూనే, పార్టీ గౌరవానికి భంగం కలగకుండా దీటుగా సమాధానం చెప్పాలని ఆయన పిలుపునిచ్చారు. మంగళవారం విశాఖపట్నంలో నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ బీజేపీ రాష్ట్ర విస్తృత కార్యవర్గ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. కాంగ్రెస్ పార్టీ నిరంతరం ప్రజాస్వామ్య వ్యవస్థలను అవమానపరుస్తోందని - మిగతా3లో

# భారత్‌లో 100 కోట్ల మందికి ఓటరు గుర్తింపు కార్డులు

భారతదేశంలో దాదాపు 100 కోట్ల మంది అర్హులైన ఓటర్లకు ప్రత్యేక ఎలక్టోరల్ ఫొటో ఐడెంటిటీ కార్డులు జారీ చేసినట్లు ఎన్నికల సంఘం అధికారులు మంగళవారం తెలిపారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అక్కడ ఓటింగ్ సంస్కరణల కోసం భారతదేశ ఓటర్ ఐడీల విధానాన్ని ఉదాహరణగా ప్రస్తావించిన నేపథ్యంలో భారత ఎన్నికల సంఘం ఈ కీలక వివరాల్ని వెల్లడించింది. భారతదేశంలో ప్రతి ఓటరూ కచ్చితంగా ఫొటో గుర్తింపు కార్డు ఆధారంగానే ఓటు వేస్తారని అధికారులు నొక్కి చెప్పారు. ఓటర్లు తమ వ-జ్యూ×జ ను కూడా ప్రత్యేక వెబ్‌సైట్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకునే అవకాశం ఉందని తెలిపారు. అమెరికాలో ఓటర్ల అక్రమాలను అరికట్టేందుకు, పౌరసత్వ ధ్రువీకరణను తప్పనిసరి చేసే సేవ్ (సేఫ్‌గార్డ్ అమెరికన్ ఓటర్ ఎలిజిబులిటీ - ూూాఎజు) అమెరికా యాక్ట్‌కు మద్దతుగా ట్రంప్ సోషల్ మీడియా వేదిక ట్రూత్ సోషల్‌లో పోస్ట్ చేశారు. ఇటీవల జరిగిన భారత సార్వత్రిక ఎన్నికల్లో ఓటర్ల గుర్తింపు విధానం ఎంతో పటిష్టంగా ఉందని ట్రంప్ కొనియాడారు. ఈ క్రమంలోనే అమెరికా ఎన్నికల్లో కూడా ఓటర్లకు ఫొటో ఐడీ కార్డులను తప్పనిసరి చేయాలని ఆయన గట్టిగా డిమాండ్ చేస్తున్నారు.




### ట్రంప్ ఏం పోస్ట్ చేశారంటే?

కొద్ది రోజుల కిందట భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్? కుమార్ అమెరికా ఎన్నికల వ్యవస్థపై ప్రశ్నించారు. భారత్‌లో మాదిరిగా ఓటు వేసేందుకు చెల్లుబాటు అయ్యే ఫొటో గుర్తింపు కార్డు (వాలిడ్ ఫొటో ఐడీ) లేకుండా అమెరికాలో ఎన్నికలు ఎలా నిర్వహించగలుగుతున్నారని అడిగారు. దీనిపై తాజాగా ట్రంప్ స్పందిస్తూ ట్రూత్ సోషల్‌లో పోస్ట్ చేశారు. 'ఈ నెల ప్రారంభంలో భారత చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేశ్? కుమార్ మన అధికార యంత్రాంగాన్ని ఒక ప్రశ్న అడిగారు. చెల్లుబాటు అయ్యే ఫొటో ఐడీ లేకుండా అమెరికాలో ఎన్నికలు ఎలా నిర్వహిస్తారని ప్రశ్నించారు. భారత్‌లో జరిగిన గత సార్వత్రిక ఎన్నికల్లో ఏకంగా 64.6 కోట్ల మంది ఓటర్లు పాల్గొనగా, వారిలో పోస్టల్ బ్యాలెట్ ఉపయోగించిన వారు ఒక శాతం కంటే తక్కువే. ప్రతి ఒక్క ఓటరు దగ్గర కచ్చితంగా ప్రభుత్వ ఫొటో ఐడీ కార్డు ఉంది' అని ట్రంప్ ప్రశంసించారు.


### అత్యంత పారదర్శకంగా భారత ఎన్నికల వ్యవస్థ: ఈసీ

ఈ సందర్భంగానే భారత ఎన్నికల కమిషన్ అధికారులు తమ నిష్పాక్షికమైన ఎన్నికల నిర్వహణ తీరును వివరించారు. ఈసీ ప్రకారం- దేశవ్యాప్తంగా ఉన్న 12 లక్షల పోలింగ్ స్టేషన్లకు గానూ ప్రభుత్వ ఉద్యోగులైన బూత్ లెవెల్ అధికారులు (దీూూ) ఓటర్ల జాబితాల్ని సిద్ధం చేస్తారు. వీటిని రాజకీయ పార్టీలు నియమించిన బూత్ లెవెల్ ఏజెంట్లు (దీూూ) నిరంతరం ఆడిట్ చేస్తారు. పోలింగ్ రోజున అభ్యర్థులు పోలింగ్ ఏజెంట్లు ఓటింగ్ కేంద్రాల్లో ఉండి ప్రక్రియను పర్యవేక్షిస్తారు. అలానే ఓట్ల లెక్కింపు సమయంలో కూడా కౌంటింగ్ ఏజెంట్లు ప్రత్యక్షంగా హాజరై ఓటింగ్, కౌంటింగ్ పారదర్శకతను నిర్ధరిస్తారు. ఫిజికల్ కార్డుల్ని ఓటర్లకు అందించడంతో పాటు డిజిటల్ రూపంలో కూడా తమ ఓటరు ఐడీని ఎన్నికల సంఘం అధికారిక వెబ్‌సైట్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకునే సదుపాయం కూడా ఉంది.

అమెరికాలో సేవ్ అమెరికా యాక్ట్‌కు మద్దతు కూడగట్టే ప్రయత్నంలో భాగంగానే ట్రంప్ తాజాగా భారత ఎన్నికల వ్యవస్థను ప్రస్తావిస్తూ ఈ పోస్ట్ చేసినట్లు తెలుస్తోంది. ఈ చట్టం ద్వారా ఓటరు నమోదు సమయంలో సదరు పౌరులు పౌరసత్వానికి సంబంధించిన ఆధారాలు సమర్పించడం, దేశవ్యాప్తంగా ఓటర్ ఐడీ అవసరాన్ని తీసుకురావడం, పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌పై పరిమితులు విధించడం వంటి ప్రతిపాదనలు ఉన్నాయి. ఇందులో భాగంగానే తన వాదనలకు బలం చేకూర్చేందుకు, భారత్‌ను ఉదాహరణగా చూపిస్తూ సేవ్ అమెరికా యాక్ట్‌ను ఆమోదించుకోవాలని ట్రంప్ చూస్తున్నారు. ఈ క్రమంలోనే యూఎస్ ఎన్నికల్లో కఠిన నిబంధనలు అమలు చేయాలని ట్రంప్ తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. అసలైన అమెరికన్ పౌరులే ఎన్నికల్లో ఓటేసేలా చూడటమే దీని ఉద్దేశమని చెబుతున్నారు.

# 26/11 నిందితులపై 'ట్రయల్ ఇన్ ఆబ్సెంటియా'

ఉగ్రవాదాన్ని తుదముట్టించేందుకు, ఉగ్రదాడుల వెనుక ఉన్న నిందితుల్ని చట్టం ముందు నిలబెట్టేందుకు భారతదేశం 'ఎంతటి చర్యలకైనా వెనుకాడదు' కేంద్ర విదేశాంగ మంత్రిత్వ శాఖ (వీజూూ) స్పష్టం చేసింది. 2008 నాటి 26/11 ముంబయి ఉగ్రదాడి కేసులో పాకిస్థాన్‌లో దాక్కున్న ఆరుగురు ప్రధాన నిందితులపై ముంబై పోలీసులు 'ట్రయల్ ఇన్ ఆబ్సెంటియా' ప్రక్రియను ప్రారంభించిన నేపథ్యంలోనే ఎంఈఏ ఈ కీలక వ్యాఖ్యలు చేసింది. ఆరోపణలు ఎదుర్కొం టున్న నిందితులు కోర్టుకు హాజరుకాకపోయినా విచారణ జరిపే విధానాన్నే ట్రయల్ ఇన్ ఆబ్సెంటియా అంటారు. దీనిపైనే మాట్లాడిన భారత విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్- సరిహద్దు ఉగ్రవాదంపై భారత్ అనుసరిస్తున్న జీరో టాలరెన్స్ విధానాన్ని పునరుద్ఘాటించారు. ఉగ్రవాదాన్ని ఎదుర్కునే విషయంలో ఏమాత్రం వెనక్కి తగ్గబోమని, ఎలాంటి చర్యలైనా తీసుకుంటామని జైస్వాల్ స్పష్టం చేశారు. ఉగ్రవాదం వల్ల భారత్ తీవ్రంగా నష్టపోయిందని, ఉగ్రవాద చర్యలు ఎంత తీవ్రమైనవో అంతర్జాతీయ సమాజం గుర్తించాలనే తాము కోరుతున్నట్లు తెలిపారు. ఉగ్రవాదాన్ని, ముఖ్యంగా సరిహద్దు బయట జరిగే ఉగ్రవాదాన్ని ఎదుర్కొనేందుకు ప్రపంచ దేశాల్ని ఏకం చేసేందుకు భారత్ నిరంతరం శ్రమిస్తోందని, ఈ పోరాటంలో ఏమాత్రం వెనక్కి తగ్గబోదని జైస్వాల్ వెల్లడించారు.



### హాఫీజ్ సయీద్ సహా నిందితులు వీరే

26/11 కేసులో పాకిస్థాన్‌కు చెందిన ఆరుగురు నిందితులపై ముంబయి పోలీసులు ట్రయల్ ఇన్ ఆబ్సెంటియాకు (గైర్హాజరీలో విచారణ) సంబంధించిన ప్రక్రియను ప్రారంభించారు. వీరిలో లష్కరే తోయిబా (ూజు) వ్యవస్థాపకుడు హాఫీజ్ సయీద్, సీనియర్ ఆపరేటివ్ జకీ-ఉర్- రెహ్మాన్ లఖ్వీ, సాజిద్ మీర్, అబు అల్కామా, అసిమ్ అలియాస్ అబు కహాఫా, మేజర్ అబ్దుర్ రెహ్మాన్ పాషా ఉన్నారు. ఈ నిందితులు ప్రస్తుతం పరారీలో ఉన్న నేపథ్యంలో ముంబయి పోలీసులు ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఉజ్వల్ నిగమ్‌కు లేఖ రాసి తదుపరి ప్రక్రియ ప్రారంభించాలని కోరారు. ఇలాంటి ఉగ్రవాద కేసులో భారతీయ నాగరిక్ సురక్షా సంహిత (దీచీచీూ), 2003లోని సెక్షన్ 356 కింద ట్రయల్ ఇన్ ఆబ్సెంటియాకు సంబంధించిన నిబంధనల్ని తొలిసారి వినియోగిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఉజ్వల్ నిగమ్ ప్రకారం- పరారీలోని నిందితులు కోర్టుకు హాజరుకాకపోయినా వారిపై విచారణ కొనసాగించేందుకు సెక్షన్ 356 అవకాశం కల్పిస్తుంది. న్యాయ ప్రక్రియలో అనవసర జాప్యాన్ని నివారించడమే దీని ఉద్దేశమని ఆయన తెలిపారు. ఇక 2008 నవంబర్ 26న పాకిస్థాన్‌కు చెందిన లష్కరే తోయిబా ఉగ్రవాదులు ముంబయి నగరంపై భీకర దాడులు చేశారు. ఈ ఘటనలో 160 మందికిపైగా పౌరులు ప్రాణాలు కోల్పోగా, వందలాది మంది గాయపడ్డారు. ఈ దాడులకు ప్రణాళిక రూపొందించడం, సహకరించడం వంటి ఆరోపణలు ఎదుర్కొంటున్న పాకిస్థాన్‌లో దాక్కున్న నిందితులపై చర్యలు తీసుకోవాలని భారత్ పదేపదే కోరుతూ వచ్చింది. ఇటీవల స్వాతంత్ర్య దినోత్సవానికి ముందు 14 రాష్ట్రాల్లో భారత భద్రతా దళాలు నిర్వహించిన విస్తృత ఆపరేషన్లలో పాకిస్థాన్ ఐఎస్ఐ మద్దతు ఉన్న షాజాద్ భట్టి ఉగ్రవాద నెట్‌వర్క్‌ను నిర్వీర్యం చేశాయి. ఈ దాడుల్లో 253 మందిని అదుపులోకి తీసుకోగా, 80కిపైగా ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసి, 200 కుపైగా ఆపరేటర్లను అరెస్ట్ చేసినట్లు భద్రతా సంస్థలు వెల్లడించాయి. ఇక ఈ కుట్రలతో తమకు సంబంధం లేదని పాకిస్థాన్ చేస్తున్న ప్రకటనల్ని విదేశాంగ శాఖ తీవ్రంగా ఖండించింది. షాజాద్ భట్టీ నెట్‌వర్క్‌కు ఐఎస్ఐతో సంబంధం ఉందని భారత్ వాదిస్తుండగా పాకిస్థాన్ దీనిని తిరస్కరించింది. దీనిపై మాట్లాడిన జైస్వాల్, భారత ప్రభుత్వం ఇప్పటికే దీనిపై తమ వైఖరిని వెల్లడించిందని, దానికే కట్టుబడి ఉంటుందని తెలిపారు.

### జమ్మూలో ూజు కమాండర్‌పై నాన్ బెయిలబుల్ వారెంట్

ఇక పాకిస్థాన్‌కు చెందిన లష్కరే తోయిబా ఆపరేషనల్ కమాండర్ మహ్మద్ యాకూబ్‌పై జమ్మూలోని ప్రత్యేక ఎన్ఐఏ కోర్టు నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది. జమ్మూకశ్మీర్‌లో ఉగ్ర కార్యకలాపాలకు పాల్పడిన కేసులో పరారీలో ఉన్న నిందితుడిపై ఈ వారెంట్ జారీ చేసినట్లు అధికారులు మంగళవారం తెలిపారు. ఈ యాకూబ్‌ను అబు సుమామా, సుమామా ఇల్యాస్, వారిస్ అలీ అనే పేర్లు కూడా ఉన్నాయని వెల్లడించారు. యాకూబ్ ఇస్లామాబాద్‌లోని చట్టా బఖ్తావర్ ప్రాంతం నుంచి లష్కరే తోయిబా కార్యకలాపాల్ని నిర్వహిస్తున్నట్లు వారు పేర్కొన్నారు.

# విద్యార్థులపై నమోదైన ఎఫ్ఐఆర్‌ల ఉపసంహరణలో జాప్యం వద్దు

విద్యార్థుల ఆందోళనకు సంబంధించిన కేసులో విషయంలో దిల్లీ ప్రభుత్వం జాప్యం చేయొద్దని కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) డిమాండ్ చేసింది. ఆందోళనల్లో పాల్గొన్న విద్యార్థులపై నమోదైన ఎఫ్ఐఆర్‌లను రద్దు చేయాలని తెలిపింది. కోర్టు ఆదేశాల మేరకు కొట్టివేయాల్సిన ఎఫ్ఐఆర్‌ల జాబితాను ప్రభుత్వం వెంటనే సమర్పించాలని సీజేపీ ప్రతినిధి సౌరవ్ దాస్ డిమాండ్ చేశారు.

కోర్టు ఎఫ్ఐఆర్‌ల వివరాలను కోరుతున్నప్పుడు ప్రభుత్వం వాటిని సమర్పించడంలో ఎందుకు వెనుకాడుతోందని దాస్ ప్రశ్నించారు. ఈ వ్యవహారాన్ని మరింత ఆలస్యం చేసే ప్రయత్నాలను అంగీకరించబోమని స్పష్టం చేశారు. విద్యార్థులకు సంబంధించిన అసలు సమస్య ఆందోళనల్లో పాల్గొన్నందుకు నమోదైన కేసులను రద్దు చేయడమేనని అన్నారు. ప్రభుత్వం ఇతర నేర కేసులపై చర్యలు తీసుకోవాలనుకుంటే అది వేరే అంశమని పేర్కొన్నారు. సుమారు 2,800 మంది తీవ్ర నేరాలకు పాల్పడిన వ్యక్తులను గుర్తించినట్లు ప్రభుత్వం చెబుతోందని అన్నారు. వారిపై చర్యలు తీసుకోవడాన్ని విద్యార్థుల కేసులతో ముడిపెట్టడం సరికాదని స్పష్టం చేశారు. ఆందోళనల్లో పాల్గొన్న విద్యార్థులు భవిష్యత్తులోనూ చట్టపరమైన సమస్యలు ఎదుర్కోకుండా చూడాలని సీజేపీ కోరుతోంది. కేసులను కేవలం క్లోజ్ చేసినట్లు చూపడం కాకుండా, విద్యార్థులపై నమోదైన ఎఫ్ఐఆర్‌లను అధికారికంగా ఉపసంహరించుకోవాలని పార్టీ డిమాండ్ చేస్తోంది.

### దర్యాప్తు జరిపేందుకు హైపవర్డ్ కమిటీ

మరోవైపు నిరసనకారులపై పోలీసు చర్యకు వ్యతిరేకంగా కోర్టు పర్యవేక్షణలో దర్యాప్తు చేపట్టాలని దాఖలపైన పిటిషన్?పై సుప్రీంకోర్టు మంగళవారం విచారణ చేపట్టింది. నిరసనల సందర్భంగా వచ్చిన ఆరోపణలపై విచారణ జరిపేందుకు హైపవర్డ్ కమిటీ ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొంది. ఆ రోజు జరిగిన మార్చ్ ఫుటేజీని కమిటీ పరిశీలిస్తుందని తెలిపింది. అలాగే మహిళా ఆందోళనకారుల్ని లక్ష్యంగా చేసుకున్నారంటూ వచ్చిన ఆరోపణలపై కూడా దర్యాప్తు జరుగుతుందని వెల్లడించింది. ఈ ప్యానెల్‌లో మాజీ న్యాయమూర్తులు, సీబీఐ మాజీ డైరెక్టర్, రాష్ట్ర మాజీ డీజీపీ సభ్యులుగా ఉంటారని చెప్పింది. నిరసనకారులపై పోలీసు చర్యకు వ్యతిరేకంగా కోర్టు పర్యవేక్షణలో దర్యాప్తు చేపట్టాలని దాఖలైన పిటిష పిటిషన్లు దాఖలైన సంగతి తెలిసిందే.




### ఆరోపణలను ఖండించిన దిల్లీ పోలీసులు

అయితే తమపై వచ్చిన ఆరోపణలను సుప్రీంకోర్టులో దిల్లీ పోలీసులు ఖండించారు. జులై 20న సీజేపీ నిర్వహించిన మార్చ్‌లో నిరసనకారులు బారికేడ్లను బద్దలుకొట్టి, పార్లమెంటు వైపు దూసుకెళ్లే ప్రయత్నం చేయడం వల్లే హింస చెలరేగిందని స్పష్టం చేశారు. సుప్రీంకోర్టులో దాఖలు చేసిన కౌంటర్ అఫిడవిట్‌లో డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ సచిన్ శర్మ ఈ వివరాలు వెల్లడించారు. సుమారు 3 కిలోమీటర్ల పరిధిలో 30,000 మందికి పైగా నిరసనకారులు గుమికూడగా వారిని నియంత్రించేందుకు 5,000 మంది పోలీసులను మోహరించినట్లు డీసీపీ తెలిపారు. పరిస్థితి అదుపు తప్పడంతోనే పోలీసుల జోక్యం అనివార్యమైందని ఈ ఘర్షణల్లో ఇరువైపులా గాయాలయ్యాయని పేర్కొన్నారు. పోలీసుల చర్యలు చట్టబద్ధంగానే ఉన్నాయని ఎలాంటి అక్రమ లేదా అనవసర బలప్రయోగం జరగలేదని అఫిడవిట్‌లో స్పష్టం చేశారు. విద్యార్థుల ఆందోళనలో భాగంగా జులై 20న సీజేపీ ఆధ్వర్యంలో పార్లమెంట్ మార్చ్ నిర్వహించారు. పార్లమెంట్ వైపు ర్యాలీగా వెళ్తున్న విద్యార్థులు, ఇతర ఆందోళనకారులను పోలీసులు అడ్డుకున్నారు. దిల్లీలో ఏర్పాటు చేసిన బారికేడ్లను దాటి ముందుకు వెళ్లేందుకు కొందరు ప్రయత్నించడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ఆందోళనకారులను చెదరగొట్టేందుకు పోలీసులు బాష్పవాయువు ప్రయోగించడంతో పాటు లాఠీచార్జ్ చేశారు. పోలీసుల చర్యలకు సంబంధించిన పలు వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి. నిరసనకారులపై పోలీసులు దురుసుగా వ్యవహరించారని కొన్ని వర్గాలు ఆరోపించాయి. అయితే పోలీసు శాఖ తన చర్యలను సమర్థించుకుంది.

## విద్యార్థుల మాట ప్రభుత్వం వినడం సంతోషకరంగా ఉంది

ఝార్ఖండ్ ప్రభుత్వం, విద్యార్థుల మధ్య చర్చలు సఫలం కావడం పట్ల కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మంగళవారం హర్షం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ చర్చల మార్గాన్ని ఎంచుకోవడం, విద్యార్థులు సంయమనం పాటించి తమ డిమాండ్లను ఆమోదించేలా చేసుకోవడం సరైన విధానమని ప్రశంసించారు. విద్యార్థులను వెనక్కి లాగడానికి బదులుగా వారిని ముందుకు నడిపించే వ్యవస్థను దేశవ్యాప్తంగా ఏర్పాటు చేస్తానని రాహుల్? గాంధీ హామీ ఇచ్చారు.

"ఝార్ఖండ్ విద్యార్థులు- రాష్ట్ర ప్రభుత్వం మధ్య ఏకాభిప్రాయం కుదిరింది. విద్యార్థులు తమ నిరాహార దీక్షను విరమించారు. ఈ వార్త వినడం సంతోషాన్ని ఇచ్చింది. ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్, ఝార్ఖండ్ ప్రభుత్వం చర్చల మార్గాన్ని ఎంచుకుని పరిష్కారాన్ని కనుగొన్నారు. విద్యార్థులు సంయమనం పాటించి తమ డిమాండ్లను ఆమోదించేలా చేసుకున్నారు. ఇదే సరైన మార్గం. విద్యార్థులు ప్రశ్నలు అడిగినప్పుడు వారికి సమాధానాలు లభించాలి. మేము దేశంలోని ప్రతి విద్యార్థికి అండగా ఉంటాము. ప్రతి విద్యార్థికి వారి కష్టానికి తగిన ప్రతిఫలం, న్యాయమైన పోటీలో పాల్గొనేలా ఈ వ్యవస్థను పూర్తిగా మారుస్తాం" అని రాహుల్ గాంధీ తెలిపారు.

### జేఎస్ఎస్‌సీ-సీజీఎల్ పరీక్ష రద్దు

విద్యార్థుల డిమాండ్ల నేపథ్యంలో ఝార్ఖండ్ ప్రభుత్వం జేఎస్ఎస్‌సీ-సీజీఎల్ పరీక్షను రద్దు చేయాలని నిర్ణయించింది. అలాగే టీడీపీఎల్ సంస్థ నిర్వహించిన పరీక్షలు, వెలువడిన ఫలితాలు, ఆ ప్రక్రియ ద్వారా ఎంపికైన అభ్యర్థులకు సంబంధించిన చర్యలన్నింటినీ రద్దు చేయాలని కేబినెట్ నిర్ణయించింది. 2014 నుంచి రాష్ట్రంలో నిర్వహించిన వివిధ నియామక పరీక్షల్లో అవకతవకలు జరిగాయన్న ఆరోపణలపై సమగ్ర విచారణకు కూడా ప్రభుత్వం ఆదేశించింది. అలాగే రాంచీలోని సదర్ ఆసుపత్రిలో విద్యార్థి నేత దేవేంద్రనాథ్ మహతో నిరాహార దీక్ష విరమించారు. రాష్ట్ర మంత్రులు దీపికా పాండే సింగ్, ఇర్ఫాన్ అన్సారీ సమక్షంలో ఆయన దీక్షను ముగించారు. రాష్ట్రంలో నియామక పరీక్షల నిర్వహణ, పారదర్శకత, అవకతవకలపై విద్యార్థులు చాలాకాలంగా ఆందోళన చేస్తున్నారు. ఈ క్రమంలో మహతో నిరాహార దీక్షకు దిగారు. ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ కీలక నిర్ణయాలు ప్రకటించడంతో ప్రభుత్వం-విద్యార్థుల మధ్య చర్చలు కొలిక్కి వచ్చాయి.

### జేపీఎస్‌సీ పరీక్షలపైనా విచారణ

ఝార్ఖండ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (జేపీఎస్‌సీ) సివిల్ సర్వీసెస్ పరీక్షల్లో అవకతవకల ఆరోపణలపైనా సమగ్ర విచారణ చేపట్టనున్నట్లు సీఎం హేమంత్ సోరెన్ ప్రకటించారు. ఈ దర్యాప్తును రిటైర్డ్ న్యాయమూర్తి పర్యవేక్షణలో నిర్వహించాలని నిర్ణయించారు. ఇప్పటికే ఎస్ఐటీ, సీఐడీ ఈ వ్యవహారంపై దర్యాప్తు చేస్తున్నాయని, విచారణలో పలు దిగ్భ్రాంతికర విషయాలు వెలుగులోకి వచ్చాయని సోరెన్ తెలిపారు. జేపీఎస్‌సీ ద్వారా నియమితులైన కొందరిని పరీక్షల్లో అక్రమాలకు సంబంధించిన కేసుల్లో అరెస్టు చేసినట్లు కూడా పేర్కొన్నారు. యువత ప్రధానంగా జేపీఎస్‌సీ సివిల్ సర్వీసెస్ పరీక్షలపై స్పష్టత కోరుతోందని సోరెన్ తెలిపారు. ఈ అంశంపై ఇప్పటికే ప్రభుత్వం తరఫున ఓ మంత్రి దర్యాప్తు జరుగుతోందని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. కొన్ని సందర్భాల్లో ప్రభుత్వం చెప్పిందే సరైనదిగా అనిపిస్తుందని, మరికొన్ని సందర్భాల్లో విద్యార్థుల వాదనలో నిజం కనిపిస్తుందని అన్నారు. రెండు వైపుల వాదనల్లో వాస్తవాన్ని తేల్చేందుకు సమగ్ర విచారణ అవసరమని సీఎం పేర్కొన్నారు.

### పరీక్ష రద్దుతో కొత్తగా మరో ఆందోళన

ఒకవైపు విద్యార్థుల ఆందోళనకు పరిష్కారం లభించినప్పటికీ, మరోవైపు జేఎస్ఎస్‌సీ-సీజీఎల్ ద్వారా ఇప్పటికే నియమితులైన ఉద్యోగులు కొత్త సమస్యను ఎదుర్కొంటున్నారు. పరీక్ష రద్దు నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ పలువురు ఉద్యోగులు రాంచీలోని ప్రాజెక్ట్ భవన్ వద్ద ఆందోళనకు దిగారు. భారీ వర్షాన్ని సైతం లెక్కచేయకుండా గొడుగులు పట్టుకుని, తాత్కాలిక టార్పాలిన్ కింద నిలబడి నిరసన తెలిపారు. పోటీ పరీక్షలో ఉత్తీర్ణత సాధించి, అధికారికంగా నియామక ఉత్తర్వులు పొందిన తర్వాత మొత్తం ప్రక్రియను రద్దు చేయడం తమను అన్యాయంగా శిక్షించడమేనని వారు ఆవేదన వ్యక్తం చేశారు. తమ ఉద్యోగ హోదాపై ప్రభుత్వం తక్షణమే స్పష్టత ఇవ్వాలని, పరీక్ష రద్దు నిర్ణయాన్ని పునఃసమీక్షించాలని డిమాండ్ చేశారు.

## 2027 అసెంబ్లీ ఎన్నికల వేళ యూపీ, పంజాబ్, గుజరాత్‌కు బీజేపీ ఇన్‌ఛార్జ్‌లు

వచ్చే ఏడాది అసెంబ్లీ ఎన్నికలకు బీజేపీ ఇప్పటి నుంచి వ్యూహాలను పదును పెడుతోంది. ఉత్తర్‌ప్రదేశ్, పంజాబ్, గుజరాత్ రాష్ట్రాలపై ప్రత్యేక దృష్టి సారించింది. అందులో భాగంగా బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ మంగళవారం ఆయా రాష్ట్రాలకు ఇన్‌ఛార్జ్‌లు, కో-ఇన్‌ఛార్జ్‌లను నియమించారు. ఈ నియామకాలు తక్షణమే అమల్లోకి వస్తాయని పార్టీ వెల్లడించింది. ఈ మేరకు బీజేపీ కేంద్ర కార్యాలయం ప్రకటన విడుదల చేసింది. ఉత్తర్‌ప్రదేశ్ పార్టీ వ్యవహారాల ఇన్‌ఛార్జ్‌గా రాజ్యసభ ఎంపీ, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి వినోద్ తావ్డేను నియమించారు. కో-ఇన్‌ఛార్జ్‌గా జాతీయ కార్యదర్శి జగదీశ్ ఈశ్వర్‌భాయ్ పటేల్‌కు బాధ్యతలు అప్పగించారు. దేశ రాజకీయాల్లో కీలక రాష్ట్రంగా ఉన్న యూపీలో 2027 అసెంబ్లీ ఎన్నికల నేథ్యంలో సంస్థాగత వ్యవహారాలు, పార్టీ శ్రేణుల సమన్వయం, ఎన్నికల వ్యూహంపై తావ్డే బృందం దృష్టి పెట్టనుంది. ఇక పంజాబ్ రాష్ట్ర భాజపా ఇన్‌చార్జ్‌గా జాతీయ ప్రధాన కార్యదర్శి, రాజ్యసభ సభ్యుడు డాక్టర్ సతీశ్ పూనియాను నియమించారు. అలాగే గుజరాత్ బాధ్యతలను రాజ్యసభ సభ్యుడు, బీజేపీ జాతీయ ప్రధాన కార్యాలయ ఇన్‌చార్జ్ తరుణ్ చుగ్‌కు అప్పగించారు. ఇతర రాష్ట్రాలకు ఇన్‌చార్జ్‌ల నియామకాలను త్వరలో చేపడతామని బీజేపీ తెలిపింది. అప్పటివరకు ఆయా రాష్ట్రాల్లో ప్రస్తుతం కొనసాగుతున్న ప్రభారీ వ్యవస్థ యథాతథంగా కొనసాగుతుందని స్పష్టం చేసింది.

### కొత్త టీమ్‌తో ఎన్నికల వ్యూహం

ఇదిలా ఉండగా బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ కొత్త టీమ్‌ను సోమవారం ప్రకటించారు. అనుభవజ్ఞులతో పాటు యువ నాయకులకు ప్రాధాన్యం కల్పిస్తూ కొత్త బృందాన్ని రూపొందించారు. జాతీయ ప్రధాన కార్యదర్శులుగా మాజీ అమేఠీ ఎంపీ స్మృతి ఇరానీ, మాజీ త్రిపుర ముఖ్యమంత్రి బిప్లబ్ కుమార్ దేబ్, సునీల్ బన్సల్, వినోద్ తావ్డే, గజేంద్ర పటేల్, సతీశ్ పూనియా, హరీశ్ ద్వివేది, సంజయ్ భాటియాలకు కీలక బాధ్యతలు అప్పగించారు. అదే సమయంలో పలువురు సీనియర్ నేతలను జాతీయ ఉపాధ్యక్షులుగా నియమించారు. మాజీ రాజస్థాన్ సీఎం వసుంధరా రాజే, మాజీ ఉత్తరాఖండ్ సీఎం తీరథ్ సింగ్ రావత్, రామ్ మాధవ్, బైజయంత్ పాండా, డీ పురందేశ్వరి తదితరులకు ఈ జాబితాలో చోటు దక్కింది. మొత్తం 13 మంది కొత్త ఉపాధ్యక్షుల్లో ఆరుగురు మహిళలు ఉండటం విశేషం.

### విస్తృత ప్రాతినిధ్యంతో జాతీయ కార్యదర్శులు

జాతీయ కార్యదర్శుల నియామకాల్లోనూ దేశవ్యాప్తంగా భౌగోళిక ప్రాతినిధ్యానికి బీజేపీ ప్రాధాన్యం ఇచ్చింది. మధ్యప్రదేశ్‌కు చెందిన కవితా పటిదార్, కేరళకు చెందిన కె. సురేంద్రన్, యూపీకి చెందిన డాక్టర్ భోలా సింగ్, ఝార్ఖండ్‌కు చెందిన ప్రదీప్ వర్మ, గుజరాత్‌కు చెందిన జగదీశ్ పటేల్, దిల్లీకి చెందిన సందీప్ పాఠక్ తదితరులకు జాతీయ కార్యదర్శులుగా బాధ్యతలు అప్పగించారు. నాగాలాండ్‌కు చెందిన ఫాంగ్నోన్ కొన్యాక్, కేరళకు చెందిన అనిల్ ఆంటోనీ, తమిళనాడుకు చెందిన ఎం. వెంకటేశన్, పశ్చిమ్ బెంగాల్‌కు చెందిన మనోజ్ తిగ్గా, బిహార్‌కు చెందిన సిద్ధార్థ్ శంభు, దిల్లీకి చెందిన స్వదేశ్ సింగ్, అసోంకు చెందిన మృగాంక దేవ్ బర్మన్, గుజరాత్‌కు చెందిన రోహన్ గుప్తా, దిల్లీకి చెందిన జై ప్రకాశ్ తదితరులు ఈ జాబితాలో ఉన్నారు.

### కీలక విభాగాలకూ కొత్త బాధ్యతలు

కేంద్ర ఆర్థిక వ్యవహారాల్లో కీలకమైన జాతీయ కోశాధికారి బాధ్యతలను పీయూశ్ గోయల్‌కు మరోసారి అప్పగించారు. తరుణ్ చుగ్‌ను బీజేపీ కేంద్ర కార్యాలయ ఇన్‌చార్జ్‌గా నియమించారు. గుజరాత్‌కు చెందిన ఎంపీ హేమాంగ్ జోషికి యువ మోర్చా బాధ్యతలు ఇచ్చారు. మహిళా మోర్చా అధ్యక్ష బాధ్యతలను ఛత్తీస్‌గఢ్‌కు చెందిన రూప్ కుమారి చౌధరి చేపట్టనున్నారు. పార్టీ మీడియా విభాగంలో మాత్రం కొనసాగింపునకు ప్రాధాన్యం ఇచ్చారు. లోక్‌సభ సభ్యుడు అనిల్ బలూనీ మీడియా కన్వీనర్‌గా కొనసాగనున్నారు. ఆయనకు సహ కన్వీనర్లుగా ఆశిష్ ఉషా అగర్వాల్, ప్రదీప్ భండారీ, సిద్ధార్థ్ యాదవ్ వ్యవహరించనున్నారు. ఛత్తీస్‌గఢ్‌కు చెందిన దీపక్ మ్హాస్కేకు సోషల్ మీడియా కన్వీనర్ బాధ్యతలు అప్పగించారు.


# బీసీ రిజర్వేషన్లపై కేసులు వేస్తే చరిత్రహీనులే

-మొదటిపేజీ తరువాయి

ముఖ్యమంత్రిగా యాక్ట్ ఆఫ్ 5 కింద బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించానని, 2013 వరకు జరిగిన అన్ని స్థానిక ఎన్నికల్లో ఇదే కోటాను అమలు చేశామని తెలిపారు. ఎర్రన్నాయుడు, యనమల రామకృష్ణుడు, అయ్యన్నపాత్రుడు, దేవేందర్ గౌడ్ వంటి ఎందరో బీసీ నేతలు టీడీపీ ద్వారానే బలమైన నాయకులుగా ఎదిగారని ఉదహరించారు. ఇప్పుడు ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అదే సిద్ధాంతాన్ని ముందుకు తీసుకెళుతోందని చెప్పారు.

### గత ప్రభుత్వ ద్రోహాన్ని ఎండగట్టిన సీఎం

గత ఐదేళ్ల పాలనలో వైసీపీ ప్రభుత్వం బీసీలకు తీరని ద్రోహం చేసిందని చంద్రబాబు తీవ్రంగా ఆరోపించారు. 2019లో జీవో 176 తెచ్చి నాటకాలు ఆడారని, సుప్రీంకోర్టులో సరిగ్గా వాదనలు వినిపించకుండా బీసీల హక్కులను కాలరాశారని విమర్శించారు. జీవోలు 559, 560 ద్వారా 34 శాతంగా ఉన్న రిజర్వేషన్లను 24.15 శాతానికి తగ్గించి, తద్వారా సుమారు 16,800 బీసీ నాయకత్వ స్థానాలు కోల్పోయేలా చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. "బీసీలకు ద్రోహం చేయటంలో వాళ్లు నెంబర్ వన్" అని ఘాటుగా వ్యాఖ్యానించారు. గత ప్రభుత్వం బీసీ నేతలపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడిందని చంద్రబాబు ఆరోపించారు. అచ్చెన్నాయుడు, కొల్లు రవీంద్ర, అయ్యన్నపాత్రుడు, పల్లా శ్రీనివాస్, కూన రవికుమార్ వంటి వారిపై అక్రమ కేసులు బనాయించి వేధించారని గుర్తుచేశారు. రేపల్లెలో అమర్నాథ్ గౌడ్‌ను పెట్రోల్ పోసి తగలబెట్టడం, తోట చంద్రయ్య గొంతు కోయడం, కంచర్ల జాలయ్య, నందం సుబ్బయ్య హత్యల వంటి దారుణాలను ప్రస్తావిస్తూ.. వారు సిద్ధాంతాల కోసం ప్రాణాలు అర్పించారని కొనియాడారు. బీసీ కార్పొరేషన్లు ఏర్పాటు చేసి, కనీసం కుర్చీలు కూడా వేయకుండా అవమానించారని దుయ్యబట్టారు.



### బీసీల సర్వతోముఖాభివృద్ధికి ప్రణాళిక


తమ ప్రభుత్వం బీసీలకు కేవలం రిజర్వేషన్లు ఇవ్వడమే కాకుండా, వారి సమగ్రాభివృద్ధికి కట్టుబడి ఉందని చంద్రబాబు స్పష్టం చేశారు. "బీసీ అంటే వెనుకబడిన వారు కాదు, అవకాశం రాక వెనుకబడిన వారు" అని అభివర్ణించారు. రాష్ట్ర జనాభాలో 50.54 శాతంగా ఉన్న బీసీల విద్య, నైపుణ్యం, ఉపాధి, పారిశ్రామిక అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు అమలు చేస్తామన్నారు. బీసీ రెసిడెన్షియల్ స్కూళ్లను అత్యుత్తమంగా తీర్చిదిద్దుతామని, వారి అద్భుతమైన నైపుణ్యాలకు టెక్నాలజీని జోడించి ప్రపంచానికి పరిచయం చేస్తామని హామీ ఇచ్చారు.

### ఎన్నికలు తక్షణావసరం

స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించడం రాష్ట్ర అభివృద్ధికి అత్యంత కీలకమని ముఖ్యమంత్రి తెలిపారు. ఎన్నికలు నిర్వహిస్తేనే 16వ ఆర్థిక సంఘం నుంచి గ్రామీణ ప్రాంతాలకు రూ.2300 కోట్లు, పట్టణ ప్రాంతాలకు రూ.1,562 కోట్ల గ్రాంట్లు వస్తాయని వివరించారు. ఇంతటి చారిత్రక సమావేశానికి వైసీపీ సభ్యులు హాజరు కాకపోవడం వారి బాధ్యతారాహిత్యానికి నిదర్శనమని విమర్శించారు. ఈ చారిత్రక నిర్ణయానికి సభ ఆమోదం తెలపాలని కోరుతూ, స్థానిక ఎన్నికల్లో కూటమి నేతలంతా కలిసికట్టుగా పనిచేసి, సమర్థవంతమైన నాయకత్వాన్ని ప్రజలకు అందించాలని పిలుపునిచ్చారు.

# లోకల్ బాడీ ఎన్నికల ఫీవర్

**విజయవాడ :** ఆంధ్రప్రదేశ్ లో మరో రెండు నెలల్లో స్థానిక సంస్థల ఎన్నికల సందడి మొదలయ్యే అవకాశం ఉండటంతో రాజకీయ వాతావరణం క్రమంగా వేడెక్కుతోంది. గ్రామాలు, మండలాలు, పట్టణాల్లో ఇప్పటికే ఎన్నికల ఏర్పాట్లపై కసరత్తు జరుగుతోంది. ఈ నేపథ్యంలో స్థానిక ఎన్నికలను ఏ విధానంలో నిర్వహించాలనే అంశం కూడా రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ప్రస్తుతం ఈవీఎంల కంటే బ్యాలెట్ పేపర్ విధానానికే ప్రాధాన్యం ఇవ్వాలనే ఆలోచన ముందుకు వచ్చినట్లు ప్రచారం జరుగుతోంది.స్థానిక ఎన్నికలకు అవసరమైన స్థాయిలో ఈవీఎంలు అందుబాటులో లేకపోవడం బ్యాలెట్ వైపు మొగ్గు చూపడానికి ప్రధాన కారణంగా చెబుతున్నారు. బ్యాలెట్ విధానంలో ఓటరు అభ్యర్థుల గుర్తులు, పేర్లను చూసి తనకు నచ్చిన వ్యక్తికి ఓటు వేయాల్సి ఉంటుంది. అందువల్ల అభ్యర్థి వ్యక్తిగత పరిచయం, గ్రామంలో చేసిన పని, స్థానిక సమస్యలపై అవగాహన వంటి అంశాలకు ప్రాధాన్యం పెరిగే అవకాశం ఉంటుంది. అయితే ఓటింగ్ విధానం ఒక్కటే ఎన్నికల ఫలితాలను నిర్ణయించదు. ప్రజల అభిప్రాయం, అభ్యర్థుల బలం, పార్టీ సంస్థాగత సామర్థ్యం, స్థానిక సమస్యలు వంటి అనేక అంశాలు ప్రభావం చూపుతాయి.ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కి, తెలుగుదేశం పార్టీ నేతృత్వంలోని కూటమికి మధ్య పోటీపై ఆసక్తి నెలకొంది. బ్యాలెట్ విధానం తమకు అనుకూలంగా ఉంటుందని వైసీపీ వర్గాలు భావిస్తున్నట్లు రాజకీయ చర్చల్లో వినిపిస్తోంది. అయితే గ్రామస్థాయిలో ఓటర్లు తమ ప్రాంతానికి ఎవరు మెరుగైన సేవలు అందించగలరనే విషయాన్ని ప్రధానంగా పరిశీలించే అవకాశం ఉంది.కూటమి విషయానికి వస్తే సంక్షేమ కార్యక్రమాలతో పాటు అభివృద్ధి, పెట్టుబడులు, ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలపై ప్రభుత్వం దృష్టి పెడుతోందనే ప్రచారం




ఉంది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తీసుకుంటున్న నిర్ణయాలు కూడా స్థానిక రాజకీయాలపై ప్రభావం చూపవచ్చనే అంచనాలు ఉన్నాయి. టీడీపీ, జనసేన, బీజేపీ మధ్య కూటమి సమన్వయం కూడా ఎన్నికల సమయంలో కీలకంగా మారవచ్చు.ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో రహదారులు, తాగునీరు, పారిశుద్ధ్యం, సాగునీరు, విద్య, ఉపాధి వంటి స్థానిక అవసరాలపై ప్రజల దృష్టి ఉంటుంది. ప్రభుత్వం చేపట్టిన పనులు తమ ప్రాంతానికి ఎంతవరకు ఉపయోగపడ్డాయో ఓటర్లు అంచనా వేసే అవకాశం ఉంది.

అదే సమయంలో స్థానిక అభ్యర్థుల వ్యక్తిగత ప్రతిష్ఠ కూడా కీలక పాత్ర పోషిస్తుంది. అందువల్ల బ్యాలెట్ విధానం అమలైతే ఒక పార్టీకి స్వయంచాలకంగా ప్రయోజనం కలుగుతుందని చెప్పడం కష్టం. ఎన్నికల ఫలితాలను నిర్ణయించేది చివరకు ప్రజల తీర్పే. గ్రామస్థాయిలో తమకు దగ్గరగా ఉన్న సమస్యలను ఎవరు పరిష్కరిస్తారనే అంశమే ఓటర్ల నిర్ణయంపై ఎక్కువ ప్రభావం చూపే అవకాశం ఉంది. దీంతో రాబోయే స్థానిక ఎన్నికలలో ఏ పార్టీ గెలుస్తుంది అన్న విషయం పై సర్వత్ర ఉత్కంఠత నెలకొంది..

# చంద్రుడిపై శాశ్వత అడుగులు

**విజయవాడ :** చంద్రుడిపై మనిషి ఎక్కువకాలం నివసించగలడా? అక్కడే ఉండి పరిశోధనలు చేయడం, అవసరమైన వనరులను వినియోగించుకోవడం సాధ్యమేనా? ఈ ప్రశ్నలకు సమాధానం వెతుకుతూ అమెరికా అంతరిక్ష సంస్థ కీలక ప్రణాళికతో ముందుకు వెళ్తోంది. చంద్రుడి దక్షిణ ధ్రువ ప్రాంతంలో దశలవారీగా ఏర్పాటు చేసి, భవిష్యత్‌లో అక్కడ దీర్ఘకాలిక మానవ ఉనికికి పునాది వేయాలని నాసా లక్ష్యంగా పెట్టుకుంది. నాసా ప్రస్తుత ప్రణాళిక ప్రకారం 2029–32 మధ్య ప్రారంభ నివాస సదుపాయాలను ఏర్పాటు చేసి, 2032 తర్వాత చంద్రుడిపై నిరంతర మానవ కార్యకలాపాలను విస్తరించనుంది చంద్రుడిపై శాశ్వత స్థావరం ఏర్పాటు చేయడం అంత సులభమైన విషయం కాదు. తీవ్రమైన ఉష్ణోగ్రతలు, రేడియేషన్, చంద్ర రాత్రుల్లో విద్యుత్ కొరత, భూమి నుంచి దూరం వంటి సవాళ్లను ఎదుర్కోవాల్సి ఉంటుంది. అందుకే రోవర్లు, ల్యాండర్లు, డ్రోన్లు, విద్యుత్ వ్యవస్థలు, కమ్యూనికేషన్ నెట్‌వర్క్‌లు, నివాస మాడ్యూళ్లను దశలవారీగా చంద్రుడిపైకి పంపి వాటి పనితీరును పరీక్షించాలని నాసా భావిస్తోంది.మూన్ బేస్‌కు చంద్రుడి దక్షిణ ధ్రువ ప్రాంతాన్ని ఎంచుకోవడానికి ప్రధాన కారణం అక్కడి ప్రత్యేక భౌగోళిక పరిస్థితులు. శాశ్వతంగా నీడలో ఉండే కొన్ని ప్రాంతాల్లో నీటి మంచు ఉండే అవకాశం ఉంది. నీటిని భవిష్యత్‌లో తాగునీరు, ఆక్సిజన్, హైడ్రోజన్ వంటి వనరుల కోసం ఉపయోగించగలిగితే చంద్రుడిపై దీర్ఘకాలిక మానవ నివాసానికి అది కీలకంగా మారుతుంది.ఇక్కడే భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) పరిశోధనలు ప్రాధాన్యం సంతరించుకుంటున్నాయి.



చంద్రయాన్–2లోని పరికరం చంద్రుడి ధ్రువ ప్రాంతాలను రాడార్ ద్వారా అధ్యయనం చేసింది. 2026లో ఇస్రో వెల్లడించిన తాజా పరిశోధన ప్రకారం.. చంద్రుడి దక్షిణ ధ్రువంలోని కొన్ని శాశ్వత నీడ ప్రాంతాల్లోని నాలుగు క్రేటర్ల అడుగుభాగాల్లో ఉపరితలానికి దిగువన నీటి మంచు ఉండే అవకాశాన్ని రాడార్ పరిశీలనలు సూచించాయి. చంద్రయాన్–2 డేటా ఆధారంగా ఇస్రో శాస్త్రవేత్తలు చంద్రుడి ధ్రువ ప్రాంతాల్లో నీటి మంచు, ఉపరితల స్వభావం, ఇతర భౌతిక లక్షణాలకు సంబంధించిన కీలక డేటాను రూపొందించారు. భవిష్యత్ చంద్ర మిషన్ల ల్యాండింగ్ ప్రాంతాల ఎంపికకు ఈ సమాచారం ఉపయోగపడే అవకాశం ఉంది.నాసా ప్రణాళిక ప్రకారం తొలి దశలో రోవర్లు, ల్యాండర్లు, ఇతర రోబోటిక్ వ్యవస్థలు చంద్రుడి దక్షిణ ధ్రువ ప్రాంతాన్ని పరిశీలిస్తాయి. అనంతరం 2029 నుంచి సెమీ–పర్మినెంట్ మౌలిక సదుపాయాలు, విద్యుత్ వ్యవస్థలు, కమ్యూనికేషన్ నెట్‌వర్క్‌లు, నివాస సదుపాయాల ఏర్పాటు ప్రారంభమవుతుంది. ఈ దశలో భారీ మొత్తంలో కార్గోను చంద్రుడిపైకి పంపేందుకు అనేక ల్యాండర్ మిషన్లను ఉపయోగించనున్నారు2032 తర్వాతి దశలో మాత్రం లక్ష్యం మరింత పెద్దది. వ్యోమగాములు చంద్రుడిపై ఎక్కువకాలం నివసించి పనిచేసేలా సెమీ–పర్మినెంట్ హ్యాబిటేషన్ మాడ్యూళ్లు, దీర్ఘకాలిక విద్యుత్ వ్యవస్థలు, ప్రెషరైజ్డ్ రోవర్లు, నిరంతర సరఫరా వ్యవస్థలను ఏర్పాటు చేయాలని నాసా భావిస్తోంది. ఈ మూన్ బేస్ భవిష్యత్‌లో అంగారకుడి వంటి సుదూర గ్రహాల మిషన్లకు శిక్షణ, పరిశోధన, సాంకేతిక పరీక్షల కేంద్రంగా ఉపయోగపడే అవకాశం ఉంది.అయితే ఒక ముఖ్యమైన విషయాన్ని గమనించాలి. ప్రస్తుతం నాసా అధికారిక ప్రణాళికలో 2027లో ఆర్టెమిస్–3 ద్వారా నేరుగా చంద్రుడిపై మానవులు దిగడం కాకుండా, ఆ మిషన్‌ను భూమి కక్ష్యలో కీలక వ్యవస్థల పరీక్షలకు ఉపయోగించనున్నారు. చంద్రుడి దక్షిణ ధ్రువానికి తొలి ప్రణాళికాబద్ధమైన మానవ ల్యాండింగ్ ఆర్టెమిస్–4తో 2028లో జరగనుంది.చంద్రుడిపై మానవాళి దీర్ఘకాలిక ఉనికికి అడుగులు పడుతున్న వేళ.. ఇస్రో అందిస్తున్న చంద్ర ధ్రువ ప్రాంత డేటా, నీటి మంచుపై పరిశోధనలు, భవిష్యత్ చంద్ర మిషన్లకు భారత్ కీలక భాగస్వామిగా నిలిచే అవకాశాన్ని పెంచుతున్నాయి. చంద్రుడిపై మొదలయ్యే ఈ కొత్త అధ్యాయం.. చివరికి అంగారకుడిపై మనిషి అడుగుపెట్టే ప్రయాణానికి మరో పెద్ద మెట్టుగా మారనుంది.

## అక్టోబర్‌లోగా స్థానిక సంస్థల ఎన్నికలు

-మొదటిపేజీ తరువాయి

స్పష్టం చేశారు. మేయర్ ఎన్నికలను ప్రత్యక్ష పద్ధతిలో నిర్వహించాలని, పాత విధానంలో ఒక్క డిప్యూటీ మేయర్ పదవికే పరిమితం కావాలని నిర్ణయం తీసుకుంది. ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లలో ఎలాంటి మార్పు ఉండదని, ప్రస్తుతం అమల్లో ఉన్న రిజర్వేషన్లే కొనసాగుతాయని స్పష్టం చేసింది. బీసీ రిజర్వేషన్లపై డెడికేటెడ్ కమిషన్ ప్రక్రియ కొనసాగుతోందని అధికారులు కేబినెట్‌కు వివరించారు. ప్రస్తుతం ఉన్న 13 జెడ్పీలను జిల్లాల పునర్విభజనకు అనుగుణంగా 28 జిల్లా పరిషత్‌లుగా ఏర్పాటు చేయాలని కేబినెట్ నిర్ణయించింది. మొత్తం 57 అజెండా అంశాలకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది.

**జాబ్ క్యాలెండర్‌పై కీలక నిర్ణయం:**

ఉద్యోగాల కల్పన, పరిశ్రమలు, ఐటీ, ఇంధనం, పర్యాటక రంగాలకు సంబంధించిన కీలక ప్రతిపాదనలపై నిర్ణయాలు తీసుకున్నారు. 10,060 పోస్టులతో జాబ్ క్యాలెండర్‌పై కీలక నిర్ణయం తీసుకున్నారు. బీసీ విద్యార్థులకు ××-జీజుజు, చీజుజు కోచింగ్ సెంటర్ల ఏర్పాటుకు ఆమోదం తెలిపింది. ప్రైవేట్ యూనివర్సిటీల ఏర్పాటు బిల్లు, ఉన్నత విద్యలో ఫీజుల నిర్ణయానికి కొత్త కమిషన్ బిల్లుపై చర్చించింది. మద్యం బ్రాండ్లకు పిచ్చిపిచ్చి పేర్లు పెట్టొద్దు: మంత్రివర్గ అజెండా అంశాలపై చర్చ పూర్తయిన తర్వాత ముఖ్యమంత్రి చంద్రబాబు వివిధ పరిణామాలపై మంత్రులు, అధికారులతో చర్చించారు. ద్రవ్యోల్బణం పెరుగుతున్న నేపథ్యంలో ధరల నియంత్రణకు తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సోషల్ మీడియాలో వస్తున్న నెగిటివ్ కామెంట్లపై ధీటుగా స్పందించాలని సూచించారు. మద్యం బ్రాండ్లకు పిచ్చిపిచ్చి పేర్లు పెట్టకుండా కమిటీ జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అక్రమంగా కంటైనర్లలో ఇసుక తరలిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

## ప్రతిపక్షాలు అసాంఘిక శక్తులను ప్రోత్సహిస్తున్నాయి

-మొదటిపేజీ తరువాయి

నితిన్ నబిన్ విమర్శించారు. "పార్లమెంటులో ప్రతిపక్షాల తీరు, స్వాతంత్ర్య దినోత్సవం వేడుకల సందర్భంగా కాంగ్రెస్ నాయకుల ప్రవర్తనను యావత్ దేశం గమనించింది. బీజేపీ కార్యకర్తలు ఎల్లప్పుడూ క్రమశిక్షణతో ఉంటారు, అయితే ప్రధానమంత్రి పట్ల ఉపయోగించిన పరుష పదజాలాన్ని ఏమాత్రం ఉపేక్షించకూడదు" అని ఆయన స్పష్టం చేశారు. ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీని 'పార్ట్–టైమ్ రాజకీయ నాయకుడు' అని ఎద్దేవా చేస్తూ, ఆయన కేవలం ప్రజల దృష్టిని మళ్లించే అంశాలకే ప్రాధాన్యత ఇస్తున్నారని ఆరోపించారు. ప్రధాని మోదీ నాయకత్వంలో 'వికసిత భారత్' ఆవిష్కారమే లక్ష్యంగా బీజేపీ ముందుకు సాగుతోందని, దేశవ్యాప్తంగా రూ. 8 లక్షల కోట్లకు పైగా విలువైన మౌలిక సదుపాయాల కల్పన ప్రాజెక్టులు కొనసాగుతున్నాయని ఆయన పేర్కొన్నారు. నేటి యువత కేవలం ఉద్యోగాల కోసం ఎదురుచూడకుండా, స్టార్టప్‌ల ద్వారా ఇతరులకు ఉపాధి కల్పించే స్థాయికి ఎదిగిందని కొనియాడారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను, పార్టీ సిద్ధాంతాలను క్షేత్రస్థాయిలోకి బలంగా తీసుకెళ్లాలని కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. రాష్ట్రంలో పార్టీ బలోపేతం కోసం అనుసరించాల్సిన వ్యూహాలపై ఆయన నేతలతో సుదీర్ఘంగా చర్చించారు. ఈ సమావేశంలో రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, రాష్ట్ర పార్టీ ఇన్చార్జిలు, జిల్లా అధ్యక్షులు పాల్గొన్నారు.

## స్పష్టమైన విజన్, పారదర్శక పాలనే విజయానికి మూలం

-మొదటిపేజీ తరువాయి

చంద్రబాబు విజన్, పారదర్శక పాలన, వ్యాపార నిర్వహణలో వేగం (స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్) వంటి అంశాలే ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక ప్రగతికి మూలస్తంభాలుగా నిలుస్తున్నాయి" అని వివరించారు. రాష్ట్రం వేగంగా పారిశ్రామిక శక్తిగా ఎదుగుతుండటం గర్వకారణమని అన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న సానుకూల వాతావరణంతో ప్రపంచవ్యాప్తంగా పెట్టుబడిదారులు ఆంధ్రప్రదేశ్ వైపు చూస్తున్నారని లోకేశ్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఫలితాలను అందిస్తుండటంతో, ఇప్పుడు ప్రపంచం చూపు ఏపీ వైపు ఉందని ఆయన వ్యాఖ్యానించారు.

## మాజీ మంత్రి కుమారుడికి పెళ్లి ఇష్టం లేదా.. సోషల్ మీడియాలో వైరల్!

**విజయవాడ :** వైసీపీకి చెందిన మాజీ మంత్రి జోగి రమేష్ కుటుంబంపై సొంత కోడలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఆ కుటుంబ వ్యవహారం కాస్త రచ్చకు దారితీసింది. ఆ కుటుంబ సభ్యులు 11 మందిపై పోలీసులు కేసు నమోదు కూడా చేశారు. ఒకవైపు ఈ కేసు విచారణ కొనసాగుతుండగా.. ఆ కుటుంబానికి చెందిన వ్యక్తిగత వ్యవహారం సోషల్ మీడియాలో వెలుగులోకి వచ్చింది. ఆ కుటుంబ సభ్యుల మధ్య జరిగిన సంభాషణకు సంబంధించి వీడియో వైరల్ అవుతోంది. మాజీ మంత్రి జోగి రమేష్ కుమారుడికి ఇష్టం లేని పెళ్లి చేశారని వెలుగు చూస్తోంది ఆ వీడియోలో. ఏకంగా జోగి రమేష్ కుమారుడు రాజీవ్ తనకు ఈ పెళ్లి ఇష్టం లేదన్నట్టు చేసిన వ్యాఖ్యలు వైరల్ అవుతున్నాయి. అనవసరంగా తనను ఒత్తిడి చేసి పెళ్లి చేయించారని ఆయన మాట్లాడుతున్న అంశాలకు సంబంధించి వీడియో వైరల్ అవుతోంది.మొన్న మధ్యన మాజీమంత్రి జోగి రమేష్ కుటుంబం పై ఆయన కోడలు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే. తన అత్తవారు ఇంట తనకు మానసికంగా ఇబ్బందులు ఎదురవుతున్నాయని.. తీవ్రంగా హింసిస్తున్నారని.. గృహ హింసకు పాల్పడ్డారని.. ఒకటి రెండుసార్లు హత్య ప్రయత్నం చేశారని ఆమె ఇబ్రహీంపట్నం పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే జోగి రమేష్ మాజీ మంత్రి కావడం.. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత కావడం తీవ్ర చర్చకు దారితీసింది. పైగా ఆమె తెలంగాణకు చెందిన యువతి కావడంతో తెలుగు రాష్ట్రాల్లో సంచలనంగా మారింది ఈ ఘటన. అయితే దీనిని రాజకీయ కుట్రగా అభివర్ణించారు జోగి రమేష్ కుటుంబ సభ్యులు. కానీ గత కొంతకాలంగా జరుగుతున్న వ్యవహారాలతోనే బాధితురాలు బయటకు వచ్చినట్లు అప్పట్లో ప్రచారం జరిగింది. కేవలం జోగి రమేష్ కుటుంబ సభ్యులు మాత్రమే కాదు సమీప బంధువులు 11 మంది తనపై వేధింపులకు గురి చేశారని బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. దానిపై పోలీసులు కేసు నమోదు చేశారు.అయితే తాజాగా ఈ ఘటనకు సంబంధించి నిందితుల్లో ఒకడైన జోగి రమేష్ కుమారుడు రాజీవ్ తనకు ఈ పెళ్లి ఇష్టం లేదని.. కుటుంబ సభ్యుల బలవంతంగా ఈ పెళ్లికి ఒప్పించారని చెబుతున్న వీడియో సోషల్ మీడియాలో వెలుగులోకి వచ్చింది. అయితే ఈ ఘటనకు సంబంధించి కేసు నమోదైన తర్వాత జోగి రమేష్ కోడలి కుటుంబ సభ్యులకు జరిగిన చర్చలు బయటకు వచ్చాయి. అసలు తనకు ఈ వివాహం ఇష్టం లేదని.. అర్ధరాత్రి దాటిన తర్వాత వేకువ జాము వరకు తనకు వైట్ వాష్ చేశారని.. బలవంతంగా ఒప్పించారంటూ జోగి రమేష్ కుమారుడు రాజీవ్ తండ్రి పై తిరగబడుతున్న వీడియోలకు సంబంధించిన దృశ్యాలు ఇప్పుడు బయటకు వచ్చాయి.. అయితే ఆ కుటుంబంలో అంతర్గతంగా జరిగిన చర్చలు బయటకు రావడం ఇప్పుడు హాట్ టాపిక్ గా మారుతోంది. అయితే సొంత కుటుంబ సభ్యులే ఈ వీడియో లిఫ్ట్ చేశారని అర్థం అవుతోంది. కాగా ఈ సోషల్ మీడియాలో ప్రస్తుతం ఈ దృశ్యాలు వైరల్ అవుతున్నాయి.

## ప్రజా సమస్యలు తెలుసుకున్న ఎర్రకోట రాజీవ్ రెడ్డి

**నందవరం:** మండలం, గురజాల గ్రామం నమస్తే ఎమ్మిగనూరు ? ప్రజా సమస్యలపై పోరుబాట కార్యక్రమంలో భాగంగా నందవరం మండలం గురజాల గ్రామంలో 11వ రోజు కార్యక్రమానికి ఎమ్మిగనూరు నియోజకవర్గ సమన్వయకర్త ఎర్రకోట రాజీవ్ రెడ్డి శ్రీకారం చుట్టారు. గ్రామానికి చేరుకున్న రాజీవ్ రెడ్డి గ్రామ నాయకులు నరసింహారెడ్డి, గ్రామ అధ్యక్షుడు ఈశ్వర్ రెడ్డి, మాజీ సర్పంచ్ వీరస్వామి, కురువ నరసింహులు, జాను తదితరుల ఆధ్వర్యంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. శాలువాతో సన్మానించి, పూలమాలతో ఘనంగా సత్కరించారు.అనంతరం శ్రీ రామలింగేశ్వర స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి,గ్రామ ప్రజలు, రైతులు, నియోజకవర్గ ప్రజలు సుఖశాంతులతో ఉండాలని స్వామివారిని ప్రార్థించారు. అనంతరం రామలింగేశ్వర స్వామిని దర్శించుకున్నారు. వైఎస్ఆర్సీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి గ్రామంలోని ప్రతి ఇంటిని సందర్శిస్తూ కూటమి ప్రభుత్వం ప్రకటించిన 'సూపర్ సిక్స్' హామీలు అమలయ్యాయా? ప్రజలకు ఏమైనా సమస్యలు ఉన్నాయా? అని రాజీవ్ రెడ్డి ప్రజలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా బీసీ సోదరులు తమ సమస్యలను రాజీవ్ రెడ్డి గారి దృష్టికి తీసుకువచ్చారు. బీసీలకు 50 ఏళ్లకే పెన్షన్ ఇస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఇప్పటివరకు ఒక్క పెన్షన్ కూడా ఇవ్వలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

# సీజనల్ వ్యాధులపై యుద్ధం.. ముమ్మరంగా ఐఆర్ఎస్ స్ప్రేయింగ్!

### గొందిరాజుపేట, అచ్చుతాపురంలో దోమల నివారణ చర్యలు

### ప్రజారోగ్యమే లక్ష్యంగా వైద్యారోగ్య శాఖ ప్రత్యేక డ్రైవ్

### పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన





గొందిరాజుపేట, అచ్చుతాపురంలో ఐఆవఎస్ స్ప్రేయింగ్‌ను పర్యవేక్షిస్తున్న ఆరోగ్య సిబ్బంది.

**ఎటపాక, ఆగస్టు 18 (ప్రజాజ్యోతి):**వర్షాకాలంలో విజృంభించే సీజనల్ వ్యాధులను అరికట్టడమే లక్ష్యంగా వైద్యారోగ్య శాఖ ముమ్మరంగా నివారణ చర్యలు చేపట్టింది. ఎటపాక మండలం లక్ష్మీపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని కృష్ణవరం గ్రామపంచాయతీ గొందిరాజుపేట, అచ్చుతాపురం గ్రామాల్లో మంగళవారం విస్తృతంగా ఐఆర్ఎస్ (ఇండోర్ రెసిడ్యువల్ స్ప్రేయింగ్) కార్యక్రమాన్ని నిర్వహించారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో దోమల సంతతి పెరిగి మలేరియా, డెంగ్యూ, ఇతర విషజ్వరాలు ప్రబలే అవకాశం ఉండటంతో వైద్యారోగ్య శాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. ముందస్తు రక్షణ చర్యల్లో భాగంగా గ్రామాల్లోని ప్రతి ఇంటినీ సందర్శించిన ఐఆర్ఎస్ బృందాలు ఇళ్లలోని గదులతో పాటు దోమలు వృద్ధి చెందేందుకు అవకాశం ఉన్న పరిసర ప్రాంతాలను పరిశీలించి క్రిమిసంహారక మందును పిచికారీ చేశారు. మురుగు కాలువలు, నీటి గుంటలు, నీరు నిల్వ ఉండే ప్రదేశాలను కూడా పరిశీలించి ప్రజలకు తగిన సూచనలు అందించారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది మాట్లాడుతూ ప్రజారోగ్య పరిరక్షణలో ప్రజల భాగస్వామ్యం అత్యంత కీలకమని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఇళ్ల ఆవరణలో నిరుపయోగంగా పడిఉన్న టైర్లు, కొబ్బరి చిప్పలు, ఖాళీ డబ్బాలు, పూల కుండీల్లో వర్షపు నీరు నిల్వ ఉండకుండా ఎప్పటికప్పుడు తొలగించాలని తెలిపారు. తాగునీటి తొట్లు, డ్రమ్ములను వారానికి ఒకసారి శుభ్రం చేసి, పూర్తిగా ఆరబెట్టిన అనంతరం మాత్రమే తిరిగి నీటిని నింపుకోవాలని సూచించారు. వర్షాకాలంలో కాచి చల్లార్చిన నీటిని తాగడం ద్వారా అనారోగ్య సమస్యలను కొంతవరకు నివారించవచ్చని తెలిపారు. గ్రామాల్లో పరిసరాల పరిశుభ్రతను నిర్లక్ష్యం చేయకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని, నిర్లక్ష్యం కారణంగా వ్యాధుల వ్యాప్తికి అవకాశం కల్పించవద్దని ఆరోగ్య సిబ్బంది హెచ్చరించారు. ఎవరికైనా చలిజ్వరం, ఒళ్లు నొప్పులు, తీవ్రమైన తలనొప్పి తదితర అనారోగ్య లక్షణాలు కనిపిస్తే ఆలస్యం చేయకుండా సమీపంలోని ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించాలని సూచించారు. అవసరమైన రక్త పరీక్షలను చేయించుకుని వైద్యుల సలహా మేరకు చికిత్స పొందాలని తెలిపారు. అనారోగ్య లక్షణాలను నిర్లక్ష్యం చేసి పరిస్థితిని విషమింపజేసుకోవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం చిన్ని, ఎంఎల్‌హెచ్‌పీ రూపచంద్రిక, ఆశ కార్యకర్త ఎ.అక్కమ్మ, కృష్ణవరం పంచాయతీ కార్యదర్శి విజయ, ఏఎన్ఎం శ్యామల, ఎంపీహెచ్ఎ తిరుపతిరావు, ఆశ కార్యకర్త మీనా, ఐఆర్ఎస్ స్ప్రేయింగ్ బృందం సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## తూర్పుగోదావరి జిల్లాలో ప్రజా సమస్యపై ప్రజా నాయకుల పోరాటం



**గోకవరం (ప్రజా జ్యోతి ప్రతినిధి), ఆగస్టు 18:**వంట గ్యాస్ సరఫరాలో జాప్యాన్ని నిరసిస్తూ ప్రజా నాయకులు ఆందోళనకు దిగారు. ఈ మేరకు గోకవరం తహసీల్దార్ కార్యాలయం ఎదుట అర్ధనగ్న ప్రదర్శన నిర్వహించి నిరసన తెలిపారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు.గ్యాస్ సిలిండర్‌ను 45 రోజుల తర్వాత అందించే విధానాన్ని తక్షణమే రద్దు చేసి, గతంలో మాదిరిగా వినియోగదారులకు సకాలంలో గ్యాస్ సిలిండర్లు అందించాలని ప్రజా నాయకులు డిమాండ్ చేశారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా, వినియోగదారులకు అనుకూలంగా గ్యాస్ సరఫరా విధానాన్ని అమలు చేయాలని కోరారు. గ్యాస్ సరఫరాలో నెలకొన్న సమస్యను ప్రభుత్వం వెంటనే పరిష్కరించి, వినియోగదారులకు నిరంతరాయంగా సకాలంలో గ్యాస్ అందేలా చర్యలు తీసుకోవాలని ప్రజా నాయకులు డిమాండ్ చేశారు.

## గుంతకల్లు నియోజకవర్గంలో వైసీపీకి జోష్..

– వైవిఆర్‌ను కలిసేందుకు భారీగా తరలివచ్చిన వైసీపీ శ్రేణులు.!



**గుంతకల్లు ఆగస్టు 18 (ప్రజా జ్యోతి):** గుంతకల్లు నియోజకవర్గ వైసీపీ మాజీ ఎమ్మెల్యే, ఇంచార్జ్ వై. వెంకటరామ రెడ్డి ని కలిసేందుకు వైసీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఆయన ఇంటికి భారీగా తరలివచ్చా రు. పెద్ద సంఖ్యలో పార్టీ శ్రేణులు తరలిరావడంతో పార్టీ శ్రేణుల్లో నూతన ఉత్సాహం నెలకొంది. ఈ సందర్భంగా వై. వెంకటరామ రెడ్డి గారు మాట్లాడుతూ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టు కుని పార్టీని మరింత బలోపేతం చేయడం, గ్రామస్థాయి నుంచి పార్టీ నిర్మాణాన్ని పటిష్టం చేయడం, నాయకులు, కార్యకర్తల మధ్య సమన్వయాన్ని పెంచడం వంటి కీలక అంశాలపై చర్చించానన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ శ్రేణులంతా ఐక్యంగా పనిచేసి బలమైన ఫలితాలు సాధించే దిశగా ముందుకు సాగాలని నాయకులకు అయన పిలుపునిచ్చారు. ప్రతి గ్రామం, ప్రతి వార్డులో పార్టీ కార్యకర్తలను సమన్వయం చేస్తూ బూత్ స్థాయి నుంచి పార్టీ నిర్మాణాన్ని మరింత పటిష్టం చేయడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని నిర్ణయించి నట్లు తెలిపారు. ప్రజా సమస్యలను నిరంతరం ప్రజల మధ్యకు తీసుకెళ్లడం తో పాటు,పార్టీ కార్యక్రమాల ను విస్తృతంగా నిర్వహిస్తూ వైసీపీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని వైవిఆర్ సూచించినట్లు నాయకులు తెలిపారు.

## ప్రమాదంలో గాయపడిన వాల్మీకి రామాంజనేయులును పరామర్శించిన నైరుతిరెడ్డి



**గుంతకల్లు ఆగస్టు 18 (ప్రజా జ్యోతి):** మండలం నెలగొండ గ్రామానికి చెందిన వాల్మీకి రామాంజనేయులు ప్రమాదవశాత్తు కిందపడ టంతో కాలు ఫ్రాక్చర్ అయింది. చికిత్స నిమిత్తం అనంతపురంలోని సుకృత హాస్పిటల్‌కు తీసుకెళ్లిన విషయం తెలుసుకున్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అనంతపురం జిల్లా ఉపాధ్యక్షురాలు వై. నైరుతిరెడ్డి హాస్పిటల్‌కు వెళ్లి వాల్మీకి రామాంజనేయు లును పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అనంత రం ఫోన్‌లో వైద్యులతో మాట్లాడి వాల్మీకి రామాంజనేయులుకు మెరుగైన వైద్యం అందిం చాలని సూచించారు. ఆయన త్వరగా కోలుకుని సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి రావాలని వై. నైరుతిరెడ్డి ఆకాంక్షించారు.

## పోడూరులో జైన్ దేవాలయ నిర్మాణానికి నేడు శంఖుస్థాపన.



**పోడూరు ప్రజా జ్యోతి రిపోర్టర్ కొట్టి రామం ఆగస్టు 18.** ఆచంటలోని శ్రీ పద్మనాభ ప్రభు స్వామి జైన్ దేవాలయం ట్రస్ట్ బోర్డు ఆధ్వర్యంలో పోడూరు గ్రామంలో జైన్ దేవాలయం నిర్మించుటకు ఈ నెల 19 బుధవారం ఉదయం 10– 30 నిమిషాలకు శంకుస్థాపన జరుగుతుందని జైన్ దేవాలయం ట్రస్ట్ బోర్డ్ కార్యవర్గం తెలిపారు ఆచంట శాసన సభ్యులు పేతాన్ని సత్యనారాయణ ఆశీస్సులతో పోడూరు గ్రామపంచాయతీ ఇచ్చిన స్థలంలో నిర్మించబడుతున్న జైన్ దేవాలయం ఆచంట జైన్ దేవాలయం ట్రస్ట్ బోర్డు ఆధ్వర్యంలో పిఠాపురం శీతలనాద్ జైన్ సంఘం వారి ఆర్థిక సహాయంతో మార్బుల్ శిల శిల్పులతో నిర్మించబడుతుందని వారు తెలిపారు ఈ శంకుస్థాపన కార్యక్రమంనకు పోడూరు పరిసర గ్రామాల ప్రజలు హాజరయ్యి జైన్ దేవుని గురువుల ఆశీస్సులు పొందాలని వారు కోరారు.

## ధ్రువీకరణ జరగని ఓటర్లకు నోటీసుల జారీ



**పోడూరు. ప్రజాజ్యోతి. రిపోర్టర్ కొట్టి రామం. ఆగస్టు 18.** పోడూరు మండలం లోని పండిత విల్లూరులో గ్రామ సచివాలయం వద్ద మంగళవారం సర్ ప్రక్రియలో భాగముగా మ్యాపింగ్ కాని, లింక్ కాని వారికి ఆయా బూత్ పరిధిలో బి యల్ ఓ లు నోటీసులు జారీ చేసినట్లు తహసీల్దార్ సయ్యద్ మౌలానా పాజిల్ తెలిపారు. నోటీసులు అందిన వారు సచివాలయంకు రాగా వారి యొక్క ఓటు హక్కును తిరిగి పునరుద్ధరించడం జరగటానికి తహసీల్దార్ అవగాహన కల్పించారు. ప్రభుత్వం నిర్దేశించిన 12 గుర్తింపు కార్డులలో ఓటరు యొక్క ఏదై నా 2 గుర్తింపు కార్డులలో వారి వివరములు సరిపోల్చటం జరుగుతుం దని వారికి తెలిపారు. అవగాహనకు కు పండిత విల్లూరు పోలింగ్ స్టేషన్ నెంబర్ 151 నుండి 154 వరకు నోటీసులు జారీ చేసిన ఓటర్లు హాజరయ్యారు. పోడూరు మండలం పరిధిలోని ఆచంట నియోజకవర్గం కు సంబంధించి 2595 మందికి పాలకొల్లు అసెంబ్లీ నియోజకవర్గం నకు సంబంధించి 1308 మందికి మొత్తం 3903 మందికి నోటీసు లు జారీ చేయడం జరిగిందని ఈ సందర్భంగా తహసీల్దార్ తెలిపారు.

## డిగ్రీ విద్యార్థుల ఫీజు బకాయిలను విడుదల చేయాలి



**పాలకొల్లు. ప్రజాజ్యోతి. ఆగష్టు 18.**డిగ్రీ విద్యార్థులకు ప్రభుత్వం చెల్లించాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని ఎ ఐ ఎస్ యఫ్ రాష్ట్ర గర్ల్స్ కో–కన్వీనర్, పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షురాలు కే. యామిని దేవి శ్రీ డిమాండ్ చేశారు.ప్రభుత్వం సకాలంలో ఫీజు రీయింబర్స్‌మెంట్‌బకాయిలను చెల్లించకపోవడంతో డిగ్రీ విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఫీజులు చెల్లించాలంటూ కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులపై ఒత్తిడి తీసుకురావడంతో పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన తల్లిదండ్రులు ఆర్థిక ఇబ్బందులతో తప్పనిసరిగా ఫీజు సొమ్ము చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు.ఇప్పటికే నిత్యావసరాల ధరలు పెరిగి ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న తల్లిదండ్రులపై ఫీజుల భారం మోపడం అన్యాయమని యామిని దేవిశ్రీ పేర్కొన్నారు. ప్రభుత్వం విద్యార్థుల విద్యకు అండగా నిలవాల్సింది పోయి ఫీజు బకాయిలను పెండింగ్‌లో ఉంచడం వల్ల విద్యార్థుల చదువులకు ఆటంకం కలుగుతోందన్నారు.ప్రభుత్వం వెంటనే స్పందించి డిగ్రీ విద్యార్థులకు సంబంధించిన పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను పూర్తిగా విడుదల చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లను వెంటనే ఇవ్వాలని ఫీజులకు విద్యార్థుల తల్లిదండ్రులపై కళాశాలల యాజమాన్యాలు ఒత్తిడి చేయకుండా చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థుల విద్యా భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం తక్షణమే స్పందించి బకాయిల చెల్లింపుపై స్పష్టమైన కాలపట్టికను ప్రకటించాలని ఆమె కోరారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఏ ఒక్క విద్యార్థి చదువుకు దూరం కాకుండా ప్రభుత్వం బాధ్యత తీసుకోవాలని యామిని దేవి శ్రీ డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే విద్యార్థులను సమీకరించి ఉద్యమాన్ని మరింత ముందుకు తీసుకువెళతామని యామిని దేవిశ్రీ తెలిపారు.

## ప్రభుత్వం ఉద్యోగాలు కల్పించాలి నిరుద్యోగ భృతి ఇవ్వాలి.

వైసిపి జిల్లా ఉపా ద్యక్షులు.. జోగాడ ఉమా మహేశ్వర రావు.



**పాలకొల్లు. ప్రజా జ్యోతి రిపోర్టర్ కొట్టి రామం. ఆగష్టు 18.** ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల మేరకు రాష్ట్రంలో ప్రభుత్వం ఉద్యోగాలు కల్పించడం తో పాటు నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి చెల్లించాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు జోగాడ ఉమామహేశ్వర రావు మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 27 నెలలు పూర్తయిందని, ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిందని ఆయన గుర్తుచేశారు ఆ లెక్కన ఇప్పటివరకు సుమారు 9 లక్షల ఉద్యోగాలు కల్పించాల్సి ఉండగా, ఎంతమందికి ఉద్యోగాలు ఇచ్చారో ప్రభుత్వం స్పష్టం చేయాలని ప్రశ్నించారు. ఉద్యోగాలు కల్పించేంత వరకు నెలకు రూ.3,000 చొప్పున నిరుద్యోగ భృతి ఇస్తామని హామీ ఇచ్చారని, 27 నెలలు గడిచినా ఆ హామీ అమలు కాలేదని విమర్శించారు. ఎన్నికల హామీ ప్రకారం ఉద్యోగాలు కల్పించే వరకు నిరుద్యోగులకు నెలకు రూ.3,000 భృతి చెల్లించాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున డిమాండ్ చేస్తున్నామని అయన తెలిపారు.

## నిరుద్యోగ భృతి పై అసెంబ్లీ సమావేశాలలో చర్చించాలి

### – డివైఎఫ్ఐ బద్వేల్ పట్టణ అధ్యక్ష కార్యదర్శులు ఎస్కే మస్తాన్ షరీఫ్ ఎస్ కే ఆదిల్ డిమాండ్

**బద్వేల్ స్టాప్ రిపోర్టర్ ఆగస్టు 18 (ప్రజా జ్యోతి)** రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ సమావేశాల్లో నిరుద్యోగ భృతి పై చర్చించాలని డివైఎఫ్ఐ బద్వేల్ పట్టణ అధ్యక్ష కార్యదర్శులు ఎస్కే మస్తాన్ షరీఫ్ ఆదిల్ డిమాండ్ చేశారుఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సూపర్ సిక్స్ సూపర్ హిట్ అని చెబుతుందని రెండు సంవత్సరాలు పాలన పై సభలు నిర్వహించి ఇప్పుడు ఇంటింటికి తిరుగుతున్నారని అయితే సూపర్ సిక్స్ లో నిరుద్యోగ యువతకు 3000 రూపాయలు భృతి కల్పన ఒక భాగమని అది ఇప్పటికీ అమలు కాలేదని మరి సూపర్ సిక్స్ సూపర్ హిట్ ఎలా అవుతుందని అన్నారు.నిరుద్యోగ యువత ప్రభుత్వం 3000 రూపాయలు నిరుద్యోగ భృతి ఎప్పుడు ఇస్తుందా అని ఎదురు చూస్తున్నారన్నారు. గడిచిన రెండు సంవత్సరాలుగా నిరుద్యోగ భృతి పై ప్రస్తావనే లేదన్నారు.ఇంతకు భృతి కల్పిస్తారా లేరా అని ప్రశ్నించారు.కోచింగ్ సెంటర్లలో సంవత్సరాల తరబడి కోచింగ్ తీసుకుంటూ వేల రూపాయలు ఖర్చు చేసుకుంటున్నారని అటువంటి వారికి భృతి ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం నిరుద్యోగ భృతి పై స్పష్టత ఇవ్వాలని అసెంబ్లీలో చర్చించి నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో పట్టణ ఉపాధ్యక్షులు



యువరాజ్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు

## మానవత్వమే పెద్ద దిక్కు - నిరుపేద మహిళకు అండగా ఎమ్మెల్యే ఏలూరి



**పర్చూరు ఆగస్టు 18 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి)**యద్దనపూడి మండలం గన్నవరం గ్రామానికి చెందిన నిరుపేద క్యాన్సర్ బాధిత మహిళకు పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అండగా నిలిచారు. ఆర్థిక ఇబ్బందులతో వైద్యం చేయించుకోలేని పరిస్థితిలో ఉన్న అల్లడి సలోమి కుటుంబానికి ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా 5, లక్షల 1, వెయ్యి 644, రూపాయల ఆర్థిక సహాయం అందేలా చొరవ తీసుకున్నారు.క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న సలోమి వైద్యానికి పెద్ద మొత్తంలో ఖర్చు అవుతుండటంతో కుటుంబ సభ్యులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. విషయం ఎమ్మెల్యే దృష్టికి వెళ్లడంతో వెంటనే స్పందించిన ఏలూరి తన క్యాంపు కార్యాలయంలోని సీఎంఆర్ఎఫ్ ప్రత్యేక విభాగం ద్వారా అవసరమైన ప్రక్రియను పూర్తి చేయించి సహాయనిధి మంజూరుకు చర్యలు తీసుకున్నారు.కులం, మతం వంటి భేదాలకు అతీతంగా ఆపదలో ఉన్న నిరుపేద కుటుంబానికి అండగా నిలవడం ద్వారా ఎమ్మెల్యే మానవత్వాన్ని చాటుకున్నారని గన్నవరం ఎస్సీ కాలనీ వాసులు పేర్కొన్నారు. తమ కుటుంబానికి అండగా నిలిచిన ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావుకు సలోమి కుటుంబ సభ్యులు, స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

## హెబ్బటం ఎస్ ఎస్ ట్యాంక్ లో మొసలి కలకలం..

**భయాందోళనల్లో ప్రజలు**

**ఫారెస్ట్ అధికారులు వెంటనే స్పందించి మొసలిని పట్టుకోవాలని రైతుల విజ్ఞప్తి**



**హోళగుంద,ఆగస్టు 18, ప్రజా జ్యోతి న్యూస్ –** హోళగుంద మండల పరిధిలోని హెబ్బటం గ్రామ సమీపంలోని ఎస్ ఎస్ ట్యాంక్ నందు మొసలి సంచరిస్తున్నట్లు సమాచారం రావడంతో రైతులు, గ్రామ ప్రజల్లో తీవ్ర భయాందోళన నెలకొంది. వ్యవసాయ పనుల నిమిత్తం ప్రతిరోజూ చెరువు పరిసరాల్లోని పొలాలకు వెళ్లాల్సి వస్తుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. చెరువుల్లో మొసలి సంచరిస్తున్నట్లు తెలియడంతో ఉదయం, సాయంత్రం వేళల్లో పొలాలకు వెళ్లేందుకు రైతులు భయపడుతున్నారు. ఎప్పుడు, ఎటువైపు నుంచి ప్రమాదం ఎదురవుతుందోనని బిక్కుబిక్కుమంటున్నారు. దీంతో వ్యవసాయ పనులకు సైతం ఇబ్బందులు ఎదురవుతున్నాయని రైతులు వాపోతున్నారు.ఈ విషయంపై సంబంధిత అధికారులు వెంటనే స్పందించి చెరువుల వద్ద పరిస్థితిని పరిశీలించాలని గ్రామస్థులు కోరుతున్నారు. ముఖ్యంగా అటవీశాఖ అధికారులు తక్షణమే రంగంలోకి దిగి మొసలి సంచారాన్ని గుర్తించి, దానిని సురక్షితంగా పట్టుకుని ప్రజలకు, రైతులకు ఎలాంటి ప్రమాదం లేకుండా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.అలాగే చెరువు పరిసర ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి, రైతులు మరియు గ్రామ ప్రజలకు అప్రమత్తతపై అవగాహన కల్పించాలని కోరుతున్నారు. మొసలి సంచారం పూర్తిగా నియంత్రించే వరకు అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని గ్రామస్థులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## గొల్లప్రోలు తహసీల్దార్ కార్యాలయంలో ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ ఆకస్మిక తనిఖీ

**విధుల్లో అలసత్వం వహిస్తే సహించేది లేదు.. ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం: కాకినాడ ఎంపీ ఉదయ్ శ్రీనివాస్**



**కాకినాడ జిల్లా గొల్లప్రోలు (ప్రజా జ్యోతి)** ప్రజలకు ప్రభుత్వ సేవలు సకాలంలో అందించడమే లక్ష్యంగా కాకినాడ పార్లమెంట్ సభ్యులు తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ మంగళవారం గొల్లప్రోలు తహసీల్దార్ కార్యాలయంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. చేబ్రోలు గ్రామంలో జరగనున్న అధికారిక కార్యక్రమానికి వెళ్తూ, మార్గమధ్యంలో ఆయన నేరుగా కార్యాలయానికి చేరుకున్నారు.ఈ సందర్భంగా సిబ్బంది హాజరు పట్టికను, ప్రజల నుంచి వచ్చిన అర్జీలను, రెవెన్యూ సమస్యల పరిష్కార పురోగతిని ఎంపీ స్వయంగా పరిశీలించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం లేదా అలసత్వం వహిస్తే సహించేది లేదని అధికారులను హెచ్చరించారు. ప్రభుత్వ కార్యాలయాలు ప్రజలకు అందుబాటులో ఉండాలని, విధి నిర్వహణలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. ముఖ్యంగా పేదలు, రైతుల సమస్యలపై త్వరితగతిన స్పందించాలని ఆదేశించారు.

**వృద్ధులతో ముచ్చటించిన ఎంపీ ఉదయ్ శ్రీనివాస్**

తహసీల్దార్ కార్యాలయ తనిఖీ అనంతరం, బయట రామాలయం వద్ద వేచి ఉన్న సీనియర్ సిటిజన్లను ఎంపీ ఆప్యాయంగా పలకరించారు. వారితో ముచ్చటించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ పథకాలు అందడంలో ఇబ్బందులు ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. నేరుగా ప్రజల్లోకి వస్తూ, కార్యాలయాలను తనిఖీ చేస్తున్న ఎంపీ శైలిపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

# ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుతున్న విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు నోటు పుస్తకాలు ఇవ్వాలి

**ప్రభుత్వ జూనియర్ కళాశాలలో లెక్చరర్స్ పోస్టు భర్తీ చేయాలి విద్యార్థులకు అనుగుణంగా తరగతి గదులు ఏర్పాటు చెయ్యాలి**

**విద్యారంగ సమస్యల కై ఈనెల 20వ తేదీన అనంతపురం కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నాను జయప్రదం చేయండి**

**ఏఐఎస్ఎఫ్ ప్రభుత్వ జూనియర్ కళాశాల కమీటీ ఎన్నిక ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి వెంకట్ నాయక్**

**గుంతకల్లు ఆగస్టు 18 (ప్రజా జ్యోతి):** అఖిల భారత విద్యార్థి సమాఖ్య ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల నందు విద్యార్థుల తో సమావేశం నిర్వహించు కోవడం జరిగింది. ఈ సమావేశానికి ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి వెంకట్ నాయక్ హాజరై మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలి అదేవిధంగా జూనియర్ కళాశాలలో పేద విద్యార్థులకు పాఠ్యపుస్తకా లు మరియు నోటు పుస్తకా లు ఇవ్వాలి ఖాళీగా ఉన్న లెక్చరర్స్ పోస్టులు భర్తీ చేయాలి అదేవిధంగా ఈనెల 20వ తేదీన అనంతపురం కలెక్టరేట్ దగ్గర జరిగే ధర్నాను విజయవంతం చేయాలని విద్యార్థులను పిలుపునివ్వ డం జరిగింది. అనంతరం ప్రభుత్వ జూనియర్ కళాశాల నూతన కమిటీని ఎన్నుకోవడం జరిగింది. కళాశాల అధ్యక్షులుగా రిహన్, ప్రధాన కార్యదర్శి గా చందు నాయక్, కోశాధికారి గా పురుషోత్తం, కార్యవర్గ సభ్యులు గా 15మంది




సమితి సభ్యులు గా, 37మంది తో నూతన కమిటి ని ఎన్నుకోవడం జరిగింది. ఈ కార్యక్రమం ఏఐఎస్ఎఫ్ పట్టణ సహాయ కార్యదర్శి ఫర్హన్, పట్టణ నాయకులు షహీర్, స్వేంతన్, సాయి మనోహర్, రోహిత్ తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి గుమ్మడి సంధ్యారాణిని మర్యాదపూర్వకంగా కలిసిన ఎమ్మెల్యే సత్యప్రభ

**--గిరిజన గ్రామాల అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని వినతి**

**--నియోజకవర్గ సమస్యలపై వినతిపత్రం అందజేసిన ఎమ్మెల్యే సత్యప్రభ**

**కాకినాడ జిల్లా ఆగస్టు 18(ప్రజా జ్యోతి స్టాఫ్ రిపోర్టర్)** ఆంధ్రప్రదేశ్ శాసనసభ సమావేశాల సందర్భంగా ప్రత్తిపాడు నియోజకవర్గ ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణిని మర్యాదపూర్వ కంగా కలిశారు.ఈ సందర్భంగా నియోజకవర్గంలోని గిరిజన గ్రామాల అభివృద్ధికి సంబంధించిన సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లి వినతిపత్రం అందజేశారు.నియోజకవర్గ పరిధిలోని గిరిజన గ్రామాల్లో మౌలిక వసతుల అభివృద్ధి, అవసరమైన సౌకర్యాల కల్పనకు ప్రత్యేక దృష్టి సారించాలని ఎమ్మెల్యే కోరారు.గిరిజన ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి అవసరమైన నిధులను సత్వరమే మంజూరు చేసి,అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.గిరిజన ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలు



చేపట్టి,వారికి మెరుగైన మౌలిక వసతులు అందేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే సత్యప్రభ రాజా కోరారు..

## ఆధార్ సేవలకు ప్రత్యేక కేంద్రాలు


**నాలుగు రోజుల పాటు అందుబాటులో ప్రత్యేక నమోదు నవీకరణ సేవలు**

**బాపట్ల ఆగస్టు 18 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి)** ఆధార్ నమోదు, సవరణ వంటి సేవలను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు బాపట్ల మండలంలో ప్రత్యేక ఆధార్ సేవా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు మండల స్వర్ణ గ్రామ అధికారి పల్నాటి శ్రీరాములు తెలిపారు. ఆగస్టు 17 నుంచి 20వ తేదీ వరకు ఆయా కేంద్రాల్లో సేవలు అందుబాటులో ఉంటాయని చెప్పారు.బాపట్ల మండల పరిధిలోని ఈస్ట్ బాపట్ల, ఈతేరు, వెదుళ్లపల్లి, అడవి 2, కంకటపాలెం స్వర్ణ గ్రామ కార్యాలయా ల్లో ప్రత్యేక ఆధార్ సేవలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకుని ఆధార్‌కు సంబంధించిన అవసరమైన సేవలను పొందాలని సూచించారు ముఖ్యంగా ఆధార్ నమోదు పూర్తికాని విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించినట్లు శ్రీరాములు తెలిపారు. విద్యార్థులు చదువుతున్న పాఠశాలలు, కళాశాలల్లోనే ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసి ఆధార్ నమోదు ప్రక్రియ చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. దీనివల్ల విద్యార్థులు ఆధార్ నమోదు కోసం



బయటకు వెళ్లాల్సిన అవసరం లేకుండా సులభంగా సేవలు పొందే అవకాశం ఉంటుందని తెలిపారు.మంగళవారం ఈస్ట్ బాపట్లలో నిర్వహిస్తున్న ఆధార్ కేంద్రాన్ని శ్రీరాములు సందర్శించి అక్కడ ప్రజలకు అందుతున్న సేవలను పరిశీలిం చారు. నమోదు ప్రక్రియ, ప్రజలకు కల్పిస్తున్న సౌకర్యాలు, సిబ్బంది పనితీరును పరిశీలించి అవసరమైన సూచనలు చేశారు.ఈ కార్యక్రమంలో మండల ప్రజా పరిషత్ కార్యాలయ పరిపాలన అధికారి, ఈస్ట్ బాపట్ల గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారి చక్రధరరావు తదితరులు పాల్గొన్నారు.

## ఆధార్ సేవలకు ప్రత్యేక కేంద్రాలు



**నాలుగు రోజుల పాటు అందుబాటులో ప్రత్యేక నమోదు నవీకరణ సేవలు**

**బాపట్ల ఆగస్టు 18 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి)**ఆధార్ నమోదు, సవరణ వంటి సేవలను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు బాపట్ల మండలంలో ప్రత్యేక ఆధార్ సేవా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు మండల స్వర్ణ గ్రామ అధికారి పల్నాటి శ్రీరాములు తెలిపారు. ఆగస్టు 17 నుంచి 20వ తేదీ వరకు ఆయా కేంద్రాల్లో సేవలు అందుబాటులో ఉంటాయని చెప్పారు.బాపట్ల మండల పరిధిలోని ఈస్ట్ బాపట్ల, ఈతేరు, వెదుళ్లపల్లి, అడవి 2, కంకటపాలెం స్వర్ణ గ్రామ కార్యాలయా ల్లో ప్రత్యేక ఆధార్ సేవలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకుని ఆధార్‌కు సంబంధించిన అవసరమైన సేవలను పొందాలని సూచించారు ముఖ్యంగా ఆధార్ నమోదు పూర్తికాని విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించినట్లు శ్రీరాములు తెలిపారు. విద్యార్థులు చదువుతున్న పాఠశాలలు, కళాశాలల్లోనే ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసి ఆధార్ నమోదు ప్రక్రియ చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. దీనివల్ల విద్యార్థులు ఆధార్ నమోదు కోసం బయటకు వెళ్లాల్సిన అవసరం లేకుండా సులభంగా సేవలు పొందే అవకాశం ఉంటుందని తెలిపారు.మంగళవారం ఈస్ట్ బాపట్లలో నిర్వహిస్తున్న ఆధార్ కేంద్రాన్ని శ్రీరాములు సందర్శిం చి అక్కడ ప్రజలకు అందుతున్న సేవలను పరిశీలించారు. నమోదు ప్రక్రియ, ప్రజలకు కల్పిస్తున్న సౌకర్యాలు, సిబ్బంది పనితీరును పరిశీలించి అవసరమైన సూచనలు చేశారు.ఈ కార్యక్రమంలో మండల ప్రజా పరిషత్ కార్యాలయ పరిపాలన అధికారి, ఈస్ట్ బాపట్ల గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారి చక్రధరరావు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సంక్షేమమే తెలుగుదేశం పార్టీ ధ్యేయం: లొడ్డ శేఖర్

**ఆర్ఎస్ రంగాపురంలో ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమం**



**బేతంచెర్ల:ఆగస్టు18(ప్రజా జ్యోతి)**తెలుగుదేశం పార్టీ ప్రతిష్టా త్మకంగా నిర్వహిస్తున్న రెండేళ్ల నమ్మకం– సంక్షేమం, అభివృద్ధి– ఇంటింటికీ తెలుగుదేశం, కార్యక్రమంలో భాగంగా ఆర్ఎస్ రంగాపురం గ్రామంలో టీడీపీ నాయకులు ఇంటిం టికీ వెళ్లి ప్రజలను కలిశారు.ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం గత రెండేళ్లలో చేపట్టిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను నంద్యాల జిల్లా టీడీపీ కార్యదర్శి లొడ్డ శేఖర్, టీడీపీ నాయకులు వారాల రాముడు, లొడ్డ రామమద్దయ్య ప్రజలకు వివరించారు. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల ద్వారా ప్రజలకు కలుగుతున్న ప్రయోజనాలను వివరించడం తో పాటు, గ్రామంలో పార్టీ కార్యకర్తలు, ప్రజలతో మమేకమయ్యారు.లొడ్డ శేఖర్ మాట్లాడుతూ, రాష్ట్రంలో టీడీపీ ప్రభుత్వం ఏర్పడిన గత రెండేళ్లలో ప్రజా సంక్షేమం, అభివృద్ధికి పెద్దపీట వేసిందన్నారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు. అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుం టున్నామని, గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో దుంబాల చిన్న మద్దయ్య (శేషు), నాల్లాడ్డి, వల్లంపాడు వెంకటేశ్వర్లుతో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## బీసీలకు రాజకీయ ప్రాధాన్యం ఎమ్మెల్యే వేగేశన



**బాపట్ల ఆగస్టు 18 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి)** స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం సామాజిక న్యాయం, రాజకీయ సాధికారతకు బలమైన ముందడుగని బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు అన్నారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. బీసీలకు రాజకీయంగా మరింత ప్రాతినిధ్యం కల్పించాలనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని తెలిపారు. గ్రామీణ స్థానిక సంస్థల్లో 34 శాతం, మున్సిపాలిటీల్లో 33 శాతం రిజర్వేషన్లతో బీసీల భాగస్వామ్యం మరింత పెరుగుతుందని పేర్కొన్నారు. బీసీల సంక్షేమం, రాజకీయ ప్రాతినిధ్యానికి తెలుగుదేశం పార్టీ మొదటి నుంచి ప్రాధాన్యత ఇస్తోందని ఎమ్మెల్యే తెలిపారు. కుల, చేతివృత్తులకు ప్రోత్సాహం, విద్య, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి, వ్యాపార అవకాశాల కల్పన వంటి అంశాల్లో ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందన్నారు. బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించడం ద్వారా వారికి రాజకీయంగా

# రుణ దరఖాస్తుల పరిష్కారంలో జాప్యం వద్దు

**బ్యాంకులు, ప్రభుత్వ శాఖలు సమన్వయంతో లక్ష్యాలు చేరుకోవాలి**

**జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ వాసుదేవ**





**బాపట్ల ఆగస్టు 18 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి)** జిల్లాలో అర్హులైన రైతులు, మహిళా స్వయం సహాయక సంఘాలు, యువత, చిన్న వ్యాపారులు, పారిశ్రామికవేత్తలకు రుణ సదుపాయాలు సకాలంలో అందేలా బ్యాంకర్లు ప్రత్యేక శ్రద్ధ చూపాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ వాసుదేవ సూచించారు. రుణం కోసం వచ్చిన దరఖాస్తులను అనవసరంగా పెండింగ్‌లో ఉంచకుండా నిబంధనల మేరకు త్వరితగతిన పరిష్కరించాలని స్పష్టం చేశారు. కలెక్టరేట్‌లో మంగళవారం నిర్వహించిన జిల్లా సంప్రదింపుల కమిటీ (డీసీసీ), జిల్లా స్థాయి సమీక్షా కమిటీ (డి ఎల్ ఆర్ సి) సమావేశంలో జిల్లాలో బ్యాంకింగ్ కార్యకలాపాలు, రుణాల మంజూరు, ప్రభుత్వ పథకాల అమలు, రికవరీ తదితర అంశాలపై కలెక్టర్ సమీక్షించారు. 2026--27 ఆర్థిక సంవత్సరానికి బాపట్ల జిల్లాలో 15,759.34 కోట్ల రూపాయల వార్షిక రుణ ప్రణాళిక రూపొందించినట్లు అధికారులు వివరించారు. ఇందులో వ్యవసాయ రంగానికి 10,992.17 కోట్లు రూపాయల ఎంఎస్ఎంఈ రంగానికి 1,308.51 కోట్లు రూపాయల ప్రాధాన్యతా రంగాలకు 12,691.78 కోట్ల రూపాయల రుణాల పంపిణీ లక్ష్యంగా నిర్ణయించారు. రుణాల మంజూరులో అర్హత కలిగిన లబ్ధిదారులకు ఇబ్బందులు తలెత్తకుండా బ్యాంకర్లు, సంబంధిత ప్రభుత్వ శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ అన్నారు. ముఖ్యంగా రైతులు, ఎఫ్‌పీఓలు, మహిళా సంఘాలు, సూక్ష్మ పరిశ్రమలు, యువతకు అందించే రుణాలపై దృష్టి పెట్టాలని సూచించారు. రుణ సదుపాయాల విస్తరణ ద్వారా స్వయం ఉపాధి, స్థానికంగా ఉపాధి అవకాశాల కల్పనకు బ్యాంకులు భాగస్వాములు కావాలని పేర్కొన్నారు. సామాజిక భద్రతా పథకాలపై గ్రామీణ ప్రజలకు అవగాహన పెంచడంతో పాటు డిజిటల్ బ్యాంకింగ్, ఆర్థిక అక్షరాస్యతపై విస్తృత ప్రచారం నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. సైబర్ మోసాల పట్ల ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. అలాగే రుణాల రికవరీపై ప్రత్యేక దృష్టి పెట్టి ఎన్‌పీఏలను తగ్గించేలా చర్యలు చేపట్టాలని బ్యాంకర్లకు సూచించారు. ప్రధానమంత్రి జనధన్ యోజన, ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన, ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన, అటల్ పెన్షన్ యోజన తదితర పథకాల అమలు తీరును కూడా సమావేశంలో సమీక్షించారు. అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి సామాజిక భద్రతా పథకాల ప్రయోజనం చేరేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా జన సురక్ష బీమా పథకం కింద మృతి చెందిన ముగ్గురు లబ్ధిదారుల కుటుంబాలకు చెక్కులను కలెక్టర్ అందజేశారు. సమావేశంలో లీడ్ బ్యాంక్ మేనేజర్ శివకృష్ణ, యూనియన్ బ్యాంక్ రీజినల్ హెడ్ డి. లక్ష్మీనారాయణ, ఆర్‌బీఐ ఎల్‌డీఓ ఎల్లమంద, నాబార్డు డీడీఎం రవికుమార్, డీఆర్‌డీఏ, మెప్మా పీడీలు బి. సింగయ్య, ఆనంద సత్యపాల్, జీఎం డీఐసీ కె. రామకృష్ణ, ఉద్యాన శాఖ డీడీ ఖలీమ్, పశుసంవర్ధక శాఖ జేడీ వేణుగోపాల్‌తో పాటు వివిధ బ్యాంకుల ప్రతినిధులు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావం

**రైతులకు పి ఎం డి ఎస్, మిశ్రమ పంటలతో రక్షణ**

**హెబ్బటం, లింగదహల్లి ఆర్ ఎస్ కె పరిధిలో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం**






**హోళగుంద, ఆగస్టు 18, ప్రజా జ్యోతి న్యూస్ -** ఎల్‌నినో ప్రభావంతో నెల రోజులుగా వర్షాభావ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో పంటలను కాపాడుకునేందుకు రైతులు ప్రత్యామ్నాయ సాగు పద్ధతులను అవలంబించాలని మండల వ్యవసాయ అధికారి శ్రీ ఆనంద్ లోకదళ్ సూచించారు. మంగళవారం మండలంలోని హెబ్బటం, లింగదహల్లి రైతు సేవా కేంద్రాల పరిధిలో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఖరీఫ్--2026లో పంటలు సాగు చేసిన రైతులు పంటల బీమా చెల్లించిన రైతులు తప్పనిసరిగా తమ పరిధిలోని రైతు సేవా కేంద్రం సిబ్బందిని సంప్రదించి ఆగస్టు 31లోపు ఈ--క్రాప్ బుకింగ్ నమోదు చేయించుకోవాలని అధికారులు సూచించారు. పి ఎం డి ఎస్ తో పంటలకు రక్షణ వర్షాభావ పరిస్థితుల్లో ఖాళీ పొలాల్లో రైతులు ప్రీ-మాన్సూన్ డ్రై సోయింగ్ విధానాన్ని చేపట్టాలని సూచించారు. చిరుధాన్యాలు, పప్పుదినుసులు, నూనెగింజలు తదితర 36 రకాల విత్తనాలను జీవామృతంతో శుద్ధి చేసి, మట్టి మరియు బూడిదలో కలిపి పొలాల్లో చల్లుకోవాలని తెలిపారు. ఈ మిశ్రమం వర్షం పడే వరకు పొలంలో ఉండి, వర్షం కురిసిన వెంటనే విత్తనాలు మొలకెత్తి ప్రధాన పంటకు రక్షణ కల్పిస్తాయని వివరించారు. ఈ విధానం ద్వారా నేలలో తేమ నిల్వ ఉండటంతో పాటు భూసారం మెరుగుపడుతుందని ప్రధాన పంటకు సుమారు 15 రోజుల వరకు నీటి కొరత ఉన్నా పంటపై ప్రభావం తక్కువగా ఉంటుందని అధికారులు తెలిపారు. మిశ్రమ పంటలతో అదనపు ఆదాయం వర్షాధార, మెట్ట ప్రాంతాల్లో రైతులు మిశ్రమ పంటలు, రక్షణ పంటలు సాగు విధానాలను అవలంబించడం ద్వారా పంటలకు రక్షణతో పాటు అదనపు ఆదాయం పొందవచ్చని సూచించారు ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఆనంద్ లోకదళ్‌తో పాటు ఎ ఈ ఓ విరూపాక్షి, ఆర్ ఎస్ కె సిబ్బంది గురుస్వామి, మురహరి మరియు పలువురు రైతులు పాల్గొన్నారు.

# అరచేతిలో ప్రపంచం మది దోచే జ్ఞాపకాల బంధీ

**ఫోటోగ్రఫీ రంగానికి 77 ఏళ్ల నేస్తం**

**ఆదర్శవంతమైన ఈశ్వర్ స్టూడియో ప్రయాణశీ..**

**నేడు ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవంలి**



**శంకవరం ఆగస్టు 18 (ప్రజాజ్యోతి న్యూస్)**వేల భావాలను ఒడిసిపట్టి, తరతరాలకు అందించి, అందరూ ఆస్వాదించే అద్భుతమైన కళ ఛాయాగ్రహణం. సాంకేతిక విప్లవం చేతిలోకి వచ్చాక నేడు ప్రతి ఒక్కరూ ఫొటోగ్రాఫర్‌గా మారుతున్నప్పటికీ, మది దోచే ప్రతి చిత్రాన్నీ బంధించి చిరస్థాయిగా నిలిపే అభిరుచి ఎప్పుడూ ప్రత్యేకమైనదే. సుమారు 167 ఏళ్ల క్రితం ఎంతోమంది చేసిన ప్రయోగాల ఫలితంగా పెద్ద సైజు ముసుగుల ఫిల్మ్ కెమెరాలు అందుబాటులోకి వచ్చాయి. కాలక్రమేణా మార్పులు సంతరించుకుని జేబులో పట్టే స్మార్ట్‌ఫోన్ కెమెరాలు, అత్యాధునిక డిజిటల్ కెమెరాల వరకు పరిణామం చెందాయి. ఫొటోగ్రఫీని వృత్తిగా మార్చుకుని ఎంతోమంది ఉపాధి పొందుతున్నారు. ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా ప్రత్తిపాడు మండల కేంద్రంలో 77 సంవత్సరాల క్రితం సలాది పెరుమాళ్ళ రావు స్థాపించిన 'ఈశ్వర్ స్టూడియో' ప్రత్యేక గుర్తింపు పొందింది. తండ్రి నుండి వారసత్వంగా వచ్చిన ఈ బాధ్యతలను ప్రస్తుతం ఆయన కుమారుడు సలాది కృష్ణ విజయవంతంగా నిర్వహిస్తున్నారు. నాటి తరం నాటి అరుదైన కెమెరాల నుండి నేటి అత్యాధునిక పరికరాల వరకు ఆయన వద్ద భద్రంగా ఉన్నాయి. కృష్ణ తీసిన అనేక ఛాయాచిత్రాలు రాష్ట్ర, జాతీయ స్థాయిలో పలు అవార్డులను తెచ్చిపెట్టాయి.

**సాంకేతికతతో పాటు నైతిక విలువలు ముఖ్యం**

కాలానుగుణంగా వచ్చిన మార్పులను అందిపుచ్చుకుంటూ సరికొత్త సంస్కృతి వైపు అడుగులు వేస్తున్నామని సలాది కృష్ణ తెలిపారు. "నేడు స్మార్ట్‌ఫోన్లు అందరికీ అందుబాటులోకి రావడంతో వయస్సుతో నిమిత్తం లేకుండా ప్రతి ఒక్కరూ ఫోటోలు తీస్తున్నారు. అయితే, సాంకేతికతను వినియోగించే క్రమంలో నైతిక విలువలను విస్మరించకూడదు. అవాంఛనీయ దృశ్యాలను తీసి ఇబ్బందులు కొనితెచ్చుకోవడమే కాకుండా, మహిళల ఆత్మగౌరవానికి భంగం కలిగించేలా ప్రవర్తించడం సరికాదు. ప్రతి ఒక్కరూ నైతిక విలువల పరిధిలో ఛాయాగ్రహణ పరిజ్ఞానాన్ని పెంచుకోవాలి" అని ఆయన పిలుపునిచ్చారు.

# శాసనసభ్యులు నందమూరి బాలకృష్ణ ఆరోగ్యం కుదుటపడడంతో సుబ్రహ్మణ్య స్వామికి ప్రత్యేక పూజలు

– ప్రత్యేక పూజలు నిర్వహించిన కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ పరిమళ మరియు అంగన్వాడి మహిళా సాధికారత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటలక్ష్మి



**హిందూపురం: ప్రజా జ్యోతి న్యూస్: ఆగస్టు 18: శ్రీ సత్య సాయి జిల్లా బ్యూరో అంజి:** హిందూపురం నియోజకవర్గ శాసనసభ్యులు పద్మభూషణ్ నందమూరి బాలకృష్ణ ఆరోగ్యం పూర్తిగా కోలుకోవడంతో కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ మరియు అంగన్వాడి మహిళా సాధికారత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటలక్ష్మి ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా హిందూపురం పట్టణంలో సుబ్రహ్మణ్య స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు శాసనసభ్యులు నందమూరి బాలకృష్ణ ఆరోగ్యంగా తిరిగి ప్రజల మధ్యకు రావడం అభిమానులకు సంతోషాన్ని కలిగించిందని కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ పరిమళ మరియు అంగన్వాడి మహిళా సాధికారత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటలక్ష్మి శాసనసభ్యులు నందమూరి బాలకృష్ణ ప్రజాసేవతో పాటు సినీ రంగంలోనూ మరింత విజయాలు సాధించాలని ఆకాంక్షించారు శాసనసభ్యులు నందమూరి బాలకృష్ణ ఆరోగ్యవంతులుగా త్వరగా కోలుకోవాలని గతంలో ఆ సుబ్రహ్మణ్యేశ్వర స్వామిని కోరుకున్నామని ప్రస్తుతం ఆయన సంపూర్ణ ఆరోగ్యంతో ఉండడం ఎంతో ఆనందంగా ఉందని చెప్పారు. అందుకే సుబ్రహ్మణ్య స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి కృతజ్ఞతలు తెలిపినట్లు వెల్లడించారు బాలకృష్ణకు ప్రజలతో విడదీయరాని అనుబంధం ఉందని ఆయన ఎల్లప్పుడూ ప్రజ శ్రేయస్సు కోసం సేవలు అందిస్తున్నారని భవిష్యత్తులో ఆయన మరింత ఉన్నత స్థాయికి చేరుకోవాలని కోరుకుంటూ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించినట్లు తెలిపారు ఈ కార్యక్రమంలో కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ అగన్వాడీ మహిళా సాధికారత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటలక్ష్మి ఆలయ అర్చకులు చంద్రమౌళి తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు

# ఎమ్మిగనూరులో తాగునీటి పైప్‌లైన్ పనులు ప్రారంభం ఎమ్మెల్యే బీవీ

**హామీ అమలుకు అడుగు**




**ఎమ్మిగనూరు, ఆగస్టు 19 (ప్రజాజ్యోతి):** ఎమ్మిగనూరు నియోజకవర్గ ప్రజలకు 24 గంటల నిరంతర తాగునీటి సరఫరా లక్ష్యంగా చేపట్టిన తాగునీటి ప్రాజెక్టు పనులు ప్రారంభమయ్యాయి ఎమ్మెల్యే డా. బి.వి. జయ నాగేశ్వర రెడ్డి ఇచ్చిన హామీ మేరకు మైనారిటీ కాలనీలో 200 ఎంఎం డీఐ పైపుల అన్‌లోడింగ్ పనులు చేపట్టారు. త్వరలో పైప్‌లైన్ ఏర్పాటు పనులను ప్రారంభించి నిర్ణీత సమయంలో పూర్తి చేసేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ప్రాజెక్టు పూర్తయితే ముఖ్యంగా వేసవిలో తాగునీటి సమస్యలకు పరిష్కారం లభించడంతో పాటు ప్రజలకు నిరంతర నీటి సరఫరా అందుబాటులోకి రానుంది. పైప్‌లైన్ పనుల సమయంలో ప్రజలు, వ్యాపారులకు కొంత అసౌకర్యం కలిగే అవకాశం ఉన్నందున పనులకు సహకరించాలని ఎమ్మెల్యే కోరారు. ఇచ్చిన హామీలను దశలవారీగా అమలు చేస్తూ ఎమ్మిగనూరును తాగునీటి సమస్య లేని నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు.

# జర్నలిస్ట్ కొరకాసుల రామకృష్ణ అకాల మరణం

**సంతాపం తెలిపిన స్థానిక విలేకరులు**




**ఎటపాక, ఆగస్టు 18 (ప్రజాజ్యోతి):**ఎటపాక మండలం గన్నవరం గ్రామానికి చెందిన సీనియర్ పాత్రికేయులు కొరకాసుల రామకృష్ణ (45) అకాల మరణం చెందారు. ఆయన హఠాన్మరణంతో స్థానిక పాత్రికేయ వర్గాల్లో తీవ్ర విషాద ఛాయలు అలముకున్నాయి. తండ్రి బాటలోనే పత్రికారంగంలోకి.. రామకృష్ణ తండ్రి దివంగత రోశయ్య గతంలో పత్రికా పంపిణీదారుడిగా పనిచేసి, 'పేపర్ రోశయ్య'గా మంచి గుర్తింపు పొందారు. తండ్రి స్ఫూర్తితోనే పత్రికారంగంపై ఆసక్తి పెంచుకున్న రామకృష్ణ, 2010లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ సమయంలో 'నమస్తే తెలంగాణ' దినపత్రికలో రిపోర్టర్‌గా, సర్క్యులేషన్ ప్రమోటర్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. అదే సమయంలో పత్రికల పంపిణీ వ్యవస్థను కూడా సమర్థవంతంగా నిర్వహించారు. గత కొంతకాలంగా ఆయన 'భద్రాద్రి న్యూస్'లో రిపోర్టర్‌గా సేవలందిస్తూ ప్రజల సమస్యలను వెలుగులోకి తీసుకురావడంలో చురుకైన పాత్ర పోషిస్తున్నారు. నిబద్ధత కలిగిన విలేకరిగా పేరుతెచ్చుకున్న రామకృష్ణ ఆకస్మిక మృతి పట్ల స్థానిక నాయకులు, ప్రజా ప్రతినిధులు, మండల పాత్రికేయులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, ఆత్మకు శాంతి చేకూరాల ని ప్రార్థించారు.

# ఇంద్రపాలెం పంచాయతీ కార్యదర్శి తీరుపై ఆగ్రహం: 38 సార్లు ఫిర్యాదు చేసినా స్పందన కరవు!

**సొంత ఖర్చులతో డ్రైన్ కట్టుకోవాలంటూ సెక్రటరీ**

**ఉచిత సలహా: బాధితుల ఆవేదన**




**కాకినాడ జిల్లా (ప్రజా జ్యోతి)** కాకినాడ రూరల్ పరిధిలోని ఇంద్రపాలెం గ్రామ పంచాయతీ కార్యదర్శి తీరుపై స్థానిక ప్రజల నుండి తీవ్ర స్థాయిలో ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. గ్రామంలోని డ్రైనేజీ సమస్యను పరిష్కరించడంలో పంచాయతీ యంత్రాంగం ఘోరంగా విఫలమైందని బాధితులు బహిరంగంగానే విమర్శిస్తున్నారు.

**38 సార్లు పీజీఆర్ఎస్ ఫిర్యాదు చేసినా నిర్లక్ష్యమే!**

గ్రామంలో ఎదురవుతున్న డ్రైనేజీ సమస్యపై స్పందించి, పరిష్కరించాలని కోరుతూ సింగంశెట్టి శ్రీనివాసరావు అనే స్థానికుడు ఏకంగా 38 సార్లు పీజీఆర్ఎస్ ద్వారా అధికారులకు మొరపెట్టుకున్నారు. ఈ సమస్యపై స్పందించిన జిల్లా పంచాయతీ అధికారి పరిశీలన జరిపి, అక్కడ అక్రమ డ్రైన్ నిర్మాణాలు ఉన్నట్లు నిర్ధారించారు. అయినప్పటికీ, ఆ అక్రమ నిర్మాణాలను తొలగించి సమస్యను పరిష్కరించడంలో స్థానిక పంచాయతీ కార్యదర్శి ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం గమనార్హం.

**20 ఏళ్ల డ్రైన్ మూసివేత.. నరకం చూస్తున్న స్థానికులు**

మరోవైపు, ఇంద్రపాలెంలోని గాంధీ స్ట్రీట్‌లో గత 20 సంవత్సరాలుగా ఉన్న డ్రైన్‌ను అకస్మాత్తుగా మూసివేయడంతో మురుగునీరు వెళ్లే మార్గం లేక స్థానికులు నరకయాతన అనుభవిస్తున్నారు. ఈ విషయమై విశ్రాంత ప్రొఫెసర్ గొల్లపల్లి వెంకటరావు మాట్లాడుతూ.. తమ వీధిలో మురుగునీరు నిలిచిపోయి రోగాల బారిన పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై పంచాయతీ కార్యదర్శిని నిలదీస్తే.. కొత్త డ్రైన్‌ను ప్రజలే తమ సొంత ఖర్చులతో ఏర్పాటు చేసుకోవాలని బాధ్యతారహితంగా సమాధానం ఇచ్చారని ఆయన ఆరోపించారు. పంచాయతీ కార్యదర్శి బాధ్యతారాహిత్యం వల్ల ఇంద్రపాలెం గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి, అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకుని, డ్రైనేజీ సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని బాధితులు, గ్రామ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# ఎల్నినో నేపథ్యంలో ప్రత్యామ్నాయ పంటలపై రైతులకు అవగాహన






**ఎమ్మిగనూరు, ఆగస్టు 19 (ప్రజాజ్యోతి):** కృషి విజ్ఞాన కేంద్రం బనవాసిలో ఐసీఆర్ --నారం సౌజన్యంతో ఎల్నినో ఆధారిత ప్రత్యామ్నాయ పంటల ప్రణాళికపై ఒకరోజు కార్యశాల నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీఆర్ --నారం జాయింట్ డైరెక్టర్ డాక్టర్ గోపాల్ లాల్ మాట్లాడుతూ పంటల వైవిధ్యీకరణ, అంతర పంటలు, నూనెగింజలు, చిరుధాన్యాలు, పశుసంపద అభివృద్ధి ద్వారా రైతులు ఆదాయ నష్టాలను తగ్గించుకోవాలని సూచించారు. నీటి సంరక్షణకు ఫారం పాండ్లు, నీటి కుంటలు, ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. ఐసీఆర్ ఐర్ శాస్త్రవేత్త డాక్టర్ ఎం. సురేష్ సెప్టెంబర్–అక్టోబర్‌లో ఆముదం, అక్టోబర్ డిసెంబర్‌లో కుసుమ సాగుకు అనుకూలమని వివరించారు. రార్స్ నంద్యాల శాస్త్రవేత్తలు పత్తిలో పచ్చదోమ, తెల్లదోమ, తామరపురుగు నివారణతో పాటు తేమ సంరక్షణ చర్యలను వివరించారు. కేవీకే బనవాసి కార్యక్రమ సమన్వయకర్త డాక్టర్ కే. రాఘవేంద్ర చౌదరి వివిధ నేలలకు అనుగుణంగా కంది, ఆముదం, సజ్జ, అలసంద, మినుము, జొన్న, ప్రొద్దుతిరుగుడు వంటి ప్రత్యామ్నాయ పంటలను సూచించారు. ఎంపిక చేసిన రైతులకు కుసుమ, ఉల్లి, ప్రొద్దుతిరుగుడు విత్తనాలు, నానో యూరియా అందజేశారు. రైతులు పంటల బీమా ఈకేవైసీ తప్పనిసరిగా పూర్తి చేసుకోవాలని వ్యవసాయ అధికారులు సూచించారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు, వ్యవసాయ ఉద్యాన శాఖ అధికారులు, కేవీకే సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

# భవన నిర్మాణ కార్మికుల కూలీ రేట్లు పెంచాలి సీఐటీయూ డిమాండ్

### పోరుమామిళ్లలో సీఐటీయూ ఆధ్వర్యంలో బేల్దారి కార్మికుల భారీ ర్యాలీ, ధర్నా
### తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పణ






**పోరుమామిళ్ల, ఆగస్టు 18(ప్రజా జ్యోతి ప్రతినిధి)** ధరల పెరుగుదలకు అనుగుణంగా భవన నిర్మాణ బేల్దారి కార్మికుల రోజువారీ కూలీని రూ. 1000 పెంచాలని, సంక్షేమ బోర్డు ద్వారా 2019 వరకు అమలులో ఉన్న అన్ని పథకాలను పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ ఏపీ భవన నిర్మాణ బేల్దారులు, కార్మికుల సంఘం (సీఐటీయూ అనుబంధం) ఆధ్వర్యంలో మంగళవారం పోరుమామిళ్లలో భారీ ర్యాలీ, ధర్నా కార్యక్రమం నిర్వహించారు. స్థానిక పంచాయతీ కార్యాలయం నుండి తహసీల్దార్ కార్యాలయం (వీ=హా ాటటఅఎవ) వరకు కార్మికులు ర్యాలీగా తరలివెళ్లారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి, తమ సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్‌కి అందజేశారు. దీనిపై తహసీల్దార్ స్పందిస్తూ.. సమస్యలను వెంటనే లేబర్ కార్యాలయానికి నివేదిస్తామని హామీ ఇచ్చారు. కార్మికుల ప్రధాన డిమాండ్లు కూలీ రేట్ల పెంపు నిత్యావసర వస్తువుల ధరలు, ఇంటి అద్దెలు, వైద్య ఖర్చులు పెరిగినందున రోజువారీ కూలీగా బేల్దార్లకు రూ. 1000, పురుష సహాయకులకు (పైకూలి) రూ. 800, మహిళా కూలీలకు రూ. 600 పెంచాలి. ప్రమాద భీమా ప్రమాదవశాత్తు వైకల్యం లేదా మరణం సంభవిస్తే భవన నిర్మాణ కార్మికులకు రూ. 10 లక్షల ప్రమాద భీమా కల్పించాలి. సంక్షేమ పథకాల పునరుద్ధరణ 2019 వరకు సంక్షేమ బోర్డు ద్వారా అమలు చేసిన అన్ని రకాల పథకాలను ఎలాంటి షరతులు లేకుండా అమలు చేయాలి. పింఛన్ సౌకర్యం 50 ఏళ్లు నిండిన ప్రతి బేల్దారి కార్మికుడికి ప్రభుత్వం పింఛన్ సదుపాయం కల్పించాలి. నివాస స్థలాలు కార్మికులకు ఉచితంగా ఇంటి స్థలాలు కేటాయించి, ప్రత్యేక కాలనీ ఏర్పాటు చేయాలి. నాయకుల విమర్శలు ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి యన్. భైరవప్రసాద్, మండల అధ్యక్షుడు సోమయ్య ?లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం 44 కార్మిక చట్టాలను 4 కోడ్‌లుగా మార్చి కార్మికుల హక్కులను హరిస్తోందని మండిపడ్డారు. గత ప్రభుత్వం సంక్షేమ బోర్డు పథకాలను నిలిపివేసి కార్మికులను తీవ్ర ఇబ్బందులకు గురిచేసిందని, ప్రస్తుత కూటమి ప్రభుత్వం కూడా అధికారంలోకి వచ్చాక పూర్తిస్థాయి పథకాలను పునరుద్ధరించకుండా కేవలం 4 పథకాలకే పరిమితం చేస్తూ జీవో జారీ చేయడం దుర్మార్గమని విమర్శించారు. మండల నాయకులు ఠాగూర్, నాగరాజు, జాఫర్ ?లాడుతూ, ప్రభుత్వం తక్షణమే స్పందించి కార్మికుల సమస్యలను పరిష్కరించకపోతే రాబోయే రోజుల్లో కడప లేబర్ ఆఫీస్ ముట్టడితో పాటు ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. పాల్గొన్నవారు ఈ కార్యక్రమంలో సీఐటీయూ కార్యదర్శి ప్రకాష్, బేల్దారుల యూనియన్ నాయకులు అలీ బాషా, గురప్ప, సిద్దయ్య, రాజు, మోహన్, ఉదయగిరి మస్తాన్, వెంకటయ్య, పోల్ రెడ్డి, భాస్కర్, బాల, వెంకటేష్, శ్రీనివాసులు, సంటయ్య, ప్రకాశం, ఎల్. రమణయ్య, నాగేంద్రలతో పాటు పెద్ద సంఖ్యలో బేల్దారి కార్మికులు, కూలీలు పాల్గొన్నారు.

# మంత్రాలయం టీడీపీ ఇంచార్జి ఆదేశాలతో ఏరిగేరి గ్రామ తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం

ఎరిగేరి గ్రామ టిడిపి అధ్యక్షులు బసవరాజు

**కౌతాళం ఆగస్టు 18 ప్రచార జ్యోతి** కౌతాళం మండలం ఏరిగేరి గ్రామ ప్రజలు తాగునీటి కోసం ఇబ్బందులు పడకుండా శాశ్వత పరిష్కారం కల్పించాలనే లక్ష్యంతో మంత్రాలయం ఇంచార్జి ఆదేశాల మేరకు ఆర్డబ్ల్యూఎస్ ద్వారా కొత్త పైప్‌లైన్ ఏర్పాటు పనులు ప్రారంభమయ్యాయి. ఎన్నో రోజులుగా గ్రామ ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యను గుర్తించిన ఇంచార్జి ఎన్.రాఘవేంద్ర రెడ్డి మరియు మండల టీడీపీ అధ్యక్షులు చూడి సురేష్ నాయుడు అదేశాల మేరకు సంబంధిత అధికారులతో సమన్వయం చేస్తూ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని ఆదేశించారు. మంత్రాలయం ఇంచార్జి రాఘవేంద్ర రెడ్డి ఆదేశాలను ఆచరణలో పెట్టే విధంగా టీడీపీ సీనియర్ నాయకులు రామలింగ,గ్రామ అధ్యక్షులు బసవరాజు,ఐటీడీపీ నియోజకవర్గ అధ్యక్షులు రామకృష్ణ సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుంటూ పైప్‌లైన్ పనులను దగ్గరుండి పర్యవేక్షిస్తు గ్రామ ప్రజలకు తాగునీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పనులను వేగవంతంగా పూర్తి చేసే దిశగా చర్యలు కొనసాగిస్తున్నారు. ప్రజల సమస్యలను కేవలం తెలుసుకోవడమే కాకుండా వాటికి పరిష్కారం చూపించడమే లక్ష్యంగా ఇంచార్జి నాయకత్వంలో స్థానిక టీడీపీ నాయకులు నిరంతరం కృషి చేస్తున్నామని గ్రామ నాయకులు తెలిపారు. ఏరిగేరి గ్రామంలో కొత్త పైప్‌లైన్ ఏర్పాటు పూర్తయితే తాగునీటి సరఫరా మరింత మెరుగుపడి గ్రామ ప్రజలకు నీటి కష్టాలు గణనీయంగా తగ్గుతాయాని




స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ప్రజల అవసరాలను గుర్తించి వెంటనే స్పందిస్తున్న ఇంచార్జికి పనులను ముందుకు తీసుకెళ్తున్న స్థానిక నాయకులకు గ్రామ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు పూజారి పెద్ద హనుమంతు,యూనిట్ ఇంచార్జ్ చెవుల రమేష్, సుభాన్, అంజినయ్య,వడ్డే రంగస్వామి,ఏసి. వీరేష్,మార్క్, బాషా, శాంతరాజు,వీరేష్, ఉరుకుందప్ప మరియు గ్రామ సీనియర్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## విశాఖపట్నం బిజెపి రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో పాల్గొన్న గొల్లప్రోలు, పిఠాపురం నియోజకవర్గ నాయకులు



**కాకినాడ జిల్లా పిఠాపురం నియోజకవర్గ (ప్రజా జ్యోతి)** విశాఖపట్నంలో మంగళవారం నిర్వహించిన భారతీయ జనతా పార్టీ విస్తృత స్థాయి రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో పిఠాపురం నియోజకవర్గానికి చెందిన పలువురు ముఖ్య నాయకులు పాల్గొన్నారు. దేశ అధ్యక్షుడు నితిన్ నబీన్ పర్యటనలో భాగంగా ఈ కీలక సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో పిఠాపురం నియోజకవర్గ బిజెపి నాయకులు, బిఎల్‌ఏ గండి కొండలరావు, గొల్లప్రోలు టౌన్ ప్రెసిడెంట్ చిట్టా మధు, గొల్లప్రోలు మండల ప్రెసిడెంట్ కర్రి చిట్టిబాబు, పిఠాపురం మండల ప్రెసిడెంట్ దువ్వా గంగాధర్, ఓబీసీ నాయకులు వానపల్లి రమణ, కొత్తపల్లి మండల ప్రెసిడెంట్ పంపన శేషు తదితరులు పాల్గొన్నారు. పార్టీ బలోపేతం, భవిష్యత్ కార్యాచరణపై ఈ సమావేశంలో దిశానిర్దేశం చేసినట్లు నాయకులు పేర్కొన్నారు.

## నేతన్న సేవలో అర్హుల, అనర్హుల జాబితాలను ప్రదర్శించాలి



**ఎమ్మిగనూరు, ఆగస్టు 19 (ప్రజాజ్యోతి):** 'నేతన్న సేవ' పథకానికి సంబంధించిన అర్హుల, అనర్హుల జాబితాలను సచివాలయాల్లో తక్షణమే ప్రదర్శించి, అనర్హతకు గల కారణాలను వెల్లడించాలని చేనేత మల్లికార్జున వైఎస్ఆర్పి జిల్లా చేనేత హస్తకళ విభాగపు అధ్యక్షులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా పాత్రికేయ సమావేశంలో వారు మాట్లాడుతు నేతన్న సేవ పథకానికి అర్హత ఉన్నప్పటికీ సాంకేతిక కారణాలతో పథకం అందని నేతన్నలకు సమస్యలను సరిచేసుకునే అవకాశం కల్పించాలని కోరారు. ఈ–కేవైసీ, బ్యాంకు వివరాలు ఇనాక్టివ్ ఖాతాలు, తప్పుగా నమోదైన ఖాతా నంబర్లు వంటి కారణాలతో కొందరు లబ్ధి కోల్పోయే అవకాశం ఉందని తెలిపారు. జాబితాలను బహిరంగంగా ప్రదర్శిస్తే అర్హులైన వారిని గుర్తించి పథకం అందించేందుకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. జిల్లా చేనేత, జౌళి శాఖ అధికారులు ఎమ్మిగనూరుకు సంబంధించిన అర్హుల, అనర్హుల జాబితాలను వెంటనే ప్రదర్శించి, అర్హులైన ప్రతి నేతన్నకు పథకం అందేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమస్య పరిష్కరించకపోతే నేతన్నల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

## బీసీలకు 34% రిజర్వేషన్ అమలు చేయాలి

సి రంగయ్య సమతా సైనిక్ దళ్



**ఎమ్మిగనూరు, ఆగస్ట్ 18(ప్రజా జ్యోతి ):** బీసీల జనాభా ప్రాతిపదికన 34 శాతం రిజర్వేషన్ కల్పించే బిల్లును శాసనసభలో కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టి ఆమోదించాలని సమతా సైనిక్ దళ్ రాష్ట్ర అధికార ప్రతినిధి సి. రంగయ్య డిమాండ్ చేశారు. బీసీలను కేవలం ఓటు బ్యాంకుగా చూడకుండా వారి దీర్ఘకాల పోరాటాలకు ప్రభుత్వం ముగింపు పలకాలని కోరారు. ఈడబ్ల్యూఎస్ జుఔొకు 10 శాతం రిజర్వేషన్ కల్పించినప్పుడు బీసీల రిజర్వేషన్లకు 50 శాతం పరిమితి ఎందుకు అడ్డంకిగా మారుతుందని ప్రశ్నించారు. రాబోయే ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని, లేకపోతే బీసీల గొంతుకై తమ పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సమతా సైనిక్ దళ్ నాయకులు పాల్గొన్నారు.

## నానిని అభినందించిన పలువురు వైసీపీ నాయకులు



**తాళ్లపూడి, ఆగస్టు 18, ప్రజాజ్యోతి న్యూస్** కొవ్వూరు నియోజకవర్గం తాళ్లపూడి మండలం అన్నదేవరపేట గ్రామానికి చెందిన పప్పుప్పల నానికి వైకాపా వైకాపా రాష్ట్ర యూత్ జాయింట్ సెక్రటరీ గా నియమించిన నేపథ్యంలో ఆయన అభిమానులు, నాయకులు యువత భారీ కటౌట్ల నడుమ కేక్ కట్ చేసే సంబరాలు జరుపుకున్నారు. వైకాపా పార్టీ అధినేత వైయస్ జగన్మోహన్ రెడ్డి ఎంతో నమ్మకంగా అప్పగించిన బాధ్యతను సక్రమంగా నిర్వర్తిస్తానని ఈ సందర్భంగా నాని తెలిపారు. పార్టీకి కష్టపడి పని చేస్తే యువతకు మరిన్ని అవకాశాలు వస్తాయని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా నానీని గ్రామ పెద్దలు, యువత అభినందించారు

## ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమం అపూర్వ జనస్పందన లభిస్తుంది...

**:-కౌతాళం మండల కేంద్రం నందు దిగ్విజయంగా సాగుతున్న ఇంటింటా తెలుగుదేశం కార్యక్రమం...పాల్గొన్న మండల అధ్యక్షులు చూడి సురేష్ నాయుడు,సింగిల్ విండో అధ్యక్షులు వెంకటపతిరాజు**





**కౌతాళం, ఆగష్టు 18 ప్రజా జ్యోతి** శమంగళవారం రోజున మంత్రాలయం నియోజకవర్గం కౌతాళం మండలం నందు మండల కేంద్రం నందు కూటమి ప్రభుత్వం ఆదేశాల మేరకు ఇంచార్జీ రాఘవేంద్ర రెడ్డి పిలుపుమేరకు జిల్లా ఉపాధ్యక్షులు చూడి ఉలిగయ్య ప్రోత్సాహం తో మండల అధ్యక్షులు చూడి సురేష్ నాయుడు అధ్యక్షతన ఇంటింటా తెలుగుదేశం కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా రెండేళ్ల నమ్మకం సంక్షేమం అభివృద్ధి గురించి స్థానిక లబ్ధిదారులకు క్లుప్తంగా వివరిస్తూ స్థానికంగా ఎదుర్కొంటున్న ప్రజా సమస్యలను అడిగి తెలుసుకొని త్వరగతిన పరిష్కారం చేస్తామని హామీ ఇవ్వడం జరిగినది. ఈ కార్యక్రమములో గ్రామ నాయకులు కురువ వీరేష్,రామలింగ అన్న,అయ్యప్ప, కాకమ్ మల్లయ్య,పట్టణ అధ్యక్షులు డా"రాజనందు,తెలుగు రైతుసంఘం అధ్యక్షులు గిరి, ముకన్న,పాఠశాల చైర్మన్ లింగేష్,నభీ,గోపాల్,ఈరన్న,నాగేష్, తయన్న ,రేవన్న,రమేష్, నాగరాజు,శ్రీను మరియు గుజ్జుల వీరేష్,మొదలగు వారు పాల్గొనడం జరిగినది.

## ధర్మవరంలో శ్రీ ఆర్.ఆర్. హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

**మరికొన్ని గ్రామాల్లో ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు డాక్టర్ రవికుమార్ రెడ్డి**




**కొవ్వూరు, ఆగస్టు 18, ప్రజాజ్యోతి న్యూస్** గ్రామీణ ప్రాంతాల ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామని శ్రీ ఆర్.ఆర్. మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌లి సీఎండి డా. ఆర్. రవికుమార్ రెడ్డి తెలిపారు. మంగళవారం కొవ్వూరు మండలం ధర్మవరం గ్రామంలో ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరానికి గ్రామం మరియు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరయ్యారు. ఈ శిబిరంలో సుమారు 100 మందికి పైగా రోగులకు ఉచితంగా రక్త పరీక్షలు, ఈసీజీ, బీపీ, షుగర్ తదితర ప్రాథమిక పరీక్షలు నిర్వహించారు. వైద్యులు పరీక్షించి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందించారు. ఈ సందర్భంగా డా. రవికుమార్ రెడ్డి మాట్లాడుతూ, "ఆర్థిక ఇబ్బందుల కారణంగా వైద్యం చేయించుకోలేని పేదలకు అండగా నిలవడమే మా ఉద్దేశ్యం అని ఇలాంటి శిబిరాలను రాబోయే రోజుల్లో మరిన్ని గ్రామాల్లో నిర్వహిస్తాం" అని అన్నారు. ఈ కార్యక్రమంలో తీగల శ్రీను,కుందుల మోహన్ సురేంద్ర, హాస్పిటల్ మేనేజర్ చింటూ,మణికంఠ, పిఆర్ఓలు ,సాగర్, వెంకట్ మరియు హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు

## విద్యుత్ బిల్ కలెక్టర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలి



**బద్వేల్ స్టాఫ్ రిపోర్టర్ ఆగస్టు 18 (ప్రజా జ్యోతి)** విద్యుత్ శాఖలో పనిచేస్తున్న బిల్ కలెక్టర్ల ఏజెంట్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని, ఆగష్టు 17,18 న తిరుపతి ఎస్పీడీసీఎల్ కార్యాలయం ముందు చేస్తున్న రిలే నిరాహార దీక్షలు చేస్తున్న వారి న్యాయమైన సమస్యలను వెంటనే పరిష్కరించాలని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బి నాయబ్ రసూల్ మరియు యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ కడప జిల్లా అధ్యక్షుడు బి యన్ నాగసుబ్బయ్య సంయుక్తంగా డిమాండ్ చేశారు. దశాబ్దాలుగా విద్యుత్ పంపిణీ వ్యవస్థలో కీలకంగా పనిచేస్తున్న బి సి ఎ లను ఏకపక్షంగా తొలగించడం, కాంట్రాక్టు పేరుతో శాశ్వతం చేయకుండా వేధించడం తీవ్ర అన్యాయమని వారు అన్నారు. వేల కోట్ల ఆదాయం వస్తున్న డిస్కాం సంస్థలో కనీస ఉద్యోగ భద్రత కూడా లేకుండా బి సి ఎ లను రోడ్డున పడేయడం కార్మిక వ్యతిరేక చర్య అన్నారు బి సి ఏ ల సమస్యలపై ప్రభుత్వం వెంటనే స్పందించి చర్చలు జరిపి, ఉద్యోగ భద్రతతో పాటు జీతభత్యాలు, ఇతర న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. మనతో మనమధ్య పనిచేసిన వారిని తొలగించడాన్ని, కార్మిక ఉద్యోగులు వ్యతిరేకించి బిసిఏలకు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా బి సి ఎ లకు తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని, వారి పోరాటంలో అండగా ఉంటామని కడప జిల్లా అధ్యక్షుడు బి ఎన్ నాగ సుబ్బయ్య స్పష్టం చేశారు. విద్యుత్ సంస్థ అభివృద్ధిలో సంవత్సరాలు తరబడి సేవలందించిన, అందిస్తున్న, కాంట్రాక్టు కార్మికులను గాని ప్లీజ్ రేట్ వర్కర్లను గాని అన్యాయంగా తొలగించడం కార్మిక చట్టాలకు వ్యతిరేకం కార్మిక వర్గమంతా బిల్ కలెక్టర్లలకు అండగా నిలబడాలని, యునైటెడ్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రొద్దుటూరు డివిజన్ అధ్యక్షుడు ఈనెపాటి లెనిన్ బాబు తెలిపారు.

## జె తిమ్మాపురంలో పేకాట స్థావరంపై పోలీసుల దాడి

**--జూద క్రీడలు నిర్వహిస్తే కఠిన చర్యలు-సీఐ వైఆర్‌కే శ్రీనివాస్**

**కాకినాడ జిల్లా ఆగస్టు 18 (ప్రజా జ్యోతి స్టాఫ్ రిపోర్టర్)** పెద్దాపురం మండలం జె తిమ్మాపురం గ్రామ శివారులో పేకాట ఆడుతున్న ఏడుగురిపై పోలీసులు దాడి చేసి రూ.2,650 నగదును స్వాధీనం చేసుకున్నారు. కాకినాడ జిల్లా ఎస్పీ జి బిందు మాధవ్ ఐపీఎస్ ఆదేశాల మేరకు పెద్దాపురం ఎస్సై యు వి పాపారావు ఆధ్వర్యంలో దాడి నిర్వహించి ఏడుగురిపై కేసు నమోదు చేశారు. జూద క్రీడలు,కోడిపందాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని సీఐ వైఆర్‌కే శ్రీనివాస్ హెచ్చరించారు.



# చేబ్రోలు పట్టు మార్కెట్‌లో 'మేరా రేషమ్ మేరా అభిమాన్ 2.0'.. పాల్గొన్న ఎంపీ ఉదయ్ శ్రీనివాస్





**కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం (ప్రజా జ్యోతి)** గొల్లప్రోలు మండలం చేబ్రోలు గ్రామంలోని ప్రభుత్వ పట్టు మార్కెట్ కేంద్రంలో మంగళవారం "మేరా రేషమ్--మేరా అభిమాన్ 2.0" కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కాకినాడ పార్లమెంట్ సభ్యులు తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. పట్టు పరిశ్రమలో జరుగుతున్న శాస్త్రీయ పరిశోధనలను క్షేత్రస్థాయి పద్ధతులతో అనుసంధానం చేయడం, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని పట్టు రైతులకు అందుబాటులోకి తీసుకురావడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. పట్టు పరిశ్రమ అభివృద్ధి, రైతుల సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఈ కార్రమంలో భాగంగా ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ పట్టు రైతులతో నేరుగా మాట్లాడి, వారు ఎదుర్కొంటున్న సవాళ్లను అడిగి తెలుసుకున్నారు. పట్టు సాగులో పెట్టుబడి వ్యయం పెరగడం, మార్కెటింగ్ ఇబ్బందులు, పట్టు ్రల్లో హెచ్చుతగ్గులు, ప్రభుత్వ సహకారం వంటి పలు సమస్యలను రైతులు ఎంపీ దృష్టికి తీసుకెళ్లారు.

**ధికారులకు ఆదేశాలు:**

రైతుల సమస్యలపై స్పందించిన ఎంపీ.. వీటిని వెంటనే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. రైతులకు ప్రభుత్వ శాఖల నుంచి అందాల్సిన సాంకేతిక సహాయం, మార్గదర్శకాలు, సంక్షేమ పథకాలు సక్రమంగా అందేలా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, పట్టు పరిశ్రమ శాఖ అధికారులు,పట్టు రైతులు పాల్గొన్నారు.

# సైబర్ నేరాలపట్ల!..మహిళా రక్షణ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి!..

**ఎటపాక సర్కిల్ ఇన్స్పెక్టర్ కృష్ణ!..**

**వరరామచంద్రాపురం ఎస్సై ఎస్.డి సాధిక్!..**

**వి.ఆర్. పురం, ఆగస్టు18(ప్రజాజ్యోతి ప్రతినిధి)** సైబర్ నేరాలపట్ల, బాల్య వివాహాల పట్ల, మహిళల రక్షణ చట్టాల పట్ల, అవగాహన కలిగి ఉండి, మొబైల్ ఫోన్ వాడకం మంచి కార్యక్రమాలకు ఉపయోగించాలని, ఎటపాక సర్కిల్ ఇన్స్పెక్టర్ కృష్ణ, వరరామచంద్రాపురం, ఎస్సై ఎస్.డి సాధిక్, సూచించారు. మంగళవారం వడ్డిగూడెం,గ్రామం శివాలయం వద్ద సైబర్, నేరాల పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళా చట్టాల పై, బాల్య వివాహాలు అవగాహన ముఖ్యమని వారు స్పష్టం చేశారు హెల్మెట్ ధరించి వాహనం నడపడం ద్వారా రోడ్డు ప్రమాదాలు నివారించవచ్చునని పేర్కొన్నారు. చెడువ్యసనాలకు ధూరంగాఉండాలని వారు పిలుపునిచ్చారు.

**ప్రత్యేక అవగాహనా కార్యక్రమం!..**

సెల్ ఫోన్ వినియోగంపై,మోసాలపై,పూర్తి అవగాహన కల్పించారు. తెలియని వ్యక్తులకు బ్యాంకు ఖాతాల వివరాలు చెప్పొద్దని, ఎవ్వారైనా ఒకవేళ మోసపోతే వెంటనే పోలీస్ స్టేషన్లలో సంప్రదించాలని విజ్ఞప్తిచేశారు.

**రోడ్డు భద్రతపై!..**



రోడ్డు భద్రతపై,ఫోన్లువాడకంపై,సూచనలు చేశారు. వాహనం నడుపుతూ ఫోన్ మాట్లాడటం ప్రమాదాలకు దారితీస్తుందని హెచ్చరించారు. హెల్మెట్ పెట్టుకోవడం మీకుటుంబానికి రక్షణ కవచమని పేర్కొన్నారు. నిర్లక్ష్యంగా వాహనాలు నడిపి ప్రమాదాలు తెచుకోవద్దని,హితవు పలికారు.

**నేటితరం సెల్ ఫోన్ వాడకంపై!..**

నేటియువత సెల్ ఫోన్ మంచి విషయాలు తెలుసుకోవడానికి, విజ్ఞానాన్ని పెంపొందించు కోవడానికి, మాత్రమే వాడాలని, చెడు అలవాట్లుకు లోనై జీవితాలు నాశనం చేసుకోవద్దని, హితబోధ చేశారు. ఈ అవవాహానా కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, గ్రామస్తులు, మహిళలు, యువకులు, తదితరులు భారీగాపాల్గొన్నారు.

# ఘనంగా టిడిపి రాష్ట్ర కార్యదర్శి కొత్తపల్లి ఆశిష్ లాల్ జన్మదిన వేడుకలు

**భవిష్యత్తులో ఆశిష్ మరిన్ని పదవులు అలంకరించాలి నామా సురేంద్ర కుమార్**

**కొవ్వూరు, ఆగస్టు 18, ప్రజాజ్యోతి న్యూస్** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ కె.ఎస్. జవహర్ తనయుడు టిడిపి రాష్ట్ర కార్యదర్శి కొత్తపల్లి ఆశిష్ లాల్ జన్మదినోత్సవ వేడుకలను కొవ్వూరులోని వారి నివాసంలో ఘనంగా నిర్వహించారు. పార్టీ శ్రేణులు, అభిమానులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరై ఆశిష్ లాల్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. చైర్మన్ జవహర్ స్వయంగా హాజరై కేక్ కటింగ్ చేయించి తనయుడిని ఆశీర్వదించారు. ఈ వేడుక వేడుకకు తాళ్లపూడి మండలం నుంచి తెలుగు యువత నాయకులు నామా సురేంద్ర కుమార్, సిద్ధన రాధాకృష్ణ ఆధ్వర్యంలో యువత పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా నామా సురేంద్ర కుమార్ మాట్లాడుతూ "ఆశిష్ లాల్ ఎప్పుడూ యువతకు స్ఫూర్తిగా ఉంటూ సేవా కార్యక్రమాల్లో ముందుంటు పార్టీని బలోపేతం





చేయడానికి అవిశ్రాంతంగా కృషి చేస్తున్నారని రాబోయే రోజుల్లో ఆయన మరింత ఉన్నత పదవులు అలంకరించి ప్రజాసేవ చేసే విధంగా ఆ భగవంతుడు ఆయనకు పూర్తి ఆయురారోగ్యాలు, విజయాలు ఇవ్వాలని ఆకాంక్షిస్తున్నాను" అని అన్నారు. తనకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసిన ప్రతి ఒక్కరికీ ఆశిష్ పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేశారు. ఈ వేడుకల్లో టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు

## కర్నూలు జిల్లా ప్రజల దాహార్తి,సాగునీటి కోసం ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి కీలక అడుగు....బళ్లారి ఇరిగేషన్ అధికారులకు వినతిపత్రం అందజేత!

**కౌతాళం,ఆగష్టు 18 ప్రజా జ్యోతి** కర్నూలు జిల్లా ప్రత్యేకించి మంత్రాలయం నియోజకవర్గ ప్రజలకు సాగు,తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా మంత్రాలయం శాసనసభ్యులు వై. బాలనాగిరెడ్డి ప్రత్యేక దృష్టి సారించారు. సరిహద్దు ప్రాంత ప్రజల నీటి అవసరాలను తీర్చేందుకు స్వయంగా రంగంలోకి దిగి చర్యలు చేపట్టారు.?కర్ణాటక రాష్ట్రంలోని బళ్లారి జిల్లాలో ఉన్న సాగునీరు,తాగునీటి పారుదల శాఖ ప్రధాన కార్యాలయాన్ని మంత్రాలయం ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి ఆధ్వర్యంలో నాయకుల బృందం సందర్శించింది. ఈ సందర్భంగా కర్నూలు జిల్లా సరిహద్దు గ్రామాల ప్రజల తాగునీటి అవసరాలు,రైతాంగం ఎదుర్కొంటున్న సాగునీటి ఎద్దడిని వివరిస్తూ సంబంధిత ఇరిగేషన్ అధికారులకు అధికారికంగా వినతిపత్రం (అర్జీ) అందజేశారు.

**?వెంటనే పై అధికారుల దృష్టికి తీసుకెళ్తాం: ఇరిగేషన్ అధికారులు**

ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి వినతిపై నీటిపారుదల శాఖ అధికారులు సానుకూలంగా




స్పందించారు. ఈ సమస్య తీవ్రతను పరిగణనలోకి తీసుకుని,ఎమ్మెల్యే ఇచ్చిన వినతిపత్రాన్ని వెంటనే తమ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి నీటి విడుదలకు అవసరమైన తదుపరి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. సరిహద్దు ప్రాంత ప్రజల సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే స్వయంగా స్పందించడంపై నియోజకవర్గ రైతులు, ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ్రాఈ

# గంజాయి ముఠాపై బద్వేల్ పోలీసుల ఉక్కుపాదం

**5 మంది అరెస్టు – 2.1 కిలోల గంజాయి స్వాధీనం**



**బద్వేల్ స్టాఫ్ రిపోర్టర్ ఆగస్టు 18 (ప్రజా జ్యోతి)** బద్వేల్ ను అడ్డాగా చేసుకొని గంజాయి విక్రయిస్తున్న ముఠాపై బద్వేల్ పోలీసులు ఉక్కు పాదం మోపారు. కడప జిల్లా ఎస్పీ గారి ఆదేశాల మేరకు, మైదుకూరు సబ్ డివిజనల్ పోలీసు అధికారి గారి పర్యవేక్షణలో బద్వేల్ అర్బన్ పోలీసులు మంగళవారం నాడు బద్వేల్ పట్టణం లోని పోరుమామిళ్ల బైపాస్ రోడ్డు పై ఓవర్ బ్రిడ్జి క్రింద తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో 2.1 కిలోల గంజాయి, రూ.6,000 నగదు మరియు ఒక ఎలక్ట్రానిక్ తూనిక యంత్రాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో 1 దొడ్డేటిపల్లి రమణయ్య – వయసు 68 సంవత్సరాలు, తండ్రి పేరు నరసయ్య, నివాసం లక్ష్మక్కపల్లె, పెదచెర్లోపల్లె మండలం, ప్రకాశం జిల్లా 2 షేక్ చిన్న మీరావలి – వయసు 45 సంవత్సరాలు, తండ్రి పేరు నాగూర్, నివాసం బ్రాహ్మణపల్లె, మర్రిపాడు మండలం, నెల్లూరు జిల్లా 3 వలేరి మల్లిఖార్జున వయసు 40 సంవత్సరాలు, తండ్రి పేరు మాలకొండయ్య, నివాసం మాలెపాడు, పొన్నలూరు మండలం, ప్రకాశం జిల్లా 4 వల్లెపు వెంకటసుబ్బయ్య వయసు 19 సంవత్సరాలు, తండ్రి పేరు లేట్ రామయ్య, నివాసం మార్తోమ నగర్, బద్వేల్ టౌన్ 5 నాగులూరి రాజమ్మ వయసు 40 సంవత్సరాలు, భర్త పేరు శామ్యూల్, నివాసం పెద్ద ఇర్లపాడు, పెదచెర్లోపల్లె మండలం, ప్రకాశం జిల్లాకు చెందిన 5 మంది ముద్దాయిలను అరెస్టు చేశారు. ప్రధాన నిందితుడు రమణయ్య తక్కువ ధరకు గంజాయిని కొనుగోలు చేసి, కేజీని రూ.6,000 చొప్పున ఇతర నిందితులకు విక్రయిస్తుండేవాడు. బద్వేల్ ప్రాంతాన్ని అడ్డాగా చేసుకొని ఒక్కొక్కరికి 250 గ్రాముల చొప్పున ఎలక్ట్రానిక్ తూనిక యంత్రం ద్వారా తూకం వేసి విక్రయిస్తుండగా పోలీసులకు పట్టుబడ్డారు. వీరిలో ఇద్దరిపై గతంలో కూడా కేసులు ఉన్నాయి. ఈ మేరకు బద్వేల్ పట్టణ పోలీసు స్టేషన్ లో కేసు నమోదు చేసి, నిందితులను కోర్టులో హాజరుపరచి రిమాండ్ కు తరలించారు.

**పోలీసులను అభినందించిన ఉన్నతాధికారులు**

నిందితులను పట్టుకుని గంజాయి స్వాధీనం చేసుకున్న బద్వేల్ పోలీసు స్టేషన్ ఇన్స్పెక్టర్ బి. రామకృష్ణ, సబ్ ఇన్స్పెక్టర్లు జయరాములు, రంగారావు మరియు సిబ్బందిని కడప జిల్లా ఎస్పీ గారు మరియు మైదుకూరు ఎస్.డి.పి.ఓ గారు ప్రత్యేకంగా ప్రశంసించి అభినందించారు. గంజాయి లేదా ఇతర మత్తు పదార్థాల విక్రయాలు, అక్రమ రవాణాకు ఎవరైనా పాల్పడితే వారిపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు పి.డి యాక్ట్ కూడా నమోదు చేయడం జరుగుతుందని పోలీసులు హెచ్చరించారు.

# ఎం.ఆర్.పి.ఎస్,నిర్మాణం కోసం!..
# ఎం.ఆర్.పి.ఎస్,నూతన కమిటీల కొరకు!..

### ఎటపాక,వి.ఆర్.పురం,కూనవరం,చింతూరు,మండలాల సమీక్ష సమావేశం!..

### జాతీయపొలిట్ బ్యూరో సభ్యులు ముమ్మడివరపు చిన్న సుబ్బారావు!..





**వి.ఆర్.పురం,ఆగస్టు18(ప్రజాజ్యోతి ప్రతినిధి)** ఎం.ఆర్.పి.ఎస్, ఎం.ఎస్.పి,ఉమ్మడి అల్లూరి సీతారామరాజు జిల్లా ఇంచార్జ్ మొర్త బుజ్జి బాబు మాదిగ, సారథ్యంలో, ఎం.ఆర్.పి.ఎస్, వి.ఆర్.పురం,మండల అధ్యక్షుడు తుంగ కుమార్,అధ్యక్షతన మంగళవారం సమావేశం నిర్వహించారు.ఈసమావేశనికి ముఖ్యఅతిథిగా,ఎం.ఆర్.పి.ఎస్,ఎం.పి.ఎస్,జాతీయ పొలిట్ బ్యూరో,సభ్యులుముమ్మడివరపు చిన్నసుబ్బారావుమాదిగ,హాజరై మాట్లాడుతూ రాష్ట్రకమిటీ ఇచ్చినపిలుపుమేరకు సీనియర్ ఎం.ఆర్.పి.ఎస్,నాయకత్వంలో కొనసాగుతున్న,గతరెండు సంవత్సరాలుగా నూతనకమిటీ ఏర్పాటుచేయకుండా నూతన నాయకత్వన్ని తయారు చేయకుండా,రాష్ట్ర కమిటీ పిలుపును పట్టించుకోకుండా, నిర్లక్ష్యంగా ఉన్న సీనియర్ నాయకులను రాష్ట్రవ్యాప్తంగా ఏవిధంగా అయితే నిర్ణయాలు తీసుకున్నామో అదేవిధంగా ఈనాలుగు మండలాలలో ఉన్న ఎంఆర్పీస్ సీనియర్ నాయకుల కమిటీ రద్దుచేయడం జరిగిందని వివరించారు.వారికీ మరలా ఉద్యమంలో పనిచేసే ఉద్దేశ్యం ఉన్న వారిని ఎం.పి.ఎస్, (మాదిగ సోషలిస్ట్ పార్టీ )ఎం.జె.ఎఫ్,(మాదిగ జనర్నలిస్ట్ ఫోరం)నందు బాధ్యతలు తీసుకొనే వారిని స్వీకరిస్తామని సూచించారు.మంగళవారం ఆగస్టు18 నుండి గడ్డం వెంటకేశ్వర్లు మాదిగ,గడ్డం బాబురావు మాదిగ, ఎం.ఆర్.పి.ఎస్, నాయకత్వంనుండి తొలగించడం జరిగిందని చెప్పారు.అదేవిధంగా ఎటపాక మండలం నందిగామ, గ్రామంనుండి కొత్తపల్లి నితిన్,ని నియమించడం జరిగిందని, వివరించారు.అలాగే ఎంఆర్పీఎస్ అధికార ప్రతినిధిగా మోదుగు ముత్యాలు,కూనవరం మండలం పోచవరం గ్రామం నుండి ఎం.ఎం.ఎస్(మాదిగ మహిళాసమైక్య )చంద్రుగొండ వరలక్ష్మిని,నియమించడం జరిగిందని తెలిపారు.ఈ సమావేశంలో ఉమ్మడిఅల్లూరి సీతారామరాజు జిల్లా మాజీ కన్వీనర్ బింగి విష్ణుమూర్తిమాదిగ,మాజి జిల్లా ప్రధాన కార్యదర్శి మోదుగు వెంకన్న బాబు,ఎంఎస్పీ మండల అధ్యక్షుడు గడ్డంకృ పారావుమాదిగ,మహిళ జిల్లా అధ్యక్షురాలు ములకలపల్లి సరోజిని, జిల్లా మహిళా కార్యదర్శి సందీపాము ఉషారాణి, ముయ్యేటి నాగమణి,తదితరులు హాజరయ్యారు.

# కొత్తపల్లి వద్దు!..





**తాడ్వాయి"లేదా" కొయ్యలగూడెం!..**

**వడ్డిగూడెం గ్రామస్తులు!..**

**వి.ఆర్.పురం,ఆగస్టు18(ప్రజాజ్యోతి ప్రతినిధి)**పునరావాసంలో స్థల నిర్ణయంకోసం కొత్తపల్లి వెళ్లడం తమజీవితాలను అతోగతి పాలు చేసుకోవడమేనని,మాబంధు వర్గాలు, చుటుపక్కలగ్రామ ప్రజలుమాకు తెలిసిన మాకుటుంబాలతో పరిచయాలు అనుబంధాలు, బంధాలతోఉన్న నిర్వాసితులందరూ తాడువాయి,కొయ్యలగూడెం, పరిసరప్రాంతాల్లో ఇళ్ల కేటాయింపులుచేయగా మమ్మల్ని కొత్తపల్లి పంపించి మమ్మల్ని ఒంటరి వారిని చేయవద్దని,కొత్తపల్లి వెళ్లడం తమకు ఇష్టంలేదని పోలవరం ప్రాజెక్టునీటిలో జలసమాధి అవుతాము గాని కొత్తపల్లి మాత్రంవెళ్లమని ఒడ్డుగూడెం గ్రామస్తులు ముక్తకంఠంతో స్థానిక శివాలయంలో ఏర్పాటుచేసిన గ్రామస్తుల సమావేశంలో సంబంధిత అధికారులకు తెలియజేశారు.సర్వం కోల్పోతున్న తమనుఇంకా ఒంటరివారిని చేయవద్దని తమకు వరరామచంద్రాపురం, గ్రామంతో పాటు తడువాయి,గాని కొయ్యలగూడెం,గాని ఇల్లని నిర్మాణంచేసి ఇవ్వాలని వారు సంబంధిత అధికారులకు వేడుకున్నారు.గతంలో కొందరు తెలిసితెలియక చేసిన పొరపాటుకు మొత్తంగ్రామాన్ని బలిపెట్టవద్దని,మాయందు దయఉంచి,మమ్మల్ని మేము కోరుకున్నచోట పునరావాసం కల్పించాలని లేనిపక్షంలో తాము ఇక్కడే జల సమాధి అవుతామని వారు అధికారులకు తెలియజేశారు ఆర్ "అండ్" ఆర్ ఇళ్ల పరిహారం,పూర్తిస్థాయిలో గ్రామస్తులుఅందరికీ అందిన తర్వాతే మమ్మల్ని ఇక్కడినుంచి తరలించాలని అక్కడికి వెళ్ళిన తర్వాత ఇస్తాం మీరువెళ్లిపోండని,ఇబ్బంది పెట్టొద్దని కోరారు.మిగిలిన వారిని అన్యాయంచేయవద్దని ఇంకాఒడ్డుగూడెంగ్రామంలో 15 ఇళ్ళకి పరిహారం రాలేదని,రానివారు సుమారు 60 నుంచి 70 మంది వరకు ఉన్నారని, వీరందరికీ న్యాయం జరిగిన తర్వాతే గ్రామాన్ని ఖాళీ చేస్తామని వారు ఉన్నతాధికారులకు తెలియజేశారు.ఈకార్యక్రమంలో మాజీ జెడ్పి.టి.సి ముత్యాల రామారావు,మాజీ సొసైటీ చైర్మన్ ముత్యాల చంద్రశేఖర్, తదితరులు గ్రామంలో స్త్రీలు పురుషులు పిల్లలు అందరూ అధికారులకు చేతులెత్తి వేడుకున్నారు.

## పాత నేరస్థులపై ప్రత్యేక నిఘా



**బాపట్ల ఆగస్టు 18 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి)** జిల్లాలో నేరాల నియంత్రణకు బేసిక్ పోలీసింగ్‌ను మరింత పటిష్టంగా అమలు చేయాలని జిల్లా ఎస్పీ బి.ఉమామహేశ్వర్ పోలీసు అధికారులను ఆదేశించారు. పాత నేరస్థులు, రౌడీషీటర్లు, చెడు నడత కలిగిన వ్యక్తుల కదలికలు, ప్రవర్తనపై నిరంతరం నిఘా ఉంచాలని సూచించారు.జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయం నుంచి మంగళవారం పోలీసు అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన ఎస్పీ, ఆయా పోలీస్ స్టేషన్ల పరిధిలోని పాత నేరస్థులు, రౌడీషీటర్లు, గంజాయి కేసుల నిందితుల ప్రస్తుత పరిస్థితిపై సమీక్షించారు. నేరాలకు పాల్పడే అవకాశం ఉన్న వ్యక్తులను ముందుగానే గుర్తించి ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ ఎదుట బైండోవర్ చేయాలని తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించి శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని, పదేపదే నేరాలకు పాల్పడే వారిపై పీడీ యాక్ట్ ప్రయోగించాలని స్పష్టం చేశారు.ఫుట్ పెట్రోలింగ్, విజిబుల్ పోలీసింగ్, గ్రామ సందర్శనలు, పల్లె నిద్ర వంటి కార్యక్రమాలతో క్షేత్రస్థాయిలో సమాచారాన్ని సేకరించి నేరాలను అరికట్టాలని ఎస్పీ సూచించారు. సున్నిత ప్రాంతాలు, హాట్‌స్పాట్‌లలో పెట్రోలింగ్ పెంచడంతో పాటు జైలు నుంచి విడుదలైన నిందితుల కదలికలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే వలస కార్మికుల ద్వారా గంజాయి సరఫరా జరిగే అవకాశాలను గుర్తించి అప్రమత్తంగా వ్యవహరించాలని ఆదేశించారు.గంజాయి రవాణా, విక్రయాలు, మహిళలపై నేరాల విషయంలో జీరో టాలరెన్స్ విధానాన్ని అమలు చేయాలని తెలిపారు. విధుల్లో నిర్లక్ష్యం వహించే సిబ్బందిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. పాత నేరస్థులు తిరిగి నేరాలకు పాల్పడితే సంబంధిత పోలీసు అధికారుల బాధ్యతను కూడా పరిశీలిస్తామని స్పష్టం చేశారు.సమావేశంలో అడిషనల్ ఎస్పీ ఎల్.సుధాకర్, చీరాల, రేపల్లె డీఎస్పీలు ఎం.డి.మొయిన్, షేక్ అబ్దుల్ అజీజ్, జిల్లాలోని సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

## శానిటేషన్ సెక్రటరీలతో సమీక్ష సమావేశం నిర్వహించిన మున్సిపల్ కమిషనర్ కృష్ణ




**బద్వేల్ స్టాఫ్ రిపోర్టర్ ఆగస్టు 18 (ప్రజాజ్యోతి)** బద్వేల్ పురపాలక సంఘం పరిధిలో పారిశుధ్య పనులపై శానిటేషన్ సెక్రటరీలతో మున్సిపల్ కమిషనర్ యం. కృష్ణ గారి ఆధ్వర్యంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డుల్లో పారిశుధ్య నిర్వహణ, డోర్ టు డోర్ చెత్త సేకరణ, డ్రైనేజీల పరిశుభ్రత, ఐ.వి.ఆర్.ఎస్ కాల్స్‌లో ప్రజల సంతృప్తి రేటు పెంపు తదితర అంశాలపై సమీక్షించారు. ఐ వి ఆర్ ఎస్ ఫీడ్‌బ్యాక్ మెరుగుపడేలా పారిశుధ్య సేవలను మరింత సమర్థవంతంగా నిర్వహించాలని శానిటేషన్ సెక్రటరీలకు సూచించారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ మేనేజర్ బి. హరనాథ్, ఇంచార్జ్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ జి. రమణయ్య, ఎఫ్ 1 క్లర్క్ యం. హుస్సేనయ్య మరియు శానిటేషన్ సెక్రటరీలు పాల్గొన్నారు.

## సీఎం చంద్రబాబుని మర్యాదపూర్వకంగా కలిసిన ఎమ్మెల్యే సత్యప్రభ

--నియోజకవర్గ అభివృద్ధి పనులు,సార్లంక అగ్నిప్రమాద బాధితులకు సాయం కోరిన ఎమ్మెల్యే



**కాకినాడ జిల్లా ఆగస్టు 18 (ప్రజా జ్యోతి స్టాఫ్ రిపోర్టర్)** ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా మంగళవారం అమరావతిలోని అసెంబ్లీ ప్రాంగణంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిని మర్యాదపూర్వకంగా కలిసి నియోజకవర్గానికి సంబంధించిన పలు కీలక అంశాలపై వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా ప్రత్తిపాడు నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న పలు అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఎమ్మెల్యే కోరారు.నియోజకవర్గంలో చేపట్టాల్సిన వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు అవసరమైన చర్యలను వేగవంతం చేసి,ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించేలా చూడాలని ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు.అదేవిధంగా ఇటీవల అగ్ని ప్రమాదానికి గురైన రౌతులపూడి మండలం సార్లంక గ్రామ ప్రజలను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని కోరారు.అగ్ని ప్రమాదంలో నష్టపోయిన బాధిత కుటుంబాలకు ప్రభుత్వం తరఫున అందించాల్సిన ఆర్థిక,ఇతర సహాయాన్ని తక్షణమే అందజేయడంతో పాటు,బాధితుల గృహ నిర్మాణ పనులను కూడా త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రిని కోరుతూ వినతిపత్రం అందజేశారు.ఎమ్మెల్యే సత్యప్రభ సమర్పించిన వినతిపత్రంలోని అంశాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సానుకూలంగా స్పందించి,సంబంధిత అధికారులకు విషయాలను తెలియజేసి తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆదేశించినట్లు ఎమ్మెల్యే కార్యాలయం పేర్కొంది.

## వెబ్‌ల్యాండ్‌లో ప్రభుత్వ భూమి అనధికార నమోదు
## 547 సర్వే నంబర్‌పైనా అవినీతి ఆరోపణలు..
## విచారణకు ఆదేశాలు



**గుంతకల్లు,ఆగస్టు 18 (ప్రజా జ్యోతి):** అనంతపురం జిల్లా గుంతకల్లు మండలంలోని 547 సర్వే నంబర్‌కు సంబంధించిన భూమిని వెబ్‌ల్యాండ్‌లో అనధికారికంగా నమోదు చేసిన వ్యవహారం జిల్లా అధికారుల దృష్టికి వెళ్లడంతో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఈ వ్యవహారంపై మంగళవారం జిల్లా స్పెషల్ ఆఫీసర్, డిప్యూటీ కలెక్టర్ ఆనందరావు ఆధ్వర్యంలో సుదీర్ఘంగా విచారణ నిర్వహించారు. బాధితుల ఫిర్యాదు మేరకు జిల్లా కలెక్టర్ ఈ వ్యవహారంపై దృష్టి సారించి విచారణకు ఆదేశించినట్లు సమాచారం. గత నెలలో 547 సర్వే నంబర్‌కు సంబంధించి సుమారు 11 ఎకరాల భూమిని వెబ్‌ల్యాండ్‌లో నమోదు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. సంబంధిత వీఆర్వో, ఆర్ఐలకు సమాచారం లేకుండానే తహసీల్దార్ కార్యాలయం నుంచి ఈ నమోదు ప్రక్రియ జరిగినట్లు బాధితులు ఆరోపిస్తున్నా రు. వెబ్‌ల్యాండ్‌లో నమోదైన 11 ఎకరాలను అనంతరం తొలగించినప్ప టికీ, ఈ వ్యవహారంలో బాధ్యతను వీఆర్వో ధనుంజయపై మళ్లించే ప్రయత్నం జరిగిందని ఆరోపణలు వినిపిస్తున్నాయి. తనకు ఈ వ్యవహారంతో ఎలాంటి సంబంధం లేదని, తనకు తెలియకుండానే నమోదు జరిగిందని వీఆర్వో అధికారుల వద్ద విన్నవించినట్లు సమాచారం. ఇదిలా ఉండగా, 547 సర్వే నంబర్‌కు సంబంధించి బాధితులు గుత్తి కోర్టును ఆశ్రయించి ఇంజక్షన్ ఆర్డర్లు పొందినట్లు, సంబంధిత కార్యాలయాలకు నోటీసులు జారీ చేసినట్లు సమాచారం. స్థల పరిశీలన.. రికార్డుల తనిఖీ ఈ నేపథ్యంలో మంగళవారం ఉదయం సుమారు 11 గంటలకు డిప్యూటీ కలెక్టర్ ఆనందరావు తన సిబ్బందితో కలిసి గుంతకల్లు గ్రామ పరిధిలోని 547 సర్వే నంబర్ భూమిని పరిశీలించారు. అనంతరం మధ్యాహ్నం 3 గంటల సమయంలో గుంతకల్లు తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుని సంబంధిత రికార్డులను తనిఖీ చేశారు. సుమారు రాత్రి 8.30 గంటల వరకు కొనసాగిన విచారణలో గుంతకల్లు ఆర్డీఓ శ్రీనివాసులు, తహసీల్దార్ రమాదేవి, వెబ్‌ల్యాండ్ ఆపరేటర్ హేమల నాయక్, ఆర్ఐ హరి ప్రసాద్, వీఆర్వోలు తదితరులను అధికారులు విచారించినట్లు సమాచారం. తహసీల్దార్ కార్యాలయం నుంచే నమోదు విచారణ అనంతరం డిప్యూటీ కలెక్టర్ ఆనందరావు మాట్లాడుతూ 547 సర్వే నంబర్‌కు సంబంధించిన భూమిని వెబ్‌ల్యాండ్‌లో నమోదు చేసిన వ్యవహారంపై విచారణ చేపట్టినట్లు తెలిపారు. అదే ప్రాంతంలోని తహసీల్దార్ కార్యాలయం నుంచే వెబ్‌ల్యాండ్‌లో నమోదు జరిగినట్లు ప్రాథమికంగా నిర్ధారణ అయినట్లు పేర్కొన్నారు. విచారణ సమయంలో సంబంధిత అధికారుల నుంచి పూర్తి సహకారం లభించలేదని డిప్యూటీ కలెక్టర్ పేర్కొన్నారు. ఈ వ్యవహారం పై అధికారులు సమాధానం చెప్పాల్సిన బాధ్యత ఉందని, తప్పు చేసినట్లు తేలితే చట్ట ప్రకారం కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

# బాపురం ఎల్ ఎల్ సి కాలువ వద్ద రైతు గర్జన

**155 కి.మీ వద్ద అడ్డుకట్టూ సంచులు..**

**బాపురం 158 కి.మీ వద్ద గేట్ల మూసివేత!**

**కర్ణాటక దౌర్జన్యంతో ఏపీకి నీరు బంద్..**

**నిద్రమత్తులో కూటమి ప్రభుత్వం**



**హాలహర్వి ఆగస్టు 18, ప్రజాజ్యోతి:-** తుంగభద్ర దిగువ స్థాయి కాలువ (ఎల్ఎల్సీ) పరిధిలో కర్ణాటక రైతులు సరిహద్దుల్లో చేస్తున్న అక్రమాలకు అడ్డుఅదుపు లేకుండా పోయింది. విడుదలైన కొద్దిపాటి నీటిని కూడా ఆంధ్ర భూభాగంలోకి రానివ్వకుండా కర్ణాటక సరిహద్దు పరిధిలోని 155వ కిలోమీటర్ వద్ద కాలువకు అడ్డంగా ఇసుక, మట్టి సంచులు వేసి పూర్తిగా నిలిపివేశారని, అటు బాపురం 158వ కిలోమీటర్ వద్ద గేట్లను దించేశారని వైఎస్సార్సీపీ రాష్ట్ర కార్యదర్శి, గ్రేటర్ రాయలసీమ ఇరిగేషన్ ప్రాజెక్టుల టాస్క్‌ఫోర్స్ జిల్లా కో-ఆర్డినేటర్ తెర్నేకల్ సురేందర్ రెడ్డి, పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి జూటూరు మారయ్య తీవ్రస్థాయిలో మండిపడ్డారు. తక్షణమే ఈ అడ్డుకట్టలు తొలగించి, నవంబర్ వరకు నిరంతరాయంగా సాగునీటిని విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం మండలంలోని బాపురం 158 కి.మీ ఎల్ఎల్సీ గేట్ల వద్ద రైతులు, పార్టీ శ్రేణులతో కలిసి భారీ నిరసన, ఆందోళన చేపట్టారు.రైతులతో కలిసి బాపురం వద్ద ఆయన ఆందోళన చేపట్టారు. ఎల్ఎల్సీ కాలువకు నీటిని విడుదల చేయకపోవడంతో పంటలు ఎండిపోతున్నాయని, రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.కూటమి ప్రభుత్వం రైతుల పంటలను కాపాడటంలో ఘోరంగా విఫలమైందని సురేందర్ రెడ్డి విమర్శించారు. తక్షణమే ఎల్ఎల్సీకి నీటిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు.రైతుల సమస్యను ప్రభుత్వం వెంటనే పరిష్కరించకపోతే సరిహద్దు ప్రాంతంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు. రైతుల ప్రయోజనాల కోసం ఎంతటి పోరాటానికైనా సిద్ధంగా ఉంటామని స్పష్టం చేశారు.

**93 టీఎంసీలున్నా ఏపీ వాటా ఏదీ**

ఈ సందర్భంగా తెర్నేకల్ సురేందర్ రెడ్డి మాట్లాడుతూ.. తుంగభద్ర జలాశయంలో ప్రస్తుతం దాదాపు 93 టీఎంసీల నీరు నిండుకుండలా ఉన్నప్పటికీ, సీఎం చంద్రబాబు నాయుడు, జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు కర్నూలు జిల్లా రైతుల వాటాను సాధించడంలో ఘోరంగా విఫలమయ్యారని ధ్వజమెత్తారు. గతంలో డ్యామ్‌లో 80 టీఎంసీలు ఉన్నప్పుడే పంటలకు సమృద్ధిగా నీరిచ్చారని, ఇప్పుడు 93 టీఎంసీలున్నా ఎందుకు తీసుకురాలేకపోతున్నారని ప్రశ్నించారు. ఏపీకి కేటాయించిన 11.1 టీఎంసీల వాటాలో ఇప్పటివరకు కేవలం 1.05 టీఎంసీలు మాత్రమే ఇచ్చారని, మిగిలిన 9.5 టీఎంసీల నీటిని వెంటనే విడుదల చేయించాలని డిమాండ్ చేశారు. ఎండిపోతున్న పంటలు అన్నదాతకు అన్యాయం జరిగితే ఊరుకోం హాలహర్వి,హొళగుంద మండలాల పరిధిలో ఎల్ఎల్సీపై ఆధారపడి రైతులు లక్షలాది రూపాయలు అప్పులు తెచ్చి పత్తి, మిరప పంటలు వేశారన్నారు. వర్షాలు లేక, కాలువ నీరు రాక మరో 3, 4 రోజుల్లో పైర్లన్నీ పూర్తిగా ఎండిపోయే పరిస్థితి దాపురించిందని ఆవేదన వ్యక్తం చేశారు. అన్నం పెట్టే రైతుకు అన్యాయం జరిగితే చూస్తూ ఊరుకునే ప్రసక్తే లేదని, ఖరీఫ్ పంటలు చేతికొచ్చే వరకు అంటే నవంబర్ నెలాఖరు వరకు సాగునీరు అందించాలని స్పష్టం చేశారు. వచ్చే 3, 4 రోజుల్లో సరిహద్దు అడ్డుకట్టలను తొలగించి నీటిని విడుదల చేయకపోతే వేలాది మంది రైతులతో కలిసి మండల, నియోజకవర్గ స్థాయిలో ముట్టడి ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. ఈ ఆందోళన కార్యక్రమంలో రాష్ట్ర సంయుక్త కార్యదర్శి జూటూరు మారయ్య, వైఎస్సార్సీపీ మండల కన్వీనర్ రామరెడ్డి, సీనియర్ నాయకులు రాఘవేంద్ర రెడ్డి, మండల యూత్ లీడర్ గంగాధర, నాయకులు శంకర్ రెడ్డి,వీరేశప్ప, బజారప్ప, మాజీ ఎంపీటీసీ తిమ్మప్ప, పచ్చారపల్లి ప్రకాష్ , నాగేష్ ,నాగరాజు, బసవరాజు, సరిహద్దు గ్రామాల రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు..

# కురాకులపల్లిలో వైభవంగా శ్రీకృష్ణ విగ్రహ ప్రతిష్ట మహోత్సవం





**రెండో రోజు భక్తులకు జీకే కృష్ణమూర్తి ఆధ్వర్యంలో ఘనంగా అన్నదానం**

**కంబదూరు ఆగస్టు 18: (ప్రజా జ్యోతి) న్యూస్ రిపోర్టర్ ఖాన్,** కంబదూరు మండలం కూరాకులపల్లి గ్రామంలో శ్రీకృష్ణ విగ్రహ ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో, వైభవంగా కొనసాగుతున్నాయి. మూడు రోజుల పాటు నిర్వహిస్తున్న ఈ మహోత్సవాలకు కురాకులపల్లి గ్రామంతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివస్తున్నారు. ఆలయ ప్రాంగణం శ్రీకృష్ణ నామస్మరణతో, భక్తుల సందడితో ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకుంది. మహోత్సవాల్లో భాగంగా రెండో రోజు బడుగు, బలహీన వర్గాల నేత జీకే కృష్ణమూర్తి ఆధ్వర్యంలో భక్తులకు ఘనంగా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయానికి విచ్చేసిన భక్తులందరికీ ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్నదాన ఏర్పాట్లు చేశారు. భక్తులకు క్రమపద్ధతిలో భోజనం వడ్డిస్తూ, ప్రతి ఒక్కరికీ సౌకర్యవంతంగా ఉండేలా నిర్వాహకులు ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు.అన్నదాన కార్యక్రమంలో చిన్నారులు, మహిళలు, వృద్ధులు, యువతతో పాటు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని భోజన ప్రసాదాన్ని స్వీకరించారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని భోజనం, తాగునీరు తదితర సౌకర్యాలను అందుబాటులో ఉంచారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా నిర్వాహకులు ఎప్పటికప్పుడు ఏర్పాట్లను పర్యవేక్షించారు. శ్రీకృష్ణ విగ్రహ ప్రతిష్ట మహోత్సవం సందర్భంగా భక్తులకు అన్నదానం చేయడం ద్వారా సేవా కార్యక్రమానికి ప్రాధాన్యతనిచ్చిన జీకే కృష్ణమూర్తిని పలువురు అభినందించారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పాటు భక్తులకు సేవ చేయడం ద్వారా సమాజంలో ఐక్యత, సోదరభావం పెంపొందుతుందని నిర్వాహకులు పేర్కొన్నారు.మహోత్సవాల సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, భజనలు తదితర ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ప్రతిరోజూ పెద్ద సంఖ్యలో భక్తులు హాజరవుతుండటంతో ఆలయ పరిసరాలు పండుగ వాతావరణాన్ని తలపిస్తున్నాయి. మహోత్సవాలు విజయవంతంగా కొనసాగేందుకు గ్రామస్థులు, యువత, నిర్వాహకులు సమన్వయంతో పనిచేస్తున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసి, శ్రీకృష్ణ స్వామివారి ఆశీస్సులు అందరికీ లభించాలని నిర్వాహకులు ఆకాంక్షించారు.

# సర్వాయి పోరాటం స్ఫూర్తిదాయకం: కలెక్టర్ చిత్రా మిశ్రా




**కరీంనగర్ :** సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ పోరాటం స్ఫూర్తిదాయకమని ఆయన ఆశయాలను అందరం కొనసాగి ద్దామని కలెక్టర్ చిత్రా మిశ్రా పిలుపునిచ్చారు. మంగళవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో సర్వాయి పాపన్న 376 వ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, అధికారులు, బీసీ, గౌడ సంక్షేమ సంఘం నాయకులు సర్వా యి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. కల్లు గీత కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం అండగా నిలుస్తుందన్నారు. కార్మికు లకు ఎక్స్ గ్రేషియా, కాటమయ్య రక్షణ కిట్లు అందిస్తున్నట్లు వివరించారు. సంఘం నాయకులతో మాట్లాడుతూ. ఎలాంటి సమస్యలున్నా తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని కలెక్టర్ పేర్కొన్నారు.ఐక్యం గా పని చేస్తూ నియోజక వర్గాల వారీగా నెలకొన్న సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.చదువు, ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలన్నారు. తమ సంఘంలో బాలికల చదువుకు పెద్దపీట వేసి వారు ఉన్నత స్థానాల్లో నిలిచేలా కృషి చేయాలన్నారు.ఎక్సైజ్ శాఖ సమన్వయంతో జిల్లాలోని 3412 మంది కల్లుగీత కార్మికులకు అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా కరీంనగర్ 463, మానకొండూర్ 933, చొప్పదండి 975, హుజురాబాద్ 1041 కాటమయ్య సేఫ్టీ కిట్లు అందించినట్లు పేర్కొన్నారు. నగరపాలిక కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ మాట్లాడుతూ. జనగాం జిల్లాలో ఆయన నిర్మించిన కోట ఇప్పటికీ బ్రహ్మాండంగా ఉందన్నారు. ఆ మహనీయుడు ఆశయాలను, జీవన విధానం, దూరదృష్టి నేటి తరానికి తెలియజేయాలని పేర్కొన్నారు. అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ పాపన్నలాంటి వీరులు అన్ని వర్గాలకు స్ఫూర్తిగా, ఆదర్శంగా నిలుస్తారని పేర్కొన్నారుఈ కార్యక్రమంలో డీఆర్ఓ స్వామి, బీసీ సంక్షేమ శాఖ అధికారి అనిల్ ప్రకాష్, వివిధ శాఖల అధికారులు, తెలంగాణ గౌడ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్, రాష్ట్ర గౌడ సంఘం నాయకులు పడాల స్వామి, గౌడ్ పులి ఆంజనేయులు గౌడ్ , పడాల అజయ్ గౌడ్, దూలం అంజన్న గౌడ్, తాళ్లపల్లి ఎల్లగౌడ్, మాచర్ల ఆంజనేయులు గౌడ్ , బుర్ర ముత్తయ్య గౌడ్, సాగర్ గౌడ్ నరసయ్య గౌడ్, రాజు గౌడ్, రమేష్ గౌడ్,మహిళా నాయకులు సుజాత గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీకృష్ణాష్టమి వేడుకలకు ఆహ్వానం



**బేతంచెర్ల:ఆగస్టు18(ప్రజా జ్యోతి)** త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక బేతంచెర్ల కమిటీ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 4 నుంచి 6వ తేదీ వరకు మూడు రోజులపాటు శ్రీకృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ఉత్సవాల నిర్వహణకు సంబంధించి కమిటీ సభ్యులు ఎస్సై రమేష్‌బాబు, కమిషనర్ హరిప్రసాద్‌ను కలిసి ఆహ్వాన పత్రికలను అందజేశారు. అనంతరం శ్రీకృష్ణాష్టమి వేడుకలకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు.మూడు రోజులపాటు నిర్వహించనున్న ఉత్సవాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేయాలని కమిటీ సభ్యులు కోరారు. ఈ కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు మద్దిలేటి, సభ్యులు మాల కొండారెడ్డి, రామాంజ నేయులు, మధు చక్రవర్తి, ఈడిగ వెంకటేశ్వర్లు, సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మెగా వైద్య శిబిరాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే మురళి నాయక్

**మహబూబాబాద్:** ప్రభుత్వ బాలికల పాఠశాలలో విద్యార్థినుల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. వెన్నెల తల్లి పిల్లల ఆసుపత్రి డా. జ్యోత్స్న రెడ్డి గారి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వైద్య శిబిరానికి మహబూబాబాద్ ఎమ్మెల్యే డా. భూక్యా మురళి నాయక్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మురళి నాయక్ మాట్లాడుతూ విద్యార్థినులు ఆరోగ్యంగా ఉంటేనే విద్యలో రాణించగలరని అన్నారు. పాఠశాల స్థాయిలోనే విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడం అభినందనీయ మన్నారు. ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి విద్యార్థినులకు వైద్య పరీక్షలు, ఆరోగ్య సూచనలు అందిస్తున్న డా. జ్యోత్స్న రెడ్డి మరియు వెన్నెల తల్లి పిల్లల ఆసుపత్రి యాజమాన్యాన్ని ఎమ్మెల్యే అభినందించారు.విద్యార్థినులు తమ ఆరోగ్య సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా అవసరమైనప్పుడు వైద్యులను సంప్రదించాలని సూచించారు. ఆరోగ్యంపై అవగాహన పెంపొందించేందుకు ఇలాంటి వైద్య శిబిరాలు మరిన్ని నిర్వహిం చాల్సిన అవసరం ఉందన్నారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే గారి వెంట మహబూబాబాద్ మున్సిపల్ చైర్మన్ గూగులోత్ జ్యోతి రమేష్,స్థానిక వార్డు కౌన్సిలర్ బోడ రవి, కౌన్సిలర్ లు బోళ్ల రాజు, చిధిరల అరుణ జ్ఞానేశ్వర్ ,పాఠశాల ఉపాధ్యాయులు, జిల్లా నాయకులు, పట్టణ నాయకులు కార్యకర్తలు,వైద్య సిబ్బంది, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

63 రియల్ ఎస్టేట్ బ్రోకర్‌లా మారిన రేవంత్ రెడ్డి..

## పేదల భూములపై పడి కీచకుల్లా వ్యవహరిస్తున్న సర్కార్

**'ధరణి' పోయినా ధోరణి మారలేదు..**

**'భూభారతి' కాస్త పేదల పాలిట 'భూహారతి'గా మారింది**

**హైడ్రా, పోలీసుల పహారాలో రాత్రికి రాత్రే పేదల భూములకు ఫెన్సింగ్ వేసి వేలానికి కుట్ర**

**కూకట్‌పల్లిలో రూ.20,000 కోట్ల ఎఆఒ/గల్ఫ్ ఆయిల్ భూముల బదిలీ వెనుక ఫినిక్స్ కంపెనీ దందా**

**పేదలు, రైతుల భూములను లాక్కుంటే చూస్తూ ఊరుకోం..**

**కేంద్ర దర్యాప్తు సంస్థలకు ఫిర్యాదు చేస్తాం**

తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పేదల భూములను కాపాడాల్సింది పోయి, రియల్ ఎస్టేట్ బ్రోకర్ తరహాలో వ్యవహరిస్తూ లక్షల కోట్ల రూపాయల భూదందాకు తెరతీసిందని బీజేపీ మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.ధరణి పోయినా ధోరణి మారలేదు తెలంగాణ వస్తే భూ సమస్యలన్నీ తీరి పారదర్శకమైన చట్టం వస్తుందని ప్రజలు ఆశిస్తే, గత కేసీఆర్ ప్రభుత్వం ధరణి పేరుతో పేద రైతుల హక్కులను కాలరాసిందని ఈటల విమర్శించారు. ధరణి రాకముందు పహాణీలలో ఉన్న 13 కాలమ్స్ (ముఖ్యంగా కబ్జా, కాస్తు కాలమ్స్) తొలగించడం వల్ల 50-70 ఏళ్లుగా భూములను సాగుచేసుకుంటున్న దళితులు, గిరిజనులు, బీసీ పేద రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ధరణిని బంగాళాఖాతంలో వేస్తామని చెప్పి, ఇప్పుడు 'భూభారతి' పేరుతో మరింత దారుణంగా పేద రైతాంగాన్ని అగాధంలోకి నెట్టిందని.. 'ధరణి పోయినా ధోరణి మారలేదు, భూభారతి కాస్త పేదలకు భూహారతిగా మారింది' అని ఎద్దేవా చేశారు.హైడ్రా, పోలీసుల పహారాలో రాత్రికి రాత్రే భూముల కబ్జా:కేసీఆర్ కంటే రేవంత్ రెడ్డి పది అడుగులు ముందుకేసి భూముల వేలం ద్వారా దాదాపు రూ.10 లక్షల కోట్లు సమకూర్చుకోవాలనే దుర్మార్గపు ఆలోచనతో ఉన్నారని ఈటల మండిపడ్డారు. మల్కాజ్‌గిరి పార్లమెంట్ పరిధిలోని నగర విస్తరణ ప్రాంతాల్లో వేల ఎకరాల పేదల భూములను హైడ్రా, వందల మంది పోలీసుల పహారాతో రాత్రికి రాత్రే ఫెన్సింగ్‌లు, గోడలు కట్టి డీల్స్‌కు అప్పగిస్తున్నారని ఆరోపించారు. శాంతిభద్రతలు కాపాడాల్సిన పోలీసులు గ్రామాలపై పడి కీచకుల్లా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.హైదరాబాద్ శివారు ప్రాంతాల్లో సాగుతున్న ప్రైవేట్ భూముల్లో 12 ఏళ్లు కౌలు ఉంటే 'సెక్షన్ 38ఇ' కింద హక్కులు వస్తుంటే.. బడంగ్‌పేట్‌లో ఐదు తరాలుగా (78 సంవత్సరాలుగా) 46 మంది రైతులు సాగుచేసుకుంటున్న 45 ఎకరాల 16 గుంటల భూమిని ప్రభుత్వ భూమి పేరుతో లాక్కుంటున్నారు.దుండిగల్ ఒ బోరంపేట: దుండిగల్ సర్వే నం. 452, 453లలోని 400 ఎకరాల్లో 500 మంది రైతులు, బోరంపేట సర్వే నం. 166లోని 440 ఎకరాల్లో 150 మంది రైతులు 80 ఏళ్లుగా సాగు చేసుకుంటుంటే బలవంతంగా గుంజుకుంటున్నారు. బోరంపేట సర్వే నం. 472లోని 30 ఎకరాలకు ప్రీకాస్ట్ గోడలు నిర్మించారు.బొమ్మరాజుపేట (శామీర్‌పేట్): 1965 నాటి 1,049 ఎకరాల భూమి ధరణి లోపాల వల్ల వివాదంలోకి వెళ్లగా, రేవంత్ రెడ్డి ప్రభుత్వం వచ్చాక 24 గంటల్లోనే పేర్లు మార్చి రియల్ ఎస్టేట్ మాఫియాకు అప్పగించారు. శంషీగూడా (ఎల్లమ్మబండ): సర్వే నం. 57లోని 333 ఎకరాల్లో పేదలు, జర్నలిస్టులకు ఇచ్చిన 176 ఎకరాలు కాకుండా మిగిలిన 90 ఎకరాల భూమిని (విలువ సుమారు రూ.3,000 కోట్ల నుండి రూ.4,000 కోట్లు) కోర్టు కేసులను అడ్డం పెట్టుకుని ప్రైవేట్ వ్యక్తులతో సెటిల్‌మెంట్ చేసుకుని దోచుకుంటున్నారు.కూకట్‌పల్లి (గల్ఫ్ ఆయిల్ / ఎఆఒ భూములు): గతంలో ఇండియన్ డిటనేటర్స్ లిమిటెడ్ (ఎఆఒ) పేరిట ఉన్న 330 ఎకరాల పైచిలుకు భూమిని (విలువ రూ.20,000 కోట్లు) ఫినిక్స్ కంపెనీ మధ్యవర్తిత్వంతో చేతులు మార్చారు. ఇక్కడి నుంచే 2021 హుజూరాబాద్ ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్ అక్రమ డబ్బు ఖర్చు పెట్టిందని, ప్రస్తుతం ఇక్కడ ఒక్కో విల్లాను రూ.25 కోట్ల నుండి రూ.30 కోట్లకు అమ్ముకుంటున్నారని ఆరోపించారు.బహదూర్ గూడ (ఫ్యూచర్ సిటీ): 70-80 ఏళ్లుగా గులాబీ తోటలు సాగుచేసుకుంటున్న రైతుల నుంచి 650 ఎకరాలను హైడ్రా బలగాలతో లాక్కోవాలని చూస్తే, ప్రజలు కారప్పొడి చల్లి తిరుగుబాటు చేశారని గుర్తు చేశారు.

## కె. కేశవరావు అధ్యక్షతన తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీ సమావేశం

**హైదరాబాద్ :** తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీ చైర్మన్ కె. కేశవరావు అధ్యక్షతన ఆయన నివాసంలో ఉద్యమకారుల గుర్తింపు కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రాష్ట్ర రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరామ్, మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్, మోతే శోభన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో క్రియాశీలక పాత్ర పోషించిన ఉద్యమకారులను గుర్తించే ప్రక్రియపై సమావేశంలో విస్తృతంగా చర్చించారు.

## బిజినెస్

### కోరం లేక టాటా సన్స్ ఏజీఎం వాయిదా.. వందేళ్లలో తొలిసారి




ప్రముఖ వ్యాపార సంస్థ టాటా సన్స్ ఏజీఎం (యాన్యువల్ జనరల్ మీటింగ్) వాయిదా పడింది. తగినంత కోరం లేకపోవడంతో ఏజీఎం వాయిదా పడింది. ఆగస్టు 18, మంగళవారం మధ్యాహ్నం 2.30 గంటలకు బాంబే హౌజ్‌లో ఏజీఎం జరగాల్సి ఉంది. టాటా సన్స్ సంస్థ 1917లో ఏర్పాటుకాగా, వందేళ్లలో ఇలా ఏజీఎం వాయిదా పడటం ఇదే మొదటిసారి. ఏజీఎంకు ప్రస్తుత టాటా సన్స్ ఛైర్మన్ నటరాజన్ చంద్రశేఖరన్ ప్రత్యక్షంగా హాజరయ్యారు. ఆయన త్వరలోనే ఈ బాధ్యతల నుంచి తప్పుకోనున్న సంగతి తెలిసిందే. ఆయనతోపాటు సౌరభ్ అగర్వాల్, అనితా మారంగోలి నేరుగా హాజరుకాగా.. మరికొందరు వర్చువల్‌గా హాజరయ్యారు. ఇక, కోరం లేకపోవడానికి ప్రధాన కారణం టాటా సన్స్‌లో సభ్యత్వం ఉన్న సర్ రతన్ టాటా ట్రస్ట్ (ఎస్ఆర్‌టీటీ)తోపాటు, సర్ దొరాబ్జీ టాటా ట్రస్ట్ తరఫున సభ్యులు లేకపోవడమే. ఈ రెండు ట్రస్టుల నుంచి సభ్యుల్ని ప్రతిపాదించాల్సి ఉంది. కానీ, ఇటీవల ఈ ట్రస్టులను పర్యవేక్షించే ప్రభుత్వ అథారిటీ అయిన 'ద మహారాష్ట్ర చారిటీ కమిషనర్' విధించిన రెగ్యులేటరీ నిబంధనల వల్ల సభ్యుల్ని నామినేట్ చేయలేదు. సర్ దొరాబ్జీ టాటా ట్రస్ట్ కూడా ఈ విషయాన్ని ముందే తెలిపింది. రెండు ట్రస్టుల తరఫున ఉమ్మడి సభ్యుడు బోర్డులో లేకపోవడంతో కోరమ్ సరిపోలేదు. దీంతో ఏజీఎం వాయిదాపడింది. అయితే, ఈ విషయం టాటా సన్స్ సభ్యులుగా ముందుగానే అవగాహన ఉందని సంస్థ ప్రతినిధులు తెలిపారు. టాటా సన్స్ సంస్థ ఆర్టికల్స్ ఆఫ్ అసోసియేషన్ ప్రకారం కంపెనీ కార్పొరేట్ వ్యవహారాలపై నిర్ణయం తీసుకోవాలంటే ఏజీఎంలో తగిన కోరమ్ ఉండాల్సిందే. ఇండియాస్ కంపెనీ యాక్ట్ ప్రకారం ప్రతి సంస్థ తప్పనిసరిగా ఏడాదికోసారి ఏజీఎం నిర్వహించాల్సిందే. అది కూడా ఒక ఆర్థిక సంవత్సరం ముగిసేలోపు నిర్ణీత కాల వ్యవధిలో ఏజీఎం నిర్వహించాలి. సాధారణ పరిస్తితుల్లో ఇలాంటి వాటిని రద్దు చేయరు. అత్యవర పరిస్థితుల్లో మత్రమే నిబంధలకు అనుగుణంగా ఏజీఎం రద్దు చేయాలి. ఈ రోజు జరగాల్సింది కంపెనీ 108వ ఏజీఎం. మళ్లీ ఏజీఎం ఎప్పుడు నిర్వహించాలి అనే అంశంపై బోర్డు సభ్యులతో చైర్మన్ సంప్రదించిన తర్వాత నిర్ణయిస్తారు. టాటా సన్స్ సంస్థలో సర్ రతన్ టాటా ట్రస్ట్ (ఎస్ఆర్‌టీటీ)తోపాటు, సర్ దొరాబ్జీ టాటా ట్రస్ట్ వాటాలు కలిపి 51.5 శాతం ఉన్నాయి. అంటే, సంస్థలో ఈ రెండు ట్రస్టులే అత్యధిక వాటా కలిగి ఉన్నాయి. ఈ రెండు ట్రస్టులు కలిసి ఉమ్మడిగా సభ్యుడిని నామినేట్ చేసిన తర్వాత కోరమ్ జరిగే అవకాశం ఉంది.

## భారీగా నష్టపోయిన స్టాక్ మార్కెట్..
# సెన్సెక్స్ 492 పాయింట్లు పతనం

భారత స్టాక్ మార్కెట్లు మంగళవారం భారీగా పతనమయ్యాయి. బీఎస్ఈ సెన్సెక్స్ ఏకంగా 492 పాయింట్లు పతనం కాగా, ఎన్ఎస్ఈ నిఫ్టీ 132 పాయింట్లు నష్టపోయింది. ఉదయం బీఎస్ఈ సెన్సెక్స్ 77,418.97 పాయింట్ల వద్ద ప్రారంభమైంది. రోజులో 77,575.21 పాయింట్ల గరిష్ట స్థాయికి, 77,234.36 పాయింట్ల కనిష్ట స్థాయికి చేరింది. చివరకు 492.70 పాయింట్ల (0.63 %) నష్టంతో 77,235.46 వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 50 కూడా 132.75 పాయింట్లు (0.55%) నష్టపోయి 24,154.90 వద్ద ముగిసింది. బీఎస్ఈ సెన్సెక్స్ వరుసగా గత ఐదు సెషన్లు నష్టపోగా, ఎన్ఎస్ఈ నిఫ్టీ వరుసగా ఆరు సెషన్ల నుంచి నష్టాలు పొందుతోంది. బీఎస్ఈ సెన్సెక్స్‌లో యాక్సిస్ బ్యాంక్ అత్యధికంగా 0.89% లాభపడింది. పవర్ గ్రిడ్ 0.66%, ఎంఅండ్ఎం అడ్వాన్స్డ్ 0.47%, బజాజ్ ఫైనాన్స్ 0.27%, లార్సెన్ అండ్ టర్బో 0.15%, రిలయన్స్ ఇండస్ట్రీస్ 0.88% లాభపడ్డాయి. బజాజ్ ఫిన్‌సర్వ్, ఎన్టీపీసీ షేర్లు కూడా లాభాల్లోనే ముగిశాయి. మరోవైపు ఏసియన్ పెయింట్స్ అత్యధికంగా 2.40% నష్టపోగా, హెచ్‌సీఎల్ టెక్ సంస్థ 1.93%, భారతీ ఎయిర్‌టెల్ 1.75%, ఇన్ఫోసిస్ 2.02%, టీసీఎస్ 1.47%, హిందుస్తాన్ యునీలివర్ 1.41% నష్టపోయాయి. అంతర్జాతీయంగా బ్రెంట్ క్రూడాయిల్ బ్యారెల్ ధర 91 డాలర్లుగా ఉంది. అలాగే, డబ్ల్యూటీఐ క్రూడాయిల్ బ్యారెల్ ధర 84.99 డాలర్లుగా ఉంది. బ్రెంట్ క్రూడాయిల్ ధర 9 % పెరిగింది. రూపాయి విలువ స్వల్పంగా తగ్గి ఫ్లాట్‌గా ముగిసింది. డాలర్‌తో 7 పైసలు తగ్గిన రూపాయి 95.68 వద్ద కొనసాగుతోంది. బంగారం ఔన్స్ ధర 4,394.72 డాలర్ల వద్ద కొనసాగుతోంది. ఐటీ, రియాల్టీ, బ్యాంక్ షేర్లు అమ్మకాల ఒత్తిడికి గురికావడం, పశ్చిమాసియా యుద్ధం కారణంగా నెలకొన్ని అంతర్జాతీయ పరిణామాలు, చమురు ధరల పెరుగదల వంటివి మార్కెట్ పతనానికి కారణాలుగా విశ్లేషకులు చెబుతున్నారు. అంతర్జాతీయ మార్కెట్లు మిశ్రమంగా ముగిశాయి. జపాన్ నిక్కీ 2.5 శాతం నష్టాలు పొందగా, దక్షిణ కొరియా కోస్పి లాభాల్లో ముగిసింది. యురోపియన్ మార్కెట్లు నష్టాల్లోనే కొనసాగుతున్నాయి.



# మెటాపై చైల్డ్ సోషల్ మీడియా అడిక్షన్ కేసు!

కాలిఫోర్నియా, కొలరాడో, కెంటుకీ, న్యూజెర్సీ రాష్ట్రాలు మెటా సంస్థపై ఓక్‌లాండ్‌లోని ఫెడరల్ కోర్టులో దాఖలు చేసిన కేసులో విచారణ ప్రారంభమైంది. ఈ విచారణలో రాష్ట్రాల తరఫు న్యాయవాదులు దాదాపు 200 బిలియన్ డాలర్ల పరిహారం కోరుతున్నట్లు తెలిపారు. అయితే.. మెటా దాఖలు చేసిన కోర్టు పత్రంలో రాష్ట్రాలు 1.4 ట్రిలియన్ డాలర్ల వరకు జరిమానా కోరుతున్నాయని, దీన్ని అసాధారణమైనదిగా అభివర్ణించింది. 2023లో బహుళ రాష్ట్రాల విచారణ అనంతరం నలుగురు అటార్నీ జనరల్స్ ఈ కేసును దాఖలు చేశారు. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌లలో యువ వినియోగదారులను ఎక్కువసేపు కట్టిపడేసేందుకు ఇన్ఫినిట్ స్క్రోల్, ఆటోప్లే, లైక్స్ వంటి మానసికంగా ప్రభావితం చేసే ఫీచర్లను మెటా రూపొందించిందని ఆరోపణలు ఉన్నాయి. ఈ యాప్‌లు యువతలో ఆందోళన, డిప్రెషన్, ఆత్మహత్య ఆలోచనలు పెంచుతున్నాయని తెలిసినప్పటికీ, వాటిని సురక్షితమైనవిగా చిత్రీకరించి మెటా వినియోగదారులను తప్పుదోవ పట్టించిందని రాష్ట్రాలు వాదిస్తున్నాయి. అదనంగా.. 13 ఏళ్లలోపు వినియోగదారుల డేటాను అనుమతి లేకుండా సేకరించి చిన్నారుల ఆన్‌లైన్ గోప్యతా చట్టాన్ని ఉల్లంఘించిందని కూడా ఆరోపిస్తున్నారు. మెటా సీఈఓ మార్క్ జుకర్‌బర్గ్, ఇన్‌స్టాగ్రామ్ చీఫ్ ఆడమ్ మొసేరీ ఈ విచారణలో సాక్ష్యం చెప్పనున్నారు. ఇప్పటికే లాస్ ఏంజిల్స్, న్యూమెక్సికోలలో జరిగిన ఇలాంటి కేసుల్లో జ్యూరీలు మెటాకు వ్యతిరేకంగా తీర్పులు ఇచ్చాయి, వాటిపై మెటా అప్పీలు చేయనుంది. సోషల్ మీడియా అడిక్షన్ అనేది అధికారికంగా గుర్తించిన మానసిక వ్యాధి కాదని మెటా వాదిస్తోంది. ఈ కేసును పరిశ్రమ నిపుణులు సోషల్ మీడియా రంగానికి 'బిగ్ టొబాకో' తరహా కీలక ఘట్టంగా అభివర్ణిస్తున్నారు. ఈ విచారణ సుమారు ఆరు వారాల పాటు కొనసాగనుంది.



## ధనంజయ, దినుష పోరాటం..
# పట్టు బిగిస్తున్న టీమిండియా

శ్రీలంకతో గాలె టెస్టులో టీమిండియా పట్టు బిగించింది. భారత బౌలర్ల విజృంభణతో లంక బ్యాటర్లు ఆరంభంలోనే పెవిలియన్‌కు వరుస కట్టారు. భారీ లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో శ్రీలంక కేవలం 47 పరుగులకే నాలుగు వికెట్లు కోల్పోవడం బ్యాటర్ల వైఫల్యానికి నిదర్శనం.

**తొలి ఇన్నింగ్స్ ఇలా**

ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ 2025-27 సీజన్‌లో భాగంగా టీమిండియా రెండు మ్యాచ్‌లు ఆడేందుకు శ్రీలంకకు వెళ్లింది. ఈ క్రమంలో ఇరుజట్ల మధ్య గాలె స్టేడియంలో శనివారం తొలి టెస్టు మొదలైంది. టాస్ గెలిచిన టీమిండియా తొలుత బ్యాటింగ్‌కు దిగి.. తొలి ఇన్నింగ్స్‌లో 462 పరుగులకు ఆలౌట్ అయింది. టాపార్డర్‌లో ఓపెనర్ కేఎల్ రాహుల్ అర్ధ శతకం (82) సాధించగా.. వన్‌డౌన్ బ్యాటర్ దేవదత్ పడిక్కల్ భారీ సెంచరీతో కదం తొక్కాడు. మొత్తంగా 230 బంతులు ఎదుర్కొని 167 పరుగులు సాధించాడు. వీరితో పాటు ఆరో నంబర్ బ్యాటర్ ధ్రువ్ జురెల్ హాఫ్ సెంచరీ (51)తో రాణించాడు.

**లంకను కట్టడి చేసిన భారత బౌలర్లు**

లంక బౌలర్లలో స్పిన్నర్లలో ప్రభాత్ జయసూర్య నాలుగు వికెట్లతో విజృంభించగా.. కేశారా నువాంత మూడు వికెట్లు పడగొట్టాడు. పేసర్ అసిత ఫెర్నాండో రెండు వికెట్లు తన ఖాతాలో వేసుకున్నాడు. అనంతరం శ్రీలంక బ్యాటింగ్‌కు దిగి 284 పరుగులకు ఆలౌట్ అయింది. భారత స్పిన్నర్లలో మానవ్ సుతార్ నాలుగు వికెట్లతో చెలరేగగా.. రవీంద్ర జడేజా మూడు, కుల్దీప్ యాదవ్ ఒక వికెట్ దక్కించుకున్నారు. పేసర్లు మహ్మద్ సిరాజ్, ప్రసిద్ కృష్ణ చెరో వికెట్ కూల్చారు. దీనిని బట్టి ఓవరాల్‌గా ఇరుజట్ల తొలి ఇన్నింగ్స్‌లో స్పిన్నర్ల హవా కొనసాగిందని చెప్పవచ్చు. అయితే, రెండో ఇన్నింగ్స్‌కు వచ్చే సరికి కథ మారిపోయింది. ఈసారి పిచ్ కాస్త పేస్ బౌలర్లకు అనుకూలించగా.. లంక పేసర్లు అసిత ఫెర్నాండో, లాహిరు కుమార టీమిండియా బ్యాటింగ్ ఆర్డర్‌ను కుదేలు చేశారు. అసిత నాలుగు వికెట్లు తీయగా.. కుమార రెండు వికెట్లు దక్కించుకున్నాడు. ప్రభాత్ జయసూర్యకు మూడు వికెట్లు దక్కగా.. కేశారా ఒక వికెట్ తీశాడు.

**ఈసారి 193 పరుగులకే ఆలౌట్**

లంక బౌలర్ల విజృంభణ కారణంగా రెండో ఇన్నింగ్స్‌లో 193 పరుగులకే కుప్పకూలింది. అయితే, తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం 178 పరుగులు కలుపుకొని.. శ్రీలంకకు 372 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించగలిగింది. ఈ క్రమంలో బ్యాటింగ్‌కు దిగిన శ్రీలంక 47 పరుగులకే నాలుగు వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. పేసర్ సిరాజ్ నిశాన్ మధుష్క (6)ను అవుట్ చేయగా భారత్ వికెట్ల ఖాతా తెరిచింది. స్పిన్నర్ మానవ్ సుతార్ పసిందు సూరియబండారా (0), లాహిరు ఉదార (16)లను పెవిలియన్‌కు పంపగా.. మరో పేసర్ ప్రసిద్ కృష్ణ కమిందు మెండిస్ (2)ను అవుట్ చేశాడు.

**పీకల్లోతు కష్టాల్లో కూరుకుపోయిన వేళ**

ఇలా లంక పీకల్లోతు కష్టాల్లో కూరుకుపోయిన వేళ కెప్టెన్ ధనంజయ డి సిల్వతో కలిసి సొనాల్ దినుష ఇన్నింగ్స్ చక్కదిద్దే ప్రయత్నం చేస్తున్నాడు. మంగళవారం నాటి నాలుగో రోజు ఆట ముగిసే సరికి ధనంజయ 31, దినుష 25 పరుగులతో క్రీజులో నిలిచారు. ఫలితంగా లంక ఆట పూర్తయ్యేసరికి 34 ఓవర్లలో నాలుగు వికెట్ల నష్టానికి 84 పరుగులు చేయగలిగింది. ఇక బుధవారం ఆటకు చివరి రోజు కాగా.. లంక విజయానికి 288 పరుగుల దూరంలో ఉండగా.. చేతిలో ఆరు వికెట్లు ఉన్నాయి. కాగా బుధవారం వీలైనంత త్వరగా భారత బౌలర్లు ధనంజయ, దినుష జోడీని విడదీయాల్సి ఉంటుంది. దినుష తొలి ఇన్నింగ్స్‌లో సెంచరీ (100) చేసిన సంగతి తెలిసిందే.






## స్పోర్ట్స్

### ఆట అదిరినా.. 'విలియమ్స్ సిస్టర్స్'కు విజయం దక్కలే..!




ఒకప్పుడు మహిళల టెన్నిస్‌ను ఏలిన 'విలియమ్స్ సిస్టర్స్' మునపటి జోరు చూపలేకపోయారు. కోర్టులోకి దిగారంటే తిరుగులేని ఆధిపత్యంతో రికార్డులు బద్ధలుకొట్టే సెరీనా విలియమ్స్, వీనస్ విలియమ్స్‌లు నాలుగేళ్ల తర్వాత డబుల్స్‌లో ఆడిన తొలి మ్యాచ్‌లోనే ఓటమి చవిచూశారు. వైల్డ్ కార్డ్ ఎంట్రీతో సిన్సినాటి ఓపెన్‌లో బరిలోకి దిగిన ఈ అమెరికా నల్లకలువలు ప్రేక్షకులను అలరించారు. కానీ, మ్యాచ్ మాత్రం గెలవలేకపోయారు. గ్రాండ్‌స్లామ్, ఏటీపీ టూర్.. టోర్నీ ఏదైనా టైటిల్ మాదే అన్నట్టు చెలరేగి ఆడే విలియన్స్ సిస్టర్స్ మరోసారి జంటగా అభిమానులను అలరించారు. నాలుగేళ్ల విరామం తర్వాత వీరిద్దరూ మహిళల డబుల్స్‌లో తొలిసారి ఆడారు. సిన్సినాటి ఓపెన్‌లో వైల్డ్ కార్డ్ ఎంట్రీ ఇచ్చిన వీరు అనూహ్యంగా మర్టా కొస్ట్యుక్ -- పీటన్ స్టీర్న్స్ చేతిలో ఓటమి పాలయ్యారు . కోర్టులో తమదైన షాట్లతో ఆకట్టుకున్న ఈ వెటరన్ సిస్టర్స్ తొలి సెట్ కోల్పోయినా రెండో సెట్‌లో పుంజుకున్నారు. కానీ, నిర్ణయాత్మక మూడో సెట్‌లో మాత్రం తేలిపోయారు. మొత్తంగా మూడు సెట్ల పోరులో 2-6, 6-1, 8-10తో మ్యాచ్ చేజార్చుకుని టోర్నీ నుంచి నిష్క్రమించారీ లెజెండ్స్. ఇదివరకూ 2022 యూఎస్ ఓపెన్‌లో చివరిసారిగా కలిసి ఆడారీ వెటరన్ సిస్టర్స్. గతంలో డబుల్స్ జోడీగా వీరు 14 టైటిళ్లు సాధించిన విషయం తెలిసిందే.

## సీఎం విజయ్ తనయుడి 'సిగ్మా' రిలీజ్ డేట్ ఫిక్స్.. గాంధీ జయంతిన రాబోతున్న సందీప్ కిషన్!

కోలీవుడ్ స్టార్ హీరో, తమిళనాడు సీఎం విజయ్ తనయుడు జేసన్ సంజయ్ దర్శకుడిగా పరిచయమవుతున్న మోస్ట్ అంటెసిపేటెడ్ యాక్షన్ హీస్ట్ డ్రామా 'సిగ్మా'. టాలెంటెడ్ హీరో సందీప్ కిషన్ కథానాయకుడిగా నటిస్తున్న ఈ సినిమాకు సంబంధించిన అప్‌డేట్ ప్రస్తుతం సినీ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశమైంది. ప్రముఖ నిర్మాణ సంస్థ లైకా ప్రొడక్షన్స్ పతాకంపై సుభాస్కరన్ అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్న ఈ చిత్రానికి సంబంధించి మేకర్స్ తాజాగా అధికారిక విడుదల తేదీని ప్రకటించారు. గాంధీ జయంతి కానుకగా 2026 అక్టోబర్ 2వ తేదీన ఈ చిత్రాన్ని ప్రపంచవ్యాప్తంగా ఘనంగా థియేటర్లలో విడుదల చేయనున్నట్లు చిత్ర బృందం వెల్లడించింది. ఈ ప్రకటనతో పాటు విడుదల చేసిన సరికొత్త పోస్టర్‌లో సందీప్ కిషన్ మునుపెన్నడూ లేని విధంగా అత్యంత ఇంటెన్స్ లుక్‌లో కనికట్టు చేస్తున్నారు. ఈ చిత్రంలో సందీప్ కిషన్ సరసన టాలెంటెడ్ బ్యూటీ ఫరియా అబ్దుల్లా కథానాయికగా నటిస్తుండగా, నూతన దర్శకుడి ప్రతిభకు తగ్గట్టుగా భారీ తారాగణం ఈ సినిమాలో భాగమైంది. ప్రముఖ కొరియోగ్రాఫర్, నటుడు రాజు సుందరం, వర్సటైల్ యాక్టర్ సంపత్ రాజ్, శివ్ పండిట్, అన్బు దాసన్, యోగ్ జాపీ, షీలా రాజ్‌కుమార్ మరియు కిరణ్ కొండ వంటి ప్రముఖ నటీనటులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. సాంకేతిక నిపుణుల విషయానికి వస్తే, స్టార్ మ్యూజిక్ డైరెక్టర్ ఎస్. థమన్ ఈ సినిమాకు అదిరిపోయే సంగీతం అందిస్తుండగా, కృష్ణన్ వసంత్ సినిమాటోగ్రఫీ బాధ్యతలు మరియు ప్రవీణ్ కేఎల్ ఎడిటింగ్ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తున్నారు. ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఈ సినిమా విడుదల తేదీ ఖరారు కావడంతో, రాబోయే రోజుల్లో టీజర్, పాటలతో పాటు ప్రచార కార్యక్రమాలను వేగవంతం చేసేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు.





## రజినీకాంత్ 'జైలర్ 2' నుంచి అదిరిపోయే అప్‌డేట్..

### ఫస్ట్ సింగిల్ వచ్చేది అప్పుడే!

సూపర్ స్టార్ రజినీకాంత్ హీరోగా, నెల్సన్ దిలీప్‌కుమార్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న సీక్వెల్ చిత్రం 'జైలర్ 2' నుంచి మేకర్స్ తాజాగా ఒక అదిరిపోయే అప్‌డేట్‌ను విడుదల చేశారు. ది ఫీస్ట్ ఈజ్ రెడీ అంటూ చిత్ర బృందం ఈ సినిమా నుంచి ఫస్ట్ సింగిల్ అనౌన్స్‌మెంట్‌ను పంచుకుంది. ఈ ఫస్ట్ సింగిల్ ఆగస్టు 21వ తేదీన విడుదల కానున్నట్లు చిత్రబృందం తెలిపింది. రాక్ స్టార్ అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రంపై అభిమానుల్లో విపరీతమైన క్రేజ్ ఉంది. మొదటి భాగం మ్యూజిక్‌తో ఏ విధంగా థియేటర్లను షేక్ చేసిందో, ఇప్పుడు ఈ సీక్వెల్ సాంగ్ తో కూడా అదే రేంజ్ మ్యాజిక్ రిపీట్ చేయడానికి అనిరుధ్ సిద్ధమవుతున్నారు. మరోవైపు ఈ సినిమాను అక్టోబర్ 15వ తేదీన ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల చేయనున్నట్లు మేకర్స్ ఇప్పటికే ప్రకటించారు. ఈ చిత్రంలో రజినీకాంత్‌తో పాటు పలువురు ప్రముఖ నటీనటులు కీలక పాత్రల్లో నటిస్తుండగా, విజయ్ కార్తీక్ కన్నన్ సినిమాటోగ్రఫీ, నిర్మల్ ఎడిటింగ్ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.




## ఎన్టీఆర్-త్రివిక్రమ్ సినిమాపై హాట్ టాపిక్..

### ట్రెండింగ్‌లో ఆ రెండు టైటిల్స్!

టాలీవుడ్ మోస్ట్ అంటెసిపేటెడ్ కాంబినేషన్లలో ఒకటైన యంగ్ టైగర్ ఎన్టీఆర్, స్టార్ డైరెక్టర్ త్రివిక్రమ్ శ్రీనివాస్ కలయికలో రాబోయే సినిమాకు సంబంధించి ఇండస్ట్రీలో ఒక ఆసక్తికర వార్త తెగ చక్కర్లు కొడుతోంది. ఈ క్రేజీ ప్రాజెక్ట్‌కు సంబంధించి ప్రముఖ నిర్మాణ సంస్థ 'ఎన్టీఆర్ ఆర్ట్స్' తాజాగా రెండు సూపర్ టైటిల్స్‌ను అధికారికంగా రిజిస్టర్ చేయించినట్లు తెలుస్తోంది. తారక్ త్రివిక్రమ్ కాంబినేషన్‌లో వస్తున్న ఈ సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొనగా, తాజాగా బయటకు వచ్చిన ఈ టైటిల్స్ మరింత హైప్‌ను సృష్టిస్తున్నాయి. ఈ చిత్రానికి సంబంధించి మేకర్స్ 'దేవసేనాపతి' మరియు 'గాడ్ ఆఫ్ వార్' అనే రెండు టైటిల్స్‌ను ట్రేడ్ వర్గాల్లో రిజిస్టర్ చేయించినట్లు సమాచారం. ఈ రెండు టైటిల్స్ వింటుంటేనే ఇదొక పౌరాణిక టచ్ ఉన్న హై-వోల్టేజ్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ఉండబోతుందనే ఊహాగానాలు ఫ్యాన్స్ మధ్య జోరుగా సాగుతున్నాయి. ఈ చిత్రానికి సంబంధించి త్వరలోనే మేకర్స్ నుంచి అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉంది. ఎన్టీఆర్ కెరీర్‌లో మరో మైలురాయిగా నిలవనున్న ఈ ప్రాజెక్ట్‌కు ఏ టైటిల్ ఫిక్స్ చేస్తారనేది ప్రస్తుతం సర్వత్రా ఉత్కంఠ రేకెత్తిస్తోంది.

## తెలంగాణ నేపథ్యంలో తెరకెక్కిన 'పల్లెబురుసు'పై బాలీవుడ్ దర్శకుడు అనురాగ్ కశ్యప్ ప్రశంసలు!



తెలంగాణ గ్రామీణ నేపథ్యంలో తెరకెక్కిన 'పల్లెబురుసు' చిత్రం విడుదలై ప్రేక్షకుల నుంచి ప్రశంసలు అందుకుంటున్న సంగతి తెలిసిందే. టాలీవుడ్‌లో ఇటీవల కాలంలో వస్తున్న భారీ యాక్షన్ సినిమాలకు పూర్తి భిన్నంగా, అత్యంత సహజమైన కుటుంబ కథాంశంతో రూపొందిన ఈ సినిమాపై ఇప్పటికే పలువురు ప్రశంసలు కురిపించారు. అయితే తాజాగా ఈ సినిమా చూసిన ప్రముఖ బాలీవుడ్ దర్శకుడు అనురాగ్ కశ్యప్ ప్రశంసల వర్షం కురిపించారు. లెటర్‌బాక్స్ వేదికగా ఈ చిత్రానికి ఏడుకి ఐదు స్టార్ల రేటింగ్ ఇస్తూ ఆయన ఒక అద్భుతమైన రివ్యూను పంచుకున్నారు. ప్రస్తుత చిత్ర పరిశ్రమలో రొటీన్ యాక్షన్ సినిమాల జోరు ఎక్కువగా ఉందని, వాటి మధ్య ఈ 'పల్లెబురుసు' ఒక సరికొత్త రిఫ్రెషింగ్ మార్పులా కనిపిస్తోందని అనురాగ్ కశ్యప్ కొనియాడారు. సినిమా చాలా సింపుల్‌గా, ఆకట్టుకునేలా సాగుతూ ప్రేక్షకులను నిత్యం నవ్విస్తుందని ఆయన తెలిపారు. 'కేరాఫ్ కంచరపాలెం', 'రావు బహదూర్' చిత్రాల దర్శకుడు వెంకటేష్ మహా ఎంట్రీని గుర్తుచేస్తూ, నూతన దర్శకుడు ఉదయ్ చౌహాన్ భవిష్యత్తులో మరిన్ని గొప్ప సినిమాలు తీయగలడంటూ ఆయనను ప్రత్యేకంగా ప్రశంసించారు. కేవలం లెటర్‌బాక్స్‌లోనే కాకుండా ఇన్‌స్టాగ్రామ్‌లోనూ ఈ సినిమాపై తన అభిప్రాయాలను పంచుకుంటూ, ఇదొక అరుదైన డ్రామెడీ (డ్రామా ం కామెడీ) చిత్రమని అభివర్ణించారు. సాధారణ కుటుంబంలో తండ్రీకొడుకుల మధ్య జరిగే ఒక చిన్న వివాదం చుట్టూ ఈ కథ నడుస్తుంది. తెలంగాణ గ్రామీణ నేపథ్యంలో సాగే ఈ చిత్రంలో కొడుకు తనకు టూత్ బ్రష్ కొనివ్వలేదంటూ ఒక వృద్ధ తండ్రి పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించడం కథాంశం. ఈ చిన్న ఫిర్యాదు కాస్తా క్రమంగా పెద్ద లీగల్ మరియు భావోద్వేగ యుద్ధంగా మారి, వారి మధ్య సంవత్సరాలుగా దాగి ఉన్న ఏకాంతం, మనస్పర్థలను ఎలా బయటపెట్టిందనేదే ఈ చిత్ర కథాసారాంశం. ఈ చిత్రంలో సుధాకర్ రెడ్డి, మురళీధర్ గౌడ్ తండ్రీకొడుకులుగా ప్రధాన పాత్రల్లో నటించి అద్భుతమైన అభినయాన్ని ప్రదర్శించారు. ఉదయ్ చౌహాన్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రానికి అన్నపూర్ణ స్టూడియోస్ మరియు ఎపిక్ స్టూడియోస్ సంయుక్తంగా నిర్మాణం వహించగా, నాగార్జున ఈ ప్రాజెక్ట్‌ను సమర్పించారు. స్వాతంత్ర్య దినోత్సవ కానుకగా ఆగస్టు 14న థియేటర్లలో విడుదలైన ఈ చిత్రం ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంటోంది. శ్మశానవాటికలో ఏడుస్తున్న ఒక

## రవితేజ 'ఇరుముడి' సెన్సార్ పూర్తి.. రన్‌టైం ఎంతంటే!

టాలీవుడ్ మాస్ మహారాజా రవితేజ నటిస్తున్న తాజా సంచలన చిత్రం 'ఇరుముడి' థియేట్రికల్ విడుదలకు సర్వం సిద్ధం చేసుకుంది. దర్శకుడు శివ నిర్వాణ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రంపై ప్రేక్షకుల్లో మరియు ట్రేడ్ వర్గాల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. అయితే తాజాగా సెన్సార్ కార్యక్రమాలను పూర్తి చేసుకున్న ఈ సినిమా 'యు/ఎ' సర్టిఫికేట్‌ను సొంతం చేసుకుంది. అలాగే సినిమా రన్‌టైమ్‌ను రెండు గంటల ఇరవై ఐదు నిమిషాల నిడివి తో లాక్ చేసినట్లు మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. ఈ చిత్రంలో రవితేజ పూర్తి భిన్నమైన, సరికొత్త పాత్రలో కనిపించను న్నారు. మధ్యతరగతి కుటుంబసభ్యుడిగా, కూతురు పాత్రలో నటించిన బేబీ నక్షత్రాతో ఆయన సాగే అనుబంధం ఈ సినిమాకు ప్రధాన భావోద్వేగ బలంగా నిలవనుంది. ముఖ్యంగా ఆల్కహాల్ వ్యసనంతో పోరాడే ఒక మధ్యతరగతి వ్యక్తి జీవితం, భవిష్యత్తులో అయ్యప్ప దీక్షను స్వీకరించి మాల ధరించిన తర్వాత ఎలాంటి ఆధ్యాత్మిక పరివర్తన చెందుతుందనే కోణంలో ఈ కథ సాగనుంది. గ్రామీణ వాతావరణం, సహజసిద్ధమైన లొకేషన్లు మరియు ఏజెన్సీ ప్రాంతాల నేపథ్యంలో ఈ సినిమా సాగుతుందని, ఇది ప్రేక్షకులకు ఒక కొత్త అనుభూతిని పంచుతుందని చిత్ర యూనిట్ ధీమా వ్యక్తం చేస్తోంది. ఈ చిత్రంలో రవితేజ సరసన ప్రియా భవానీ శంకర్ హీరోయిన్‌గా నటిస్తుండగా, సాయి కుమార్, అజయ్ ఘోష్, స్వసిక తదితరులు కీలక పాత్రలలో కనిపించనున్నారు. ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతున్న ఈ సినిమా ఆగస్టు 22వ తేదీన ప్రపంచవ్యాప్తంగా భారీ ఎత్తున గ్రాండ్ థియేట్రికల్ విడుదలకు సిద్ధమవుతోంది




Printed by Sree Seshasai Enterprises Published by Vaddi Srinivas Reddy on behalf of Sai Krishna Publications, printed at # 3-88, Chandra Theater, Main Road, Gosala, Krishna District - 521151 Andhra Pradesh and published at D.No. 6-121, 1st Floor, Sphurthy Building, Gosala Village, Urdu School Street, Vijayawada, Krishna District-521151 Andhra Pradesh. Editor Vaddi Srinivas Reddy- 94402 31967 . PRGI No. APTEL/26/A0119,